RNI. No: TELTEL/2023/88215

# తెలంగాణ దిశ

TELANGANA DISHA TELUGU DAILY తెలుగు దినపత్రిక

మల్కాజిగిరి MALKAJGIRI | సంపుటి : 2 VOLUME : 2 | సంచిక : 323 ISSUE NO : 323 | ఎడిటర్ : మెరుగు చంద్రమోహన్ EDITOR : MERUGU CHANDRAMOHAN | శనివారం, జూన్, 14, 2025 Saturday, June,14,2025 | పేజీలు : 8 వెల : రూ.4/- PAGES : 8 RS : 4 /-



## బోయింగ్ 787 విమానాల భద్రతా తనిఖీని పెంచండి..

## ఎయిర్ ఇండియాకు డీజీసీఏ ఆదేశం...

**న్యూఢిల్లీ,జూన్, 13:** ఎయిర్ ఇండియాకు చెందిన బోయింగ్ 787 డ్రీమ్ లైనర్ విమానాల భద్రతా తనిఖీని పెంచాలని పౌర విమానయాన డైరెక్టరేట్ జనరల్ (డీజీసీఏ) ఆదేశించింది.టాటా గ్రూప్ యాజమాన్యంలోని ఎయిర్ ఇండియా నిర్వహించే బోయింగ్ 787 డ్రీమ్‌లైనర్ విమానాల్లోని పలు వ్యవస్థలను ఎప్పటికప్పుడు చెక్ చేయాలని, టేకాఫ్ నిబంధనలను సమీక్షిం చాలని సూచించింది. క్యాబిన్ ఎయిర్ కంప్రెసర్, అనుబంధ వ్యవస్థల తనిఖీ, ఎలక్ట్రానిక్ ఇంజిన్ కంట్రోల్ సిస్టమ్ టెస్ట్, ఇంజిన్ ఇంధనంతో నడిచే యాక్చుయేటర్-ఆపరేషనల్ టెస్ట్, ఆయిల్ సిస్టమ్ తనిఖీలను చేపట్టాలని డీజీసీఏ శుక్రవారంఆదేశించింది.కాగా, గుజరాత్‌లోని అహ్మ దాబాద్‌లో ఎయిర్ ఇండియా విమానం కూలిన ప్రమాదంలో అందులోని ప్రయాణికులు, సిబ్బం దితో సహా 241 మంది మరణించారు. బోయింగ్ డ్రీమ్‌లైనర్ 787-8 విమానాల గ్రౌండింగ్ అంశాన్ని కేంద్ర ప్రభుత్వం పరిశీలిస్తున్నది.

## విజయ్ భాయ్ ఇక లేరంటే

# నమ్మలేకపోతున్నాను..

గుజరాత్:గుజరాత్ మాజీ ముఖ్యమంత్రి, బీజేపీ సీనియర్ నేత విజయ్ రూపానీ అహ్మదాబాద్‌లో జరిగిన ఘోర విమాన ప్రమాదంలో మరణించడం పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన విజయ్ రూపానీ కుటుంబ సభ్యులను కలిసి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా రూపానీతో తనకున్న దశాబ్దాల అనుబంధాన్ని, పార్టీ సిద్ధాంతాల పట్ల ఆయనకున్న నిబద్ధతను మోదీ గుర్తుచేసుకున్నారు. "విజయ్‌భాయ్ రూపానీ కుటుంబాన్ని కలిసి నా సంతాపం తెలియజేశాను. విజయ్‌భాయ్ ఇక లేరనే వార్తను నేను అంగీకరించలేకపోతున్నాను. ఆయనతోనాకు సంవత్సరాల తరబడి అనుబంధం ఉంది. ఎన్నో క్లిష్ట సమయాల్లో మేమిద్దరం భుజం భుజం కలిపి పనిచేశాం" అని ప్రధాని మోదీ సోషల్ మీడియా వేదిక'ఎక్స్'లో పోస్ట్ చేశారు. రూపానీ అత్యంత నిరాడంబరమైన,సౌమ్య స్వభావం కలిగిన వారని, కష్టపడి పని చేసే తత్వం, పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ఉండేవారని ప్రధాని కొనియాడారు. పార్టీ సంస్థాగత బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూనే ఆయన గుజరాత్ ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగారని గుర్తు చేసుకున్నారు. రాజ్‌కోట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో పనిచేసినా, రాజ్యసభ సభ్యుడిగా, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడిగా, కేబినెట్ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించినా, ప్రతి పాత్రలోనూవిజయ్ రూపానీ తనదైన ప్రత్యేక ముద్ర వేశారని ప్రధాని మోదీ పేర్కొన్నారు. "విజయ్‌భాయ్ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆయనతో కలిసి పనిచేసే అవకాశం నాకు లభించింది. గుజరాత్ అభివృద్ధి ప్రస్థానాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు ఆయన ఎన్నో చర్యలు తీసుకున్నారు, అందులో 'ఈజ్ ఆఫ్ లివింగ్' (జీవన సౌలభ్యం) ఒకటి. ఆయనతో జరిగిన సమావేశాలు,చర్చలు ఎప్పటికీ గుర్తుంటాయి" అని ప్రధానిమోదీ తెలిపారు. విజయ్ రూపానీ గురువారం మధ్యాహ్నం అహ్మదాబాద్ నుంచి లండన్‌కుబయలుదేరిన ఎయిర్ ఇండియా విమానంలో ప్రయాణిస్తుండగా ఈ దుర్ఘటనజరిగింది. టేకాఫ్ అయిన కొద్ది నిమిషాలకే విమానం కుప్పకూలింది. ఈ విమానంలోఇద్దరుపైలట్లు,10మంది సిబ్బందితో పాటు230 మంది ప్రయాణికులు,మొత్తం 242మంది ఉన్నారు.



రూపానీ కుటుంబ సభ్యులను పరామర్శించిన ప్రధాని నరేంద్ర మోదీ



## ఓటుకు నోటు కేసు..

## సీఎం రేవంత్‌కు ఊరట...

**హైదరాబాద్,జూన్ 13,తెలంగాణ దిశ:** తెలుగు రాజకీయాల్లో కలకలం రేపిన ఓటుకు నోటు కేసుమరోసారి చర్చకు వచ్చింది. శుక్రవారం ఓటుకు నోటు కేసుపై నాంపల్లి కోర్టు విచారణ జరిగింది. అయితే నేటి విచారణ నుంచి తనకు మినహాయింపు ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డిచేసిన అభ్యర్థనను కోర్టు పరిగణలోకి తీసుకుంది. సీఎం రేవంత్ రెడ్డితో పాటు ఈ కేసులో నిందితులైన సెబాస్టియన్, ఉదయ్‌సింహా,వేంకృష్ణకీర్తన్‌లకుమినహాయింపు ఇచ్చింది.మరోవైపు ఇవాళ్టి విచారణకు సండ్ర వెంకట వీరయ్య, మత్తయ్య హాజరయ్యారు.విచారణ వేగంగా జరిపి కేసును తేల్చాలని వారు డిమాండ్ చేశారు.

# కేటీఆర్‌కు ఏసీబీ నోటీసులు..

## దమ్ముంటే లై డిటెక్టర్ టెస్టుకు రా: రేవంత్ రెడ్డికి కేటీఆర్ సవాల్



**హైదరాబాద్, జూన్ 13,తెలంగాణ దిశ:** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌కు ఏసీబీ నోటీసులు ఇచ్చింది. ఫార్ములా ఈ రేసు కేసుకు సంబంధించి ఈనెల 16న ఉదయం పది గంటలకు విచారణకు హాజరు కావాల్సిందిగా ఏసీబీ నోటీసుల్లో పేర్కొంది. అయితే ఈ కేసుకు సంబంధించి గత నెల మే 28న విచారణకు హాజరుకావాల్సిందిగా మే 26వ తేదీన కేటీఆర్‌కు ఏసీబీ నోటీసులు పంపింది. అయితే ఆసమయంలో కేటీఆర్ అమెరికా పర్యటనలో ఉన్నారు. ఈనేపథ్యంలో విదేశీ పర్యటన ముగిసిన తర్వాత విచారణకు హాజరువుతానని ఏసీబీకి మాజీ మంత్రి సమాచారం ఇచ్చారు. దానికిఅంగీకారం తెలిపిన ఏసీబీ.. తాజాగా మరోసారి కేటీఆర్‌కు నోటీసులు జారీ చేసింది. కాగా..ఫార్ములా ఈ రేస్ కేసుకు సంబంధించి గతంలో ఒకసారి కేటీఆర్ ఏసీబీ, ఈడీ ముందు విచారణకు హాజరైన విషయం తెలిసిందే. జనవరి 6న లాయర్లతో కలిసి ఏసీబీ విచారణకు వెళ్లిన కేటీఆర్‌ను అధికారులు అనుమతించకపోవడం తిరిగి వెళ్లిపోయారు. తిరిగి మరోసారి జనవరి 8నఏసీబీ విచారణ హాజరయ్యారు మాజీ మంత్రి. దీంతో దాదాపు 7గంటల పాటు ఆయనను ఏసీబీ విచారించింది. జనవరి 9న మరోసారి విచారణకు పిలవగా.. కేటీఆర్ సమయం కోరారు. ఇక మున్సిపల్ శాఖ కార్యదర్శి అర్వింద్ కుమార్,హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజనీర్ బీఎల్ఎన్ రెడ్డిలను ఏసీబీ విచారించింది. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో హైదరాబాద్ వేదికగా ఫార్ములా ఈ రేస్ నిర్వహించారు. అయితే ఇందులో రూ.55 కోట్లు దుర్వినియోగం జరిగినట్లు ఏసీబీ కేసు నమోదు చేసింది. ఈ కేసులో ముగ్గురు పేర్లను ఏసీబీ ఎఫ్ఐ ఆర్‌లో నమోదు చేసింది.

# జూలై నాటికి సర్పంచ్ ఎన్నికలు: మంత్రి సీతక్క




**హైదరాబాద్,జూన్ 13,తెలంగాణ దిశ:** స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నద్ధం అవుతోంది. ఈ క్రమంలోనేలోకల్ బాడీ ఎన్నికలపై తాజాగా మంత్రి సీతక్క ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మహబూబాబాద్ జిల్లాలో పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమా లను ప్రారంభించిన ఆమె ఈ సందర్భంగా మాట్లాడుతూ సర్పంచ్ ఎన్నికలను జూలైలో నిర్వహించబోతున్నామని, ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్ త్వరలోనే విడుదల కానుందని చెప్పారు. ఈ ఎన్నికల్లో అన్ని జీపీలను కాంగ్రెస్ కైవసం చేసుకోవాలని, అందుకోసం పార్టీలో కొత్త,పాత నేతలు అనే భేదాభిప్రాయాలు లేకుండా అందరూ సమిష్టిగా పని చేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు. ఎన్నికల నిర్వహణ విషయాన్ని ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తనతో భేటీ అయిన ఆయా జిల్లాల నేతలకు హింట్ ఇచ్చినట్లు తెలుస్తోంది. జూలైలో ఎన్నికలు నిర్వహించబోతున్నట్లు అందుకు సిద్ధంగా ఉండాలని సూచించినట్లు ప్రచారం జరుగుతోంది. అందుకు అనుగుణంగా గత వారం నుంచి రాష్ట్ర మంత్రులు సైతం స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయంపై ఫోకస్ పెట్టారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు తాము పాల్గొంటున్న సమావేశాల్లో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల అంశాన్ని పదే పదే ప్రస్తావిస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించినట్లుగానే లోకల్ బాడీ ఎన్నికల్లోనూ గెలిపించాలని ప్రజలను కోరుతున్నారు.మంత్రుల నోట ఎన్నికల అంశం ప్రస్తావన పెరుగుతుండటంతో ఏ క్షణంలోనేనా నోటిఫికేషన్ రాబోతున్నదనే చర్చ రాష్ట్ర రాజకీయ వర్గాల్లో జోరుగా వినిపిస్తోంది.

## పరిస్థితి మరింత దిగజారుతుంది

## ఇరాన్‌కు ట్రంప్ వార్నింగ్..



**న్యూఢిల్లీ,జూన్, 13:**ఇరాన్‌పై ఇజ్రాయిల్ దాడుల గురించి తమకు ముందే సమాచారం ఉందని అమె రికా ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు. ఫా క్స్ న్యూస్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ విష యాన్ని చెప్పారు. ఇజ్రాయిల్ దాడుల్లో ఇరాన్ రివ ల్యూషనరీ గార్డ్స్ కమాండర్ హుస్సేన్ సలామీతో సహా అనేక మంది మరణించినట్లు వెల్లడించారు ఇప్పటికే గొప్ప విధ్వంసం జరిగిందని,తర్వాత ప్లాన్ చేసిన దాడులు మరింత తీవ్రంగా ఉంటాయని, ముగింపుకు రావడానికి ఇంకా సమయం ఉందని, ఏమీ మిగిలుండక ముందే ఇరాన్ ఒక ఒప్పందాన్ని కుదుర్చుకోవాలని హెచ్చరించారు.

# ఫోన్ ట్యాపింగ్ కేసు.. వ్యూహం మార్చిన సిట్




**హైదరాబాద్,జూన్ 13,తెలంగాణ దిశ:** సుదీర్ఘకాలం అమెరికాలో తలదాచుకున్న ఎస్ఐబీ మాజీ చీఫ్ టి.ప్రభాకర్‌రావు తిరిగి రావడం, ఆయన విచారణ పర్వం కొనసాగు తుండటంతో అక్రమ ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తును సిట్ అధికారులు ముమ్మరం చేశారు. విచారణ అధికారులు అడుగు తున్న ప్రశ్నలకు ఆయన దాటవేత ధోరణిలో సమాధానాలు చెప్తుండటంతో తమ వ్యూహం మార్చారు. ఈ కేసులో ఇప్పటికే అరెస్టు అయి, బెయిల్‌పై బయటకు వచ్చిన నిందితులను మరోసారి ప్రశ్నించాలని నిర్ణయించారు. ఎస్ఐడీలోని ఎస్ఓటీకి నేతృత్వం వహించిన డి.ప్రణీత్‌రా వు ఈ కేసులో అరెస్టు అయిన తొలి నిందితుడు. ప్రస్తుతం బెయిల్‌పై ఉన్న ఈయన్ను బుధవారం ప్రభాకర్‌రావుతో కలిపి విచారించారు. తాజాగా శుక్రవారం సైతం విచారణ హాజరుకావాల్సిందిగా నోటీసులు జారీ చేశారు.



# చర్లపల్లిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా...

## అధికారులతో కలసి డివిజన్ లో పర్యటించిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి







**చర్లపల్లి, జూన్ 13,(తెలంగాణ దిశ):** చర్లపల్లి డివిజన్ ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం చర్లపల్లి డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో కుషాయిగూడ, వి ఎన్ రెడ్డి నగర్, సాయి కృష్ణ ఎన్ క్లేవ్,శివ సాయి నగర్, న్యూ వాసవి శివ నగర్, వైష్ణవి ఎన్ క్లేవ్, సోనియాగాంధీ నగర్, డీసీ కాలనీ, చర్లపల్లి విలేజ్, బిఎన్ రెడ్డి నగర్ లలో మంజూరు చేయించిన పలు అభివృద్ధి కార్యక్రమాలు, పనులను పరిశీలించారు. ఆయా కాలనీల సమస్య పరిష్కారానికి అధికారులతో కలిసి పర్యటించారు. ఈసందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూతన దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి తప్పకుండా కృషిచేస్తానని హామీ ఇచ్చారు. జిహెచ్ఎంసి, జలమండలి ఆధ్వర్యంలో జరుగుతున్న పనులను ఈ సందర్భంగా పరిశీలించారు. పార్టీలకు అతీతంగా ఉప్పల్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని ఆయన అన్నారు. అనంతరం కుషాయిగూడ లోని బస్తీ దవాఖానను ఆకస్మికం గా తనిఖీ చేశారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, సిబ్బంది సమయానికి రావాలని ఆదేశించారు.

అంగన్ వాడి కేంద్రాన్ని సందర్శించి అక్కడి నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

పిల్లలకు మంచి ఆహారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమం లో జిహెచ్ఎంసి అధికారు లు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు వివిధ కాలనీల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

**మంగళ హారతులతో ఆత్మీయ స్వాగతం**

చర్లపల్లి డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో కోట్లాది రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న బాక్స్ డ్రైన్, థీమ్ పార్క్, యుజిడి, రోడ్లు తదితర అభివృద్ధి పనులు చేపట్టడం పట్లహర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

ఇక అభివృద్ధి పనులునాణ్యత ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. ఈ సందర్భంగా అధ్వానంగా తయారైన నాగార్జున నగర్ రోడ్ నెంబర్ 1 బిటి రోడ్డును నిర్మించాలని, శివ సాయి నగర్ ఫేస్ 2 కుటుంబాలకు నీటి బిల్లులు మూడు రెట్లు అధికంగా వస్తున్నాయని, దీంతో నెల నెల నీటి బిల్లులు చెల్లించడానికి ఇబ్బందులు పడుతున్నామని పలు కుటుంబాలు, మహిళలు ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి దృష్టికి తీసుకువచ్చారు.



## డిపిఎస్ విద్యార్థులను ఆటోలు, వ్యాన్‌లలో ప్రయాణించనివ్వడం లేదు

### ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి మొర పెట్టుకున్న స్నేహ మిత్ర డ్రైవర్స్ అసోసియేషన్ సభ్యులు

**మల్లాపూర్, జూన్ 13, (తెలంగాణ దిశ):** ఢిల్లీ పబ్లిక్ స్కూల్ (డిపిఎస్) విద్యార్థులను ఆటోలు, వ్యాన్ లలో ప్రయాణించనివ్వడం లేదని స్నేహ మిత్ర డ్రైవర్స్ అసోసియేషన్ సభ్యులు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి మొర పెట్టుకున్నారు. శుక్రవారం సైనిక్ పురిలోని లక్ష్మారెడ్డి నివాసంలో ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి సమస్యను విన్నవించారు. నాచారం ఢిల్లీ పబ్లిక్ స్కూల్ లో గత 17 సంవత్సరాల నుండి ప్రవేటు ట్రాన్స్‌పోర్ట్ ఆటోలు, వ్యాన్లు నడుపుతున్నామని, ఈ సంవత్సరం నుండి బస్సులలో వ్యాన్లలో పిల్లలను ఎక్కవద్దని డిపిఎస్ యజమాన్యం వత్తిడి తెస్తుందన్నారు. స్కూల్ బస్సులలోనే రావాలని ఒత్తిడి తెస్తున్నారని, దీంతో తమకు బ్రతకడానికి వేరే దారి లేదని ఎమ్మెల్యేకు సమర్పించిన వినతి పత్రంలో పేర్కొన్నారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే బండారిలక్ష్మారెడ్డి ఢిల్లీ పబ్లిక్ స్కూల్ యాజమాన్యంతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ దేవేందర్ రెడ్డి ఆటో వ్యాన్ డ్రైవర్ అసోసియేషన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## టీపీసీసీ ఉపాధ్యక్షులు బండి రమేష్ కు అభినందనల వెల్లువ



**కుత్బుల్లాపూర్, జూన్ 13, (తెలంగాణ దిశ) :** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) ఉపాధ్యక్షులుగా నియమితులైన బండి రమేష్ ను శుక్రవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మహిళా కాంగ్రెస్ మేడ్చల్ జిల్లా అధ్యక్షురాలు రాజనోళ్ల లక్ష్మీ శుక్రవారం మర్యాదపూర్వ కంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూకట్ పల్లి నియోజకవర్గంలోని మహిళా కాంగ్రెస్ మేడ్చల్ ఉపాధ్యక్షురాలు జ్యోతి, ఏ బ్లాక్ అధ్యక్షురాలు రమాదేవి, బి బ్లాక్ అధ్యక్షురాలు సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

## 14న మల్కాజిగిరి జిల్లా కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్



**కుషాయిగూడ,జూన్ 13, (తెలంగాణ దిశ):** జాతీయ, తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ఈ నెల 14న కుషాయిగూడలోని మల్కాజిగిరి జిల్లా కోర్టుఆవరణలో జాతీయ లోక్ అదాలత్ ను నిర్వహిస్తు న్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్ పర్సన్, జిల్లా కోర్ట్ ప్రధాన న్యాయమూర్తి శ్రీమతి ఎస్ఎన్. శ్రీదేవి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని కోర్టు భవన సముదాయాల్లో జరిగే ఈ జాతీయ లోక్ అదాలత్ ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సివిల్ కేసులతో పాటు రాజీపడదగిన క్రిమినల్,వాహన ప్రమాదాలు, బ్యాంకు రికవరీ, చెక్ బౌన్స్, భూ వివాదాల వంటి కేసులను ఈ జాతీయ లోక్ అదాలత్ లో పరిష్కరిం చుకోవాలని ఆమె సూచించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సత్వర న్యాయాన్ని పొందాలని ఆమె సూచించారు.

# ఆపరేషన్ కగారును ఎత్తివేసి మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలి

- 17న ఇందిరాపార్క్ వద్ద మహాధర్నాను విజయవంతం చేయాలి
- తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్మన్ గద్దర్ వెన్నెల



**జవహర్ నగర్, జూన్ 13, (తెలంగాణ దిశ) :** జవహర్ నగర్ మున్సిపల్ కార్పోరేషన్ పరిధి బాలాజీ నగర్ లో క్రాంతి కళాబృందం వెంకటాచారి ఆధ్వర్యంలో శుక్రవారం 'ఆదివాసుల హనాన్ని ఆపాలి– శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేస్తూ అఖిలపక్షం రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గద్దర్ వెన్నెల హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దండకరణ్యంలో ఖనిజ సంపదలుఇనుము, మాంగనీస్,రాగి, కోబాట్, నికెల్, సీసం, జింక్, టైటానియం, జిర్కోనియం, భారీ టైట్ మైకా, గాలియం అంటిమోని, బొగ్గు, సున్నపురాయి, ఇనుము,రాగి, క్రొమైట్ మరియు బాస్కెట్ వంటి ఖనిజాలు లాంటి సహజ వనరులు ఉన్నాయన్నారు. ఇలాంటి ఖనిజ వనరులు భారతదేశ ప్రజల అవసరాలు,అభివృద్ధికి దోహద పడుతాయని గుర్తు చేశారు. ఈఖనిజసంపదను బిజెపి నరేంద్ర మోడీ ప్రభుత్వం కొంత మంది అంబానీ ఆదానీ లాంటి బడా కోటీశ్వరు లకు కట్టబెట్టే కుట్రలో భాగామే అన్నారు. అడవి నుండి ఆదివాసులను వెళ్లగొట్టేందుకు పాలు తాగే పసిపాప మొదలుకొని ముసలి వారిని ఆపరేషన్ కగార్ పేరుతో అత్యాచారాలు, హత్యలు గురిచేస్తున్నారని అన్నారు. హిట్లర్, ముస్సోలిన్ నే తలదన్నేలా నరేంద్రమోడీ ప్రభుత్వ ప్రయత్నాలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఆదివాసులకు అండగా పోరాడుతున్న మావోయిస్టులను పట్టుకొని చిత్రహింసలు పెట్టి, బూటకపు ఎన్ కౌంటర్ల పేరుతో చంపడాన్ని తీవ్రంగా ఖండించారు. మావోయిస్టు రాజకీయాలతో సంబంధం లేకపోయినా అటు ఆదివాసులు,ఇటు మావోయిస్టులు ఈ దేశ పౌరులేనని గ్రహించాలని సూచించారు. శాంతియుత రాజకీయ పరిష్కారానికి అనేకమంది బుద్ధి జీవులు,రాజకీయ పార్టీలు ప్రజా సంఘాలు చేస్తున్న ఆపరేషన్ కగర్ ను ఎత్తివేసి, మానవ హనన నివారణకు శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. న్యాయమైన ప్రజాస్వామికమైన డిమాండ్ ను నరేంద్ర మోడీ అమిత్ షా ప్రభుత్వం పరిగణలోకి తీసుకోవాలని కోరారు.

చట్టబద్ధ ప్రజాస్వామ్య రాజ్యాంగ పరిరక్షణకు పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమ నిర్మాణానికి పూనుకోవాల్సిన అవసరం ఉందని అఖిలపక్షం స్పష్టం చేసింది. ఈకార్యక్రమంలో గద్దర్ వెన్నెలతో పాటు గద్దర్ అభిమాన సంఘం సిఎల్. యదగిరి, మాజీ సర్పంచ్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శంకర్ గౌడ్, కాంగ్రెస్ ప్రెసిడెంట్ మల్లెపూల శ్రీకాంత్ యాదవ్, సిపిఐ మేడ్చల్ జిల్లాకార్యదర్శి ఉమా మహేష్, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు అనురాధ, పిడిఎం చంద్రమౌళి, ఇఫ్టూ జాతీయ కన్వీనర్ షేక్ షావలి, సిపిఎం నాగేష్, తెలంగాణ జర్నలిస్ట్ ఫ్రంట్ మోహన్ బైరాగి,కవి, రచయిత ఎస్.కే మీరా, సిపిఐ దర్శనం యాదగిరి,ఇఫ్టూ శివ బాబు, పిఓడబ్ల్యు (విముక్తి) పెర్క సునీత తదితరులు పాల్గొన్న వారిలో ఉన్నారు. ఈ కార్యక్రమంలో వెంకట చారి కళాబృందం మల్లంపల్లి రాజు, గోరటి నాగరాజు,డప్పు ప్రకాష్, అనూషకళాకారులు మరియుసామాజిక కార్యకర్త తెలంగాణ ఉద్యమకారిని పోత సునీత పాడిన ఉద్యమ పాటలు ఎంతగానో ఆక టుకున్నాయి. సమావేశానికి ముందు అంబేద్కర్‌విగ్రహానికి గద్దర్ వెన్నెల చేత పూల మాలలు వేయించి, రాజ్యాంగ పరిరక్షణకు నినదించా రు. అనంతరం గ్యార యాకన్న స్వయంగా రచించి,పాడిన అన్నలంటే? భ యమెందుకురో? అనే ఆడియోప్లేయర్‌ను ఆవిష్కరించారు.

# విద్యతో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చు

- మందుముల రజిత పరమేశ్వర్ రెడ్డి





**ఉప్పల్, జూన్ 13, (తెలంగాణ దిశ) :** విద్యతోనే పేదరిక నిర్మూలన సాధ్యమవుతుందని ఉప్పల్ కార్పొరేటర్ మందుముల రజితపరమేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. ఏదైనా సాధించాలనుకుంటే అది చదువుతో మాత్రమే సాధ్యమవుతుందన్నారు. శుక్రవారం ఉప్పల్ లోని కుమ్మరి బస్తీ కచ్చిర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఆమె పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తులు, నోట్ పుస్తకాలను పంపిణీ చేసి మాట్లాడారు. అదే విధంగా పాఠశాలకు ప్రైవేట్ స్కూళ్లకు వెళ్లకుండా ప్రభుత్వ పాఠశాలకు వచ్చే విధంగా కృషి చేసిన ఉపాధ్యాయులను, సహకరించిన తల్లిదండ్రులను ఆమె అభినందించారు. గత పదేళ్ల బిఆర్ఎస్ ప్రభుత్వం విద్యా వ్యవస్థను పూర్తిగా భ్రష్టు పట్టించి సర్వనాశనం చేసిందని ఈ సందర్భంగా ఆమె విమర్శించారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్య పైన ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. పాఠశాల తరగతి గదులు తెరుచుకోక ముందే విద్యార్థులు చదువుకునే పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, దుస్తులను పాఠశాలకు చేరాయన్నారు. విద్యపై కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పెట్టిన ప్రత్యేక దృష్టికి నిదర్శనమన్నారు. ఉప్పల్ లో పేద విద్యార్థులకు భవిష్యత్తు తరాలకు నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా అందరి సహాయ సహకారాలతో విద్యార్థులకు ఉపయోగపడే విధంగా మౌలిక వసతులు అందుతున్నాయని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యతో పాటు భోజనం, విద్యార్థులకు కావాల్సిన మౌలిక వసతులను తెలంగాణ ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. రానున్న కాలంలో ప్రభుత్వ పాఠశాలల్లోనే పోటీతత్వం ఉంటుందని అన్నారు. ప్రైవేటు పాఠశాలల వైపు కన్నెత్తిచూడకుండా ప్రభుత్వ పాఠశాలల వైపు విద్యార్థులు రావాలని సూచించారు. ఉప్పల్ ప్రభుత్వ పాఠశాలకు రూ.2 కోట్ల మంజూరు చేసిన సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రధాన ఉపాధ్యాయుడు లక్ష్మణ్ రావు, డివిజన్ అధ్యక్షుడు బాకారం లక్ష్మణ్ , ఈగ ఆంజనేయులు ముదిరాజ్, సల్ల ప్రభాకర్ రెడ్డి, సత్తి రెడ్డి, సోమ బలమని, ఉపోజి మధు చారి, ముదిగొండ రవి, అఫ్జల్, నవీన్ గౌడ్, ప్రశాంత్ రెడ్డి, వహీద్, హరి యాదవ్, వంశీగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# కూరగాయల మార్కెట్ అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేయాలి

## జిహెచ్ఎంసి జోనల్ కమిషనర్ ను కోరిన పరమేశ్వర్ రెడ్డి, బొంతు శ్రీదేవి



**కుషాయిగూడ, జూన్ 13, (తెలంగాణ దిశ):** కుషాయిగూడ కూరగాయల మార్కెట్ కాంటాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గ ఇంచార్జీ మందుముల పరమేశ్వర్ రెడ్డి, చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి కోరారు. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో శుక్రవారం పరమేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో లింగోజీ గూడ, చర్లపల్లి, కాప్రా, ఉప్పల్ కార్పొరేటర్లు ధరిపల్లి రాజశేఖరరెడ్డి, బొంతు శ్రీదేవి, స్వర్ణ రాజు శివమణి, రజిత పరమేశ్వర్ రెడ్డి తదితరులు ఎల్ బి నగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. మార్కెట్‌లో పైకప్పు మరమ్మత్తు, పెయింటి ంగ్, అలాగే సిమెంట్ రోడ్డు పనులకు నిధులను కేటాయించాలని కోరారు. మార్కెట్‌లో వ్యాపారం చేసే వ్యాపారుల నుంచి అనేక వినతులు వచ్చాయని తెలిపారు.

పైకప్పు పాడైందని, వర్షాకాల ంలో నీరు కారుతుందని వివరించారు. మార్కెట్ నిర్మించినప్పుడు చేసిన పెయింటింగ్ కూడా పాడైందని, అదే విధంగా మార్కెట్‌లోని రోడ్లు చెడిపోవటం వల్ల వ్యాపారులకు, కొనుగోలు దారులకు అసౌకర్యం కలుగుతోందన్నారు. కూరగాయల మార్కెట్‌లో పైకప్పు మరమ్మత్తు, పెయింటింగ్, అలాగే సిమెంట్ రోడ్డు పనులకు తక్షణమే నిధులు కేటాయించాలని కోరారు.



# సంపాదకీయం

## చర్చల ఎజెండాను ప్రజలే నిర్ణయించాలి

ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు చట్టసభల్లో చర్చకు రావడం లేదు. అసెంబ్లీ కావచ్చు, పార్లమెంట్ కావచ్చు రాజకీయ నాయకులు తమ ఎజెండా మేరకు ముందకు సాగుతున్నారు. అందువల్ల ప్రజలే ముందుకు వచ్చి ప్రధాన సమస్యలపై రచ్చబండలో చర్చించాలి. సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేయాలి. ప్రధానాంగా సాగు,తాగునీరు, రోడ్లు, కమ్యూనికేషన్, విద్యుత్, వైద్యం, విద్య, పన్నులు. నిత్యావసర ధరలపై చర్చచేయాలి. దరల పెరుగుదల, నివారణ చర్యలపై చర్చించి వాటిని తమ ప్రజాప్రతినిధులకు నివేదికల రూపంలో అందించాలి. చట్టసభల్లో ఈ సమస్యలు చర్చించాలని కోరాలి. ఎజెండాను ప్రజలే నిర్ణయించడం ద్వారా కొత్త రాజకీయాలకు తెలేపాలి. లేకుంటే చట్టసభల్లో సమస్యలు చర్చించరు. అందుకు అనుగుణంగా చట్టాలు రూపొందించడం జరగడం లేదు. ఎన్నికయ్యే సభ్యులు ఏం చేయబోతున్నారో ముందే హామీ ఇచ్చారు గనక వాటిపై నిలదీయాలి. ఎందుకంటే పార్లమెంట్‌లో చర్చలకు అవకాశం రావడం లేదు. గత పదేళ్లుగా ఏ అంశాన్ని కూడా చర్చించడానికి బిజెపి నేతృత్వంలోని ప్రభుత్వం ముందుకు రావడం లేదు. అవసరమైనన్ని రోజులు సమావేశాలు నిర్వహించడం, తమకు అనుకూలమైన బిల్లులు రూపొందించడం..ముగించడం అన్న ప్రక్రియను బిజెపి ఎంచుకుంది. ఇది ఎవరికి లాభమో ప్రజలు ఆలోచన చేయాలి. ఈ క్రమంలో బిజెపి అభ్యర్థులను ఈవిషయంలో ప్రజలు నిలదీయాలి. మీరు సమస్యలు చర్చించే స్వేచ్ఛను మీకు పార్టీ ఇస్తుందా అని అడగాలి. నియోజకవర్గ సమస్యలను చర్చించే అవకాశం ఏ ఒకకక ఎంపికి కూడా సరిగా రావడం లేదు. పార్లమెంట్ సమావేశాలు ఎన్నిసార్లు జరిగినా మొక్కుబడిగా ముగించేస్తున్నారు. ఏటా రెండుమూడుసార్లు సమావేశాలు జరుగుతున్నా ప్రధాన సమస్యలపై చర్చించేందు కు అధికార బిజెపి ముందుకు రావడం లేదు. గొప్పలు చెప్పుకుంటున్న బిజెపి నేతలు కూడా ప్రజల సమస్యలపై చర్చించాలన్న ఆసక్తిని ప్రదర్శించడం లేదు. పార్లమెంట్ ఉన్నదే ప్రజల సమస్యలపై చర్చించడానికి అన్న స్పృహ లేకుండా కాలాన్ని గడిపేశారు. పార్లమెంట్ సమావేశాలు మొక్కుబడిగా జరుగుతున్న వేళ..ఎంపిలను ఎన్నుకుని ఏం లాభం అన్న అనుమానం కలుగుతోంది. ఈ తరహా ప్రజాస్వామ్యం ఆందోళనకరం కాక మరోటికాదు. ప్రజలు అనేకానేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. రైతులు సమస్యలు ఎదుర్కొంటున్నారు. ధరల దాడితో సామాన్యులు అతలాకుతలం అవుతున్నారు. జిఎస్టీ పేరుతో బాదేస్తున్నారు. ఇవన్నీ ఎవరికి చెప్పుకోవాలి. ఎవరు వీటిని చర్చించి నిర్ణయిస్తారు. కేవలం పార్లమెంటుకు మాత్రమే చర్చించే అవకాశం ఉంది. కాబట్టి ఎంపిలు ఇప్పటినుంచి ఈ సమస్యలపై సిద్దంగా ఉండాలి. పార్లమెంటులో తమకు మెజార్టీ ఉందికదా అని అధికార పార్టీ సమస్యలపై ఇంతకాలం పెద్దగా చర్చకు పూనుకోలేదు. ఇంతకన్నా దారుణం ఉండదు. నిజానికి దేశంలో నేటికీ పంటల కొనుగోళ్లకు సంబంధించి స్పష్టమైన విధానాలు లేవు. మద్దతు ధరలకు సంబంధించి స్పష్టమైన విధానాలు లేవు. రైతులు ఆరుగాలం కష్టించి పండించిన పంటలను ఎలాగైనా కొనుగోలు చేసి... వాటిని ప్రజలకు చేర్చాలన్న విధానాలూ లేవు. పంటల కొనుగోళ్లకు సంబంధించి జాతీయ విధానం, ఆహార పంటల ఎగుమతుల విధానాలను అమలు చేయడం లేదని వ్యవసాయ నిపుణులు ఎప్పటినుంచో మొత్తుకుంటున్నారు. కందుల కొనుగోళ్లకు సంబంధించి ఇప్పటివరకు స్పష్టత లేదు. మార్క్‌ఫెడ్ రంగంలోకి దిగడంలేదు. ఇప్పటికే రైతులు పంటను అమ్మడానికి సిద్ధం చేశారు. ఓవైపు కందిపప్పు ధరలు అమాంతంగా పెరుగుతున్నా.. కందులకు ధరలు మాత్రం రైతులకు దక్కడం లేదు. మార్కెట్‌లో సామాన్యులకు పప్పుల ధరలు అందనంతగా పెరిగాయి. సాగుచట్టాలను బలవంతగా రుద్దేందుకు యత్నించిన కేంద్రం ..పంటల కొనుగోళ్లకు సంబంధించి జాతీయ విధానాలను నేటికీ రూపొందించడంలేదు. నిజానికి సాగుచట్టాల్లో ఇవన్నీ పొందుపర్చి ఉంటే ఆందోళనలు జరిగి వుండేవి కాదు. ఏ రాష్ట్రంలో ఏ పంట పండుతుందో లెక్కలు వేయాలి. ఏపంట పండించాలో కూడా లెక్కలు వేయాలి. దేశానికి ఏ పంటలు అవసరమో ప్రణాళిక సిద్ధం చేయాలి. కానీ అలా జరగగడం లేదు. పార్లమెంటులో ఇలాటి అత్యవసర సమస్యలపై సమగ్రంగా చర్చించడం లేదు. కేవలం ఎన్నికల కోసం పథకాలు చేపట్టడం, ఓటు బ్యాంక్‌ను సృష్టించడం వంటివాటి పైనే ప్రధానంగా దృష్టి సారిస్తున్నారు. ఈ దేశంలో అనుత్పాదక రంగాలను పెంచి పోషిస్తున్నారు. దుబారా ఖర్చులు చేస్తున్నారు. వీటి గురించి ఎవరు కూడా నిలదీయడం లేదు. బ్యాంకులను ముంచినోళ్లను.. కంపెనీలు పెట్టి రుణాలు ఎగ్గొట్టినోళ్లను వెనకేసుకుని వస్తున్న మోడీ ప్రభుత్వం రైతులకు సంబంధించి ఆమోదయోగ్య విధానాలను మాత్రం రూపొందించడం లేదు. పంటల కొనుగోళ్లను రాష్ట్రాలకు వదిలేయడం వల్ల ధాన్య సేకరణ అన్నది ఇప్పటికీ ఓ మిధ్యగా మారింది. మిర్చి,పత్తి, వరి తదితర పంటలకు సేకరణ విధానం లేక పోవడంతో రైతులు నష్టపోతున్నారు. పంటలు మార్కెట్‌కు తరలిస్తున్నా..గిట్టుబాటు ధరలు రావడం లేదు. ఈ దశలో వారివద్దనుంచి పంటలను కనీస మద్దతు ధరలకుకొనుగోళ్లు చేసేలా చర్యలు తీసుకోవాలి. వారిని ఆదుకునేందుకు ఎంత సాయం చేసినా దేశ అభివృద్దికి పునాది పడినట్లే. రైతుల్లో నైరాశ్యం నెలకొంటే దేశానికే ప్రమాదం. పంటలు పండించిన రైతులను ఆదుకునేందుకు కేవలం పంటలను మద్దతు ధరలు ఇచ్చి కొనుగోలు చేయాలని ఏటా ఆందోళనలు చేస్తున్నా, రోడ్డెక్కుతున్నా ప్రభుత్వాలకు చీమకుట్టినట్లు కూడాలేదు. మొన్నటికి మొన్న ఎపిలో మిర్చి ధరల కోసం రైతులు ఆందోళనకు దిగారు. తమ పంటను కొనుగోలు చేయాలంటూ ఆందోళనలకు దిగడం పరిపాటే అన్న ధోరణిలో ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్లుగా ఉంది. ధరలు పెరుగుతున్నా పండిన పంటను ప్రజలకు చేరువ చేయడంలో ప్రభుత్వం విఫలం అవుతోంది. సహకార సంఘాలు, మార్కెట్ కమిటీలు ఉన్నా లాభం లేదన్న పరిస్థితి ఏర్పడింది. సిసిఐ, మార్క్‌ఫెడ్ లాంటి సంస్థలు ఉన్నా న్యాయం జరగడంలేదు. ఇలా ఎంతకాలం రైతులు ఆందోళన లకు దిగాలో పాలకులు చెప్పాలి. ఇవన్నీ చెప్పుకోవడానికి వేదిక లేదు. చర్చిద్దామంటే పార్లమెంటులో అవకాశం ఇవ్వడం లేదు. అందువల్ల ప్రజలు పార్లమెంట్ చర్చలపై ఎంపిలను నిలదీయాలి.

## బడిబాట లో భాగంగా అక్షరాభ్యాసం విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ





**కుత్బుల్లాపూర్, జూన్ 13, (తెలంగాణ దిశ):** బడిబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం గురుమూర్తి నగర్ లోని పాఠశాలలో విద్యార్థులకు అక్షరాభ్యాసంతో పాటు పాఠ్యపుస్తకాలను కాంగ్రెస్ పార్టీ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇంచార్జీ కోలన్ హన్మంత్ రెడ్డి చేతుల మీదుగాఅందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడిబాట కార్యక్రమాన్ని రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని ప్రభుత్వ పాఠశాలలను అన్ని రంగాలలో తీర్చిదిద్దుతుందన్నారు. పాఠశాలకు సంబంధించిన పాఠ్యపుస్తకాలను స్టూడెంట్స్ కూర్చోడానికి కార్పొరేట్ స్థాయి బెంచులు, ప్రైవేట్ పాఠశాల ఏ మాత్రం తక్కువ కాకుండా అన్ని మౌలిక సదుపాయాలను ప్రభుత్వ పాఠశాలలో అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. అదే విధంగా పాఠశాల కరస్పాండెంట్ చంద్రయ్య, నాగవాణి, రాఘవేంద్ర రెడ్డి పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు త్రాగునీటి కోసం మినరల్ వాటర్ ప్లాంట్, బోర్ వెల్, స్కూల్ షెడ్, ఉదయం పాఠశాలలో ప్రార్థనల కోసం మైక్ సెట్ ఈ మౌలిక సదుపాయాలు గురించి కోలన్ హనుమంత్ రెడ్డికి కరస్పాండెంట్ వినతి పత్రం సమర్పించారు. తక్షణమే స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడి సాధ్యమైనంత తొందరలో అమలు చేయాలని సూచించారు. కాంగ్రెస్ 127 డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బి. శివ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈకార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ జయరాం, డివిజన్ అధ్యక్షులు గణేష్, లాయక్, సోషల్ మీడియా కో ఆర్డినేటర్ తైలం శ్రీనివాస్, మైనార్టీ అధ్యక్షులు డివిజన్ ఉస్మాన్,సీనియర్ కాంగ్రెస్ నాయకులు భాస్కర్ రెడ్డి, ఎల్లయ్య, నయీమ్, గురుమూర్తి నగర్ సొసైటీ నుండి రాణి, హర్షద్, ఓంకార్ రెడ్డి, శ్రీనివాస్ ముదిరాజ్, భాస్కర్ చారి, వెంకటేష్, శ్యామ్ సుందర్, సల్మాన్, డివిజన్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మాధవి రాణి, జానకి, భాగ్య, లక్ష్మి రెడ్డి, ఆరిఫ్, అప్సర్ పాల్గొన్నారు.

## జూలై 12,13 తేదీలలో భద్రాచలంలో టిడబ్ల్యూజెఎఫ్ తృతీయ జిల్లా మహాసభలు

### రాష్ట్ర కార్యదర్శి కర్ర అనిల్ రెడ్డి



**భద్రాచలం, జూన్ 13, (తెలంగాణ దిశ):** జూలై 12,13 తేదీలలో భద్రాచలం పట్టణంలో టిడబ్ల్యూజేఎఫ్ తృతీయ మహాసభలు నిర్వహించనున్నట్లు టిడబ్ల్యూజెఎఫ్ రాష్ట్ర కార్యదర్శి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అక్రిడిటేషన్ కమిటీ మెంబర్ కర్ర అనిల్ రెడ్డి తెలిపారు. శుక్రవారం చర్ల మండల కేంద్రంలో జరిగిన తృతీయ మహాసభల సన్నాహక సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా అనిల్ రెడ్డి మాట్లాడుతూ రెండు రోజులపాటు నిర్వహించే తృతీయ మహాసభల సందర్భంగా 12వ తేదీన జర్నలిస్టులకు శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జర్నలిస్టుల సమస్యలపై నిరంతరం పోరాడుతున్న ఏకైక జర్నలిస్ట్ యూనియన్ టిడబ్ల్యూజేఎఫ్ మాత్రమేనన్నారు. టిడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో అనేక పోరాటాలు నిర్వహించి జర్నలిస్టులకు అండగా నిలిచి జర్నలిస్టుల హక్కులను సాధించిందన్నారు. భద్రాచలంలో ఘనంగా నిర్వహించనున్న తృతీయ మహాసభల విజయవంతానికి యూనియన్ సభ్యులతో పాటు, ప్రతి ఒక్కరు తమ వంతుగా సహాయ సహకారాలు అందించి విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడబ్ల్యూజెఎఫ్ జిల్లా అధ్యక్షులు పూదోట సూరిబాబు, కోశాధికారి దొడ్డి హరినాధ వర్మ, రాష్ట్ర కమిటీ సభ్యులు డి రవికుమార్, జిల్లా సహాయ కార్యదర్శి శీరపు సాయి సంపత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తడి పొడి చెత్తపై మహిళలకు అవగాహన





**నాగారం, జూన్ 13, (తెలంగాణ దిశ) :** వంద రోజుల ప్రణాళికలో భాగంగా నాగారం మున్సిపాలిటి పరిధిలోని రచ్చ రామ్ రెడ్డి గార్డెన్స్ లో శుక్రవారం మహిళలకు తడి, పొడి చెత్తపై అవగాహన కల్పించారు. రోజువారి కార్యక్రమాలలో మిగిలిన తడి చెత్తనుతమ ఇంటిలోనే కంపోస్ట్ ఎరువు తయారు చేసే విధానంపై అవగాహన కల్పించారు. జాతీయ పోషక ఆహార పదార్థాల సంస్థ ప్రతినిధి ఆధ్వర్యంలో రోజువారి పోషక ఆహార విలువలపై అవగాహన కల్పించారు.స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో తయారుచేసిన ఉత్పత్తులను ఈ మేళాలో ప్రదర్శించారు. రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని రాంపల్లిలోని మూడవ వార్డులోని డిఎస్ఆర్ ఎన్ క్లేవ్ లో నాలా క్లీనింగ్ పనులను చేపట్టారు. రాంపల్లి వార్డు కార్యాలయంలో సిబ్బందికి హెల్త్ క్యాంప్ నిర్వహించారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎస్. భాస్కర్ రెడ్డి, మేనేజర్ బి.సురేష్ రెడ్డి,జాతీయ పోషక ఆహార పదార్థాల సంస్థ ఋషికేష్, మెప్మా ఎడిఎంసీ నరసింహ మెప్మా సభ్యులు పాల్గొన్నారు.


## వర్షాకాలంలో సీజనల్, వెక్టర్-బోర్న్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి




### జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ ఉమాగౌరి

**మేడ్చల్ కలెక్టరేట్, జూన్ 13, (తెలంగాణ దిశ) :** వర్షాకాలంలో సీజనల్, వెక్టర్-బోర్న్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని మేడ్చల్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ ఉమాగౌరి సూచించారు. వర్షాకాలంలో సాధారణంగా మలేరియా, డెంగ్యూ, చికున్ గునియా, జాండిస్, గ్యాస్ట్రో ఎంటరైటిస్, టైఫాయిడ్, శ్వాస సంబంధిత సంక్రమణ వ్యాధుల ప్రభావం పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో ముందస్తు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం జిల్లా స్థాయి సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటంలో వర్షాకాలం కీలక దశ అన్నారు. ప్రతి విభాగం సమన్వయంతో పని చేస్తేనే వ్యాధుల నివారణ సమర్థవంతంగా సాధ్యమవుతుందన్నారు.

ముఖ్యంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పరిసరాల శుభ్రత, డ్రైనేజీ, తాగునీటి సరఫరా తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ప్రతి శాఖ సకాలంలో కార్యాచరణ చేపడితే ఏ రోగాల బారిన పడకుండా ప్రజలను కాపాడవచ్చునన్నారు. ఈ విషయంలో అన్ని విభాగాల అధికారులు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ప్రోగ్రామ్ అధికారిణి డాక్టర్ శ్రీదేవి వర్షాకాల వ్యాధుల నివారణకు సంబంధించి కార్యాచరణ ప్రణాళికను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కీసర, మల్కాజిగిరి డివిజన్ డిప్యూటీ అధికారులు డాక్టర్ శోభ, డాక్టర్ సత్యవతి, జిల్లా ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ చంద్రకళ, డాక్టర్ సత్యవతి, డాక్టర్ గీత, డాక్టర్ కౌశిక్, డాక్టర్ వినోద్, జిల్లా పంచాయతీ అధికారి, సూపరింటెండింగ్ ఇంజనీర్ - గ్రామీణ జల సరఫరా శాఖ, (ప్రాజెక్ట్ డైరెక్టర్ ఐసిడిఎస్, డిప్యూటీ డైరెక్టర్ సామాజిక, గిరిజన, బీసీ సంక్షేమ శాఖలు), ప్రాజెక్ట్ డైరెక్టర్ డిఆర్ డిఏ/ ఐపీకే, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.






## సివిల్ సర్వీసెస్ పరీక్షల కోసం ఎస్‌టి,ఎస్‌సి,బిసి అభ్యర్థులకు ఇంటిగ్రేటెడ్ గైడెన్స్ శిక్షణ

**హైదరాబాద్,జూన్ 13, (తెలంగాణ దిశ) :** తెలంగాణా గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించే సివిల్ సర్వీసెస్ పరీక్షలు-2026 కోసం ఎస్ టి, ఎస్ సి, బిసి అభ్యర్థులకు హైదరాబాద్ రాజేంద్రనగర్ లోని గిరిజన ఐఎఎస్ స్టడీ సర్కిల్ ద్వారా రెసిడెన్సియల్ పద్ధతిలో ఇంటిగ్రేటెడ్ గైడెన్స్ శిక్షణ ఇచ్చేందుకు అర్హులైన ఎస్‌టి,ఎస్‌సి,బిసి అభ్యర్థుల నుండి ఆన్ లైన్ దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు గిరిజన సంక్షేమ శాఖ అధికారులు తెలిపారు. అభ్యర్థులుఆబ్జెక్టివ్ టైపు, ఆప్టిట్యూడ్ పరీక్ష ద్వారా ఎంపిక చేయబడుతారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల కుటుంబ వార్షిక ఆదాయం రూ. 3 లక్షలు మించరాదు. అభ్యర్థులు http://studycircle.cgg.gov.inలో లాగిన్ అయ్యి ఈ నెల 14నుండి జూలై 4 తేదీ వరకు ఆన్ లైన్ ద్వారా మాత్రమే రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఆన్ లైన్ అప్లికేషన్ సూచనల కోసం http://studycircle.cgg.gov.in,http://twd.telangana.gov.in వెబ్ సైట్ లో అందుబాటులో కలవు. మరిన్ని వివరాలకు ఫోన్ 62817 66534 నంబర్‌లో అన్ని పని దినాలలో ఉదయం గం. 10:30 నుండి సాయంత్రం ఐదు గంటలలోపు సంప్రదించవచ్చు.

## చెత్తను నిర్మూలిద్దాం- పర్యావరణాన్ని కాపాడుదాం




**కుత్బుల్లాపూర్, జూన్ 13, (తెలంగాణ దిశ) :** చెత్తను నిర్మూలిద్దాం- పర్యావరణాన్ని కాపాడుదాం.. "ఒక మార్పు అభివృద్ధికి మలుపు"కార్యక్రమంలో భాగంగా నిజాంపేట్ 30 డివిజన్ జర్నలిస్టు కాలనీలో శుక్రవారం మున్సిపల్ అధికారులు, స్థానిక జర్నలిస్టు కాలనీ వాసులు సంయుక్తంగా అవగాహనా ర్యాలీ నిర్వహించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, ప్రతి ఇంటి ఆవరణలో విధిగా మొక్కలు నాటడం చేయాలని స్థానికులకు సూచించారు. జర్నలిస్టు కాలనీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి కోలేపాక వెంకట్ ఆధ్వర్యంలో ఈర్యాలీ నిర్వహించారు.చెత్త నిర్మూలన మంచి భవిష్యత్తుకు దారితీస్తుందని కొలెపాక వెంకట్ తెలిపారు. వ్యర్థాలను రీసైకిల్ చేద్దాం, పర్యావరణాన్ని కాపాడుదాం అంటూ ర్యాలీలో నినాదాలు చేశారు. తడి పొడి చెత్తలను వేరు చేయడం గురించి అధికారులు స్థానికులకు ఈ కార్యక్రమంలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కాలనీ వర్కింగ్ ప్రెసిడెంట్ లాలయ్య, ఉపాధ్యక్షుడు ముక్క దేవేందర్ గుప్తా, సీతయ్య, సుధాకర్ రెడ్డి, రమేష్, హబీబ్,పెంటయ్య, గురవయ్య, వెంకట్,మాధవ్, మున్సిపల్ అధికారులు జయరాజు, హేమలత, శ్రీకాంత్, రాజు యాదవ్, సుధాకర్ రెడ్డి, పారిశుద్ధ్య కార్మికులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

## మేడ్చల్ జిల్లా కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన మిక్కిలినేని మను చౌదరి





### కలెక్టర్ కు స్వాగతం పలికిన అదనపు కలెక్టర్లు, అధికారులు,



**మేడ్చల్ కలెక్టరేట్, జూన్ 13, (తెలంగాణ దిశ) :** మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గా మిక్కిలినేని మను చౌదరి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. మేడ్చల్ జిల్లా కలెక్టర్ గా మను చౌదరి నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణరావు ఉత్తర్వులు జారీ చేసిన విషయం విదితమే. ఈ మేరకు శుక్రవారం మిక్కిలినేని మను చౌదరి జిల్లా కలెక్టరేట్ ఛాంబర్ లో జిల్లా కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించారు. ముందుగా కీసర గుట్ట శ్రీరామలింగేశ్వర స్వామి దేవస్థాన అర్చకులు వేదోచ్ఛరణ మంత్రాలతో పూర్ణ కుంభ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరికి జిల్లా అదనపు కలెక్టర్లు రాధికగుప్తా, విజయేందర్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, ఆర్డిఓలు, జిల్లా స్థాయి అధికారులు, ఎమ్మార్వోలు, పుష్పగుచ్చాలు అందచేసి స్వాగతం పలికారు.

## కలెక్టర్ కు టీఎన్జీఓఎస్ నేతల స్వాగతం

**మేడ్చల్ కలెక్టరేట్, జూన్ 13, (తెలంగాణ దిశ) :** మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్‌గాబాధ్యతలు స్వీకరించిన మిక్కిలినేని మను చౌదరికి శుక్రవారం తెలంగాణగెజిటెడ్ అధికారుల సంఘం నేతలు ఘనంగా స్వాగతం పలికారు ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు జి. వినోద్ కుమార్ సంఘ సభ్యులతో కలెక్టర్ మను చౌదరిని మర్యాద పూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా శాలువాతో సత్కరించి కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శికె.కురుమూర్తి, సహ అధ్యక్షులు కె.వెంకటేశం, ఉపాధ్యక్షులు రవిందర్, యం. రఘునం దన్‌గౌడ్, యం. కృష్ణ,ఝాన్సీ రాణి, జె. విజయకమారి,సంయుక్త కార్యదర్శి ఆర్‌యంవి. ఆనందరావు, కోశాధిఖారి డి. కరుణాకర్ రావు, కార్యాలయ కార్యదర్శి సాయికృష్ణ, కార్యవర్గ సభ్యులు యం. తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



# కవితక్క..దీక్షల అర్థం ఏమిటీ..?

హైదరాబాద్: ప్రతిపక్షంలో దీక్షలు.. అన్నేళ్లు అధికారంలో ఉండి ఏం చేశారు కవితక్క?ఇటీవల కల్వకుంట్ల కవిత, కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలను విమర్శిస్తూ వివిధ రకాల ఆందోళనలు చేపట్టారు. రైతుల కోసం సన్నచిలక మిర్చి దండలతో, మహిళల కోసం పోస్ట్‌కార్డ్ ఉద్యమంతో, లేదా హస్తకళాకారుల కోసం ఎండిన పంటలతో ఆమె నిరసనలు దృష్టిని ఆకర్షించాయి. ఈ ఆందోళనలు కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను అమలు చేయడంలో విఫలమైందని, రైతులు, మహిళలు ఇతర వర్గాలను విస్మరిస్తోందని ఆరోపిస్తూ జరిగాయి. తాజాగా ఆమె అసెంబ్లీ ఆవరణలో మహాత్మా జ్యోతిబాపూలే విగ్రహం ఏర్పాటు చేయాలని దీక్ష చేపట్టారు. ఇందిరా పార్కు ఎదుట దీక్ష చేపట్టారు. ఆశ్చర్యం ఏమిటంటే.. నాడు సీఎంగా కేసీఆర్ ధర్నా చౌక్ ఎత్తివేయాలని ఆదేశించారు. విపక్షాలు, కార్మిక సంఘాలు కోర్టుకు వెళ్లి ధర్నా చౌక్ సాధించుకున్నాయి. ఇప్పుడు అదే ధర్నా చౌక్‌లో కవిత ధర్నా చేయడం గమనార్హం. అయితే ధర్నాలు, దీక్షలు ఇప్పుడు చేస్తున్న కవిత.. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఎందుకు పూర్తిగా పరిష్కరించలేదన్న ప్రశ్నలకు కారణమవుతోంది.బీఆర్ఎస్ తెలంగాణలో పదేళ్లు అధికారంలో ఉంది. అయినా కవితప్రస్తుతం ప్రశ్నిస్తున్న ఒక్క పని కూడా చేయలేదు. అయినా నాడు కవిత ఈ అంశాలపై తండ్రిని, అన్నను ఎప్పుడూ ప్రశ్నించలేదు. సామరస్యంగా అయినా సమస్యల పరిష్కారానికి ప్రయత్నించలేదు. నాడు అధికారాన్ని అనుభవించి.. ప్రతిపక్షంలోకి రాగానే సమస్యలు గుర్తుకురావడమే ఆశ్చర్యంగా ఉంది.



ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కవిత చేస్తున్న ఆందోళనలు, బీఆర్ఎస్‌ను రాజకీయంగా బలోపేతం చేయడానికి, ప్రజల్లో కాంగ్రెస్ అసంతృప్తిని రేకెత్తించడానికి ఉద్దేశించినవిగా కనిపిస్తున్నాయి. అయితే, గతంలో అధికారంలో ఉన్నప్పుడు సాధించలేని కొన్ని సమస్యలపై ఇప్పుడు నిరసనలు చేయడం ప్రజల్లో సందేహాలను రేకెత్తిస్తోంది.

ఉదాహరణకు, రైతులకు గిట్టుబాటు ధర కోసం ఇప్పుడు ఆందోళన చేస్తున్న కవిత, అధికారంలో ఉన్నప్పుడు ఈ సమస్యను ఎందుకు పూర్తిగా పరిష్కరించలేదనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.కల్వకుంట్ల కవిత రాజకీయ జీవితం సాంస్కృతిక, సామాజిక, రాజకీయ కార్యక్రమాలతో నిండి ఉంది. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు రైతు బంధు, కాళేశ్వరం,మిషన్ భగీరథ వంటి పథకాలు రాష్ట్రానికి గుర్తింపు తెచ్చాయి. అయితే, కుటుంబ పాలన, స్థానిక సమస్యల పరిష్కారంలో లోపాలు, యువతకు ఉద్యోగ అవకాశాల కొరత వంటి విమర్శలు కూడా ఎదురయ్యాయి. ఇప్పుడు ప్రతిపక్షంలో ఉంటూ చేస్తున్న ఆందోళనలు రాజకీయ వ్యూహంగా ఉపయోగపడినప్పటికీ, గత పాలనలోని లోటుపాట్లను ప్రజలు గుర్తు చేస్తున్నారు. కవిత ఈ విమర్శలను అధిగమించి, ప్రజల విశ్వాసాన్ని పొందడానికి ఆమె ఆందోళనలు ఆచరణీయ పరిష్కారాలతో కూడి ఉండాల్సిన అవసరం ఉంది.

# అప్పులతో ఎంతకాలం ఈ పాలన..?

ఉచిత పథకాలతో ఆర్థిక పరిస్థితి ఎలా దెబ్బతిందో చూస్తున్న మనం.. ఇంకా అలాంటి వాటి కోసం కక్కుర్తి పడుతున్న రాజకీయనేతల కారణంగా అభివృద్ధి కుంటుపడుతోంది. ఇకపోతే ప్రతిదానికి కేంద్రాన్ని దేబురించే పరిస్థితి పోవాలి. ఆదాయం ఉన్నమేరకు ప్రణాళికలు ఉండాలి. అప్పులు చేసి, ఉచిత పథకాలను కొనసాగించే దౌర్భాగ్యం సరికాదు. సొంతంగా రాష్ట్రాలను అభివృద్ధి చేసి, ఆదాయాలను సంపాదించి పెట్టేలా చేయాలి. ఉమ్మడి ఎపి నుంచి విడివడ్డ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు ఇప్పుడు ఆర్థికంగా అనేక ఒడిదుడుకులు ఎదుర్కొంటున్నాయి. లక్షల కోట్లు అప్పులు చేసినా ప్రజల సమస్యలు తీరలేదు. అయినా పాలకుల్లో మార్పు కానరావడం లేదు. ఉచిత పథకాలు వద్దని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు పదేపదే హెచ్చరిస్తూనే ఉన్నారు. అయినా పాలకులు పట్టించు కోవడం లేదు. కిలో రూపాయికే సన్నబియ్యం గురించి తెలంగాణ కాంగ్రెస్ పాలకులు గొప్పలు చెబుతున్నారు. ఎప్పుడో 40 ఏళ్ల క్రితం నాటి సిఎం ఎన్టీఆర్ ప్రవేశ కిలో రెండురూపాయల బియ్యం పథకాన్ని ఓటుబ్యాంక్ రాజకీయాలకు ఉపయోగించు కుంటున్నారు. దీంట్లో జరుగుతున్న దుబారా పట్టించుకోవడం లేదు. అభివృద్ధిచేయడం ద్వారా సంపద సృష్టించి ప్రజలను స్వయం సమృద్ధిగా బతికేలా చేయాల్సిన నేతలు ప్రభుత్వ ఖజానాను కొల్లగొట్టి దోచిపెడుతున్నారు. డబ్బుల పందేరం వల్ల అభివృద్ధి ఆగిపోయి..రాష్ట్రం దివాళా తీస్తున్నా పట్టించుకోని నేతల కారణంగా అన్ని రంగాల్లో వైఫల్యాలను చూస్తున్నాం. ప్రజలకు మేలు చేసే పనులు చేసి ప్రజల మనస్సులో చిరస్థాయిగా నిలవాల్సిన నేతలు పథకాల పేరుతో ప్రజలను ఓటు బ్యాంకుగా తయారు చేసుకుంటున్నారు. ఈ పందేరం అభివృద్ధి పనులపై ఖర్చు పెట్టి ఉంటే ఆయా రంగాలు పురోగగమించేవి. కనీస మౌలిక వసతులు సాగు, తాగునీరు. రోడ్లు, డ్రైనేజీలు, స్కూళ్లు, ఆస్పత్రులపై ఖర్చు పెట్టడం లేదు. వీటికి కేటాయింపులు కూడా తక్కువే. కేవలం పెన్షన్లు, ఉచితబియ్యం ఇవే ఇప్పుడు ప్రధాన ఎజెండాగా అమలవుతున్నాయి. జగన్ హయాంలో బటన్ నొక్కుడుతో రాష్ట్ర ఖజానాను దివాళా తీయించారు. విశాఖలో ఆకశ హర్మ్యాల లాంటి భవంతులను కట్టుకున్నారు. తెలంగాణలో కెసిఆర్ హయాంలో కూడా కాళేశ్వరం లాంటి ప్రాజెక్టులకు డబ్బులు వృధా చేశారు. అప్పనంగా డబ్బులు వెనకేసుకున్నారని ఆరోపిస్తున్న ప్రస్తుత పాలకులు వీటిపై నిజాయితీగా విచారణ జరిపించి, శిక్ష పడేలా చేయలేక పోతున్నారు. పారిశ్రామిక అభివృద్ధి చేసివుంటే కనీసం నిరుద్యోగం తీరేది. ఉత్పాదక రంగం అభివృద్ధి చెందేది. తన ఓటు బ్యాంకు కోసం పాలకులు రాష్ట్రాలను అప్పుల కుప్పగా చేస్తున్న తీరు దారుణం కాక మరోటికాదు. ఎన్ని కుటుంబాలకు నగదు బదిలీ చేశామన్నది కాదు. ఎంతగా అభివృద్ధి సాధించామన్న లెక్కలు తీయాలి. ఇకపోతే పరిశ్రమలకు ప్రాణాధానం విద్యుత్. వేసవి వచ్చే వరకు ఎంత వినియోగం ఉంటుందో లెక్కలు వేయలేక పోతున్నారు. అవసరాలకు అనుగుణంగా విద్యుత్ ఉత్పత్తి పెంచుకోవడం లేదా..ఉత్పత్తి ఉన్న ప్రాంతాల నుంచి కొనుగోలు చేయడం లాంటి దీర్ఘకాలిక ప్రణాళికలు లేకపోవడం అసమర్థతకు నిదర్శనం. నిజానికి విద్యుత్ ఉంటేనే అడుగు ముందుకు పడే రోజుల్లో ఉత్పత్తిపై వ్యూహం లేకపోవడం దారుణం. కరెంట్‌పై ఖర్చు అన్నది ఉత్పత్తికి, ఉపాధికి బాట వేస్తుందని గుర్తించడం లేదు. కేంద్రంలోని మోడీ కూడా దీనిని పట్టించు కోవడం లేదు. ఇప్పటికే పెంచిన విద్యుత్ ఛార్జీలతో కరెంట్ బిల్లులు ప్రజలకు వాతలు పెడుతున్నాయి. భారీగా పెరిగిన చార్జ్జీలతో గృహ వినియోగదారులకు షాక్ తగులుతోంది. ఇకపోతే బహుళ జాతి కంపెనీలకూ ఎర్ర తివాచీలు పరుస్తున్న ప్రభుత్వాలు రైతులను అనుత్పాదక రంగాలుగా చూస్తున్న తీరు దారుణం కాక మరోటి కాదు. రైతులను ఓటు బ్యాంకుగా చూడకుండా మనకు పట్టెడు అన్నం పెట్టే తల్లిగా చూసుకోవాలి. ఇకపోతే విదేశాల నుంచి నూనెల దిగుమతి వేరుశనగ రైతులకు శరాఘాతంగా మారింది. పంటల విధానంలో శాస్త్రీయ దృక్పథం లోపించడం, సేంద్రియ ఎరువుల బదులు రసాయన ఎరువులు వాడడం వల్ల భూసారంఏటేటా తగ్గుతోంది. ఏ పంటపండించినా గిట్టుబాటు ధరలు లభించడం లేదు. దీనికి తాజా ఉదాహరణ కంది, మిర్చి పంటలే. రైతులని కాపాడుకుని, వ్యవసాయాన్ని పండగ చేస్తామంటున్న ప్రభుత్వాలు ఆ దిశగా అడుగులు వేయాలి. చిత్తశుద్ధితో పనిచేసే వ్యవస్థను రూపొందించాలి. ఈ ఆధునిక ఆర్థిక వ్యవస్థలో రైతుల సమస్యలు మరింత జఠిలం అవుతున్నాయే తప్ప పరిష్కారం కావడం లేదు. వంటనూనెల మిల్లలును దేశీయంగా రూపొదించి, మన నూనెలను మనమే వాడగలిగేలా చేయాల్సిఉంది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు స్పష్టమైన వ్యవసాయిక విధానం లేకపోవడం రైతుల పాలిట శాపంగా మారిపోయింది. ఫ్రీ మార్కెట్ అనేది ఒక అభూత కల్పన మాత్రమే అయ్యింది. దేశ ఆర్థిక వ్యవస్థ 8నుంచి 9శాతం వరకూ వృద్ధి జరుగుతున్న ప్పటికీ, వ్యవసాయ ఉత్పత్తులు పెరుగుతన్నా రైతుల ఆర్థిక వ్యవస్థ మాత్రం బాగుపడడం లేదు. అవసరం లేకున్నా ఇబ్బడిముబ్బడిగా ఆహారధాన్యాలను దిగుమతి చేసుకోవడం కూడా రైతులకు శాపంగా మారింది. కల్తీలు కూడా రైతును కాటేస్తున్నాయి. మన అసవరాలకు సరిపడా కందులు, మిరప, ఇతర పంటలను రైతులు చెమటోడ్చి పండించినా వాటిని కొనుగోలు చేయడం లేదు. ఇతర దేశాల నుంచి ఆహార ధాన్యాల దిగుబడి తక్షణం ఆగిపోవాలని అన్నారు. అప్పుడు మన అసవరాలకు అనగుణంగా పంటల విధానం వస్తుందని అన్నారు. దేశీయంగా ఉపాధి అవకాశాలు పెంచుకుంటూ.. ఉత్పత్తి రంగాలకు ఊతమిచ్చేలా సాగాల్సి ఉంది. అందుకు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను పెంచుకోవాల్సి ఉంది. ప్రతిదానికి కేంద్రంపై చేయిసాచకుండా సొంతంగా ప్రణాళికలు సిద్దం చేసుకోవాలి. ఆదాయం ఉన్న మేరకు ప్రణాళికలు ఉండాలి.

# తీరానికి వాడేసుకుంటున్న కూటమి సర్కార్..!

కాకినాడ: ఏపీ సీఎం చంద్రబాబు అంది వచ్చిన ఏ అవకాశాన్ని విడిచిపెట్టడం లేదు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల ఏర్పాటుకు సైతం ఆయన ప్రయత్నిస్తూనే ఉన్నారు. అటు కేంద్రం సైతం ఏపీకి అత్యంత ప్రాధాన్యమిస్తోంది. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల విషయంలో ఇప్పటికే దూకుడుగా ఉంది ఏపీ ప్రభుత్వం. కొద్ది నెలల కిందట విశాఖ కేంద్రంగా రెండున్నర లక్షల కోట్ల పెట్టుబడులకు సంబంధించి పరిశ్రమలకు శంకుస్థాపన చేశారు ప్రధాని మోదీ. ఇప్పుడు ఉత్తరాంధ్రలో నేవీకి సంబంధించి యుద్ధ నౌకల కేంద్రంతో పాటు ఆయుధ డిపో ఏర్పాటుకు కేంద్రం ముందుకు వచ్చింది. ఈ విషయంలో చంద్రబాబు అత్యంత చొరవ తీసుకుంటున్నారు. ఇండియన్ నేవీ కి భూములను కేటాయించి.. ఇక్కడ ఏర్పాటు అయ్యేలా కేంద్రాన్ని ఒప్పిస్తున్నారు.తూర్పు కోస్తాప్రాంతంగా విశాఖకు గుర్తింపు ఉంది. ఇప్పటికే నేవీ కార్యకలాపాలకు కేంద్రంగా మారింది విశాఖ నగరం. తూర్పు కోస్తా తీర పరిరక్షణకు ప్రాంతీయ కార్యాలయాన్ని ఏర్పాటు చేసింది మొదలు.. నావీ సేవలను విస్తృత పరుస్తూ వస్తోంది. అందులో భాగంగా దేశానికి అవసరమైన యుద్ధ నౌకల తయారీ కేంద్రం, ఆయుధ డిపోను ఉత్తరాంధ్రలో ఏర్పాటు చేయనున్నట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించి స్థలం అవసరం అని కేంద్రం కోరింది. దానికి భూమిని సమకూర్చే పనిలో పడింది చంద్రబాబు సర్కార్. ఈ రెండు ఏర్పాటు అయితే ఏపీకి జాతీయ పరంగా ప్రత్యేక గుర్తింపు దక్కినట్టే. ఉద్యోగ ఉపాధి అవకాశాలు సైతం మెరుగుపడే అవకాశం ఉంది.ప్రస్తుతం విశాఖ కేంద్రంగా తూర్పు కోస్తా నావికాదళం కొనసాగుతోంది. దేశంలోనే విస్తృత సేవలు అందిస్తోంది ఈ ప్రాంతీయ కార్యాలయం. ఇప్పుడు మరో ముందడుగు వేసింది. విశాఖకు 50 కిలోమీటర్ల దూరంలో ఉన్న రాంబిల్లిలో యుద్ధనౌకల నిల్వ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని భావిస్తోంది నావికాదళం. దీనికి గాను రాష్ట్ర ప్రభుత్వాన్ని సంప్రదించింది. దీనిపై శరవేగంగా స్పందించింది చంద్రబాబు సర్కార్. అక్కడ భూముల ఏర్పాటుకు సైతం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రాంబిల్లిలో 32 యుద్ధ నౌకలు నిలిపేలా ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. అనుసంధానంగా కేంద్ర ప్రభుత్వమే ఒక పోర్టు ఏర్పాటు చేయనుంది. అదే జరిగితే భారీ ఎత్తున ఉద్యోగాల కల్పన జరుగుతుందని నావికాదళం అధికారులు చెబుతున్నారు.ఇంకోవైపు విజయనగరం జిల్లా బాడంగిలో నావికాదళానికి సంబంధించి ఆయుధ డిపో ఏర్పాటుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. గతంలో అక్కడ ఒక ఎయిర్పోర్ట్ ఉండేది. కాలక్రమంలో అది కనుమరుగయింది. కానీ ఆ ఎయిర్ క్రాఫ్ట్ భూములు మాత్రం రైతుల ఆధీనంలో ఉన్నాయి. ఒకవైపు అదే జిల్లాలోని భోగాపురంలో అంతర్జాతీయ ఎయిర్పోర్ట్ నిర్మాణం.. ఇంకోవైపు రైల్వే మార్గం.. మరోవైపు జాతీయ రహదారులు ఉన్నాయి. వీటన్నింటినీ పరిగణలోకి తీసుకుని బాడంగిలో నావికాదళం ఆయుధం డిపో ఏర్పాటుకు దేశస్థాయి అధికారులు సైతం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. మొత్తానికి అయితే చంద్రబాబు సర్కార్ తీర ప్రాంతాన్ని రాష్ట్ర ప్రయోజనాలకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలకు వినియోగించుకుంటోంది.ఇప్పటికే విశాఖను పర్యాటకంగా, పారిశ్రామిక హబ్ గా మార్చేందుకు చంద్రబాబు సర్కార్ కృత నిశ్చయంతో ఉంది. ఐటీ పరంగా చాలా సంస్థలను ఇక్కడ నెలకొల్పేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. పలు అంతర్జాతీయ సంస్థలు సైతం తమ వ్యాపార కార్యకలాపాలు ప్రారంభించేందుకు సిద్ధపడుతున్నాయి. ఒకవైపు పారిశ్రామికం, ఇంకో వైపు ఐటి, మరోవైపు కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల ఏర్పాటుతో విశాఖ దేదీప్యమానంగా వెలగనుంది. దేశంలో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న పట్టణాల సరసన చేరనుంది.

# పవర్ కోసం ప్రతిపక్షాల పాకులాట..!

హైదరాబాద్: మూడేళ్లలో మేము పవర్ లోకి వస్తున్నాం? మీ సంగతి చూస్తాం.ఇంకా నాలుగేళ్ల టైముంది. కళ్ళు మూసుకుంటే నాలుగు రోజులగా అయిపోతాయి. మళ్లీ మనమే పవర్ లోకి వస్తాం. రాగానే వాళ్లతోలు తీస్తాను. ఆఎస్ఐ పేరు గుర్తుపెట్టుకోండి?. మూడేళ్ల తర్వాత పవర్ లోకి రాగానే వాడిచేత మీకు సెల్యూట్ కొట్టిస్తా. తెలుగు రాష్ట్రాల్లో ఈమధ్య బాగా వినబడుతున్న మాటలు ఇవి. ఏపీలో వైసిపి అధినేత జగన్మోహన్ రెడ్డి, తెలంగాణలో బి ఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రతిరోజు? మూడేళ్లలో పవర్ లోకి వచ్చేస్తాం? రాగానే వాడి సంగతి చూస్తాం. వీడిసంగతి చూస్తాం?. అది కట్టిస్తాం?. ఇది పడగొడతాం అని హామీల మీద హామీలు ఇస్తున్నారు.లో ఉన్న ఈ పొలిటికల్ పార్టీల ధైర్యం ఏమిటో మాత్రం ఎవరికి అర్థం కావటం లేదు. క్యాడర్ లో ఊపు తేవడానికి,నమ్మకం కలిగించడానికి ఇలాంటి మాటలు మాట్లాడుతున్నారా?.? లేక అధికార పక్షాన్ని బెదిరించి? మైండ్ గేమ్ ఆడుతున్నారా అన్నది జనంలో చర్చ నడుస్తోం ది. ప్రభుత్వం చేస్తున్నది తప్పు అని అనిపిస్తే ఆ తప్పుని అడ్డుకోవడంపై విపక్షాలు దృష్టిపెట్టడం లేదు. మేము వచ్చాక అలా చేస్తాం, ఇలా చేస్తాం అని బెదిరించడం చాలా మామూలు అయిపోయింది. అంటే మూడేళ్ల తర్వాత వీళ్ళు వస్తే మళ్లీ పగ ప్రతీకారాలు కొనసాగుతా యన్నమాట.ఇప్పుడు వాళ్ళని వీళ్ళు వేసుకుంటారు. మూడేళ్ల తర్వాత వీళ్లు వాళ్ళని వెంటాడుతారు అన్నమాట. అధికారంలోకి వస్తే ఏం చేస్తాము అన్నది పొలిటికల్ పార్టీలేవి చెప్పడం లేదు. రెండు మూడేళ్లలో మేము అధికారంలోకి వచ్చేస్తున్నాం?. మేము ఆబుక్ లో రాస్తున్నాం? ఈ బుక్‌లో రాస్తున్నాం. రాగానే వాళ్ల సంగతి చూస్తాం. తెలుగు రాష్ట్రాల్లో అన్ని పార్టీలు ఒక రౌడీ గ్యాంగ్ లాగా తయారయ్యాయి. అసలు వీళ్ళ కాన్ఫిడెన్స్ ఏంటో అర్థం కాదు. ముఖ్యంగా ఏపీలో జగన్మోహన్ రెడ్డి కొత్త ప్రభుత్వం ఏర్పడిన ఆరో నెలలోనే మొదలుపెట్టేశారు. నెక్స్ట్ మనమే అధికారంలోకి వస్తాం. రాగానే వాళ్ల సంగతి చూస్తాం. ప్రభుత్వానికి నాలుగున్నర సంవత్సరాలు సమయం ఉంది. 164 సీట్లు ప్రభుత్వానికి ఉన్నాయి. నాలుగేళ్ల తర్వాత ఏం జరుగుతుందో ఎవడికి ఏం తెలియదు. అసలు ప్రభుత్వం ఏర్పడి ఇంకా 9 నెలలు మాత్రమే అయింది. కానీ జగన్మోహన్ రెడ్డి అప్పుడే తొందరపడి పోతున్నాడు. నాలుగేళ్లలో మనమే అధికారంలోకి రాబోతున్నాం రాగానే?. వాడి సంగతి తెలుస్తాను. వీడిసంగతి తెలుస్తాను అని హెచ్చరిస్తూ ఉంటారు. ముఖ్యంగా పోలీసు అధికారుల్ని?. జగన్ పేరు పెట్టి మరి ఓవీధి రౌడీలాగా వార్నింగ్ ఇస్తూ ఉంటారు. సరే కార్యకర్తలకు కాన్ఫిడెన్స్ నింపడానికి?. మనం అధికారంలోకి రాబో తున్నాం ధైర్యంగా ఉండండి అని చెప్పొచ్చు. ప్రభుత్వాలు నిన్న గాక మొన్న ఏర్పడ్డాయి. ఆంధ్రాలో గట్టిగా 9 నెలలు అవ్వలేదు.అప్పుడే జగన్ 2029లో నేనే అధికారంలోకి వస్తానని పాటపాడుతున్నాడు. ఆయనకు అంత తొందర ఎందుకో అర్థం కాదు. అధికారం లేకుండా ఉండలేకపోతున్నాడా? లేక నిత్యం భ్రమల్లో?.




ఊహల్లో బతుకుతున్నాడ ఇక తెలంగాణ విషయానికొస్తే బి ఆర్ ఎస్ అంచనాలకు మించి ఓవర్ కాన్ఫిడెన్స్ తో ఉంది. రేవంత్ సర్కార్ వైఫల్యాలు బి ఆర్ఎస్ లో విశ్వాసాన్ని నింపేసేయ్. ఎన్నికలకు ఇంకా మూడున్నర సంవత్సరాలు సమయం ఉంది. అయినా సరే టిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు ఆగలేకపోతున్నారు. అసలు రేపు ఎల్లుండో ఎన్నికలు జరిగిపోతున్నట్టతాము తిరిగి అధికార పీఠాల్లోకి ఎక్కి కూర్చున్నట్లు వీరావేశంతో హామీలు ఇస్తున్నారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ పక్కనే ఉన్న 400 ఎకరాల ప్రభుత్వ స్థలం విషయంలో ఒక పక్క ముఖ్యమంత్రి, డిప్యూటీ సీఎం వివరణ ఇస్తుండగానే?. మరోవైపు కేటీఆర్ కాంగ్రెస్ ఏం మాయ చేసినా సరే అక్కడ స్థలాలు ఎవరూ కొనవద్దు. మరో మూడు ఏళ్లలో మన ప్రభుత్వం వస్తుంది? ఆ స్థలాన్ని మేము వెనక్కి లాక్కుంటాం అని హెచ్చరిస్తారు. ఆ 400ఎకరాలు మన ప్రభుత్వం ఎకో పార్క్ కట్టిస్తుంది హామీ ఇచ్చేస్తారు. ఆంధ్ర, తెలంగాణలో ప్రతిపక్షాల ధైర్యం ఏంటో అర్థం కాదు. గతంలో ఒక బాధ్యతాయుతమైన పదవిలో ఉన్నాము. ముఖ్యమంత్రిగా పని చేసాము. ఇప్పుడు ప్రతిపక్షంలో ఉన్నాము. మర్యాదగా మాట్లాడాలి. అన్నధ్యాస ఏకొసానాలేదు. మూడేళ్లలో మేం అధికారంలోకి వస్తున్నాము.నాలుగేళ్లలో పవర్ లోకి వస్తాము. వాడితోలు తీస్తాము. వీడు తోలుతీస్తాము. ఆబుక్‌లో రాస్తున్నాము? ఈ బుక్‌లో ఎక్కిస్తున్నా ము?. ఇలా ఒక రౌడీ గ్యాంగులు తరహాలో హెచ్చరికలు చేస్తున్నారు. తెలుగు రాష్ట్రాల్లో ప్రతీకార రాజకీయాలు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థమవుతుంది. దీనికి ప్రధాన కారణం ఏ ప్రభుత్వమైనా ఐదేళ్లకు మించి ఉన్నదని అందరి నమ్మకం. వేలకోట్ల రూపాయలు అప్పులు తెచ్చి? సంక్షేమ పథకాల అమలు చేస్తూ? ప్రజలను సంతృప్తి పరచలేక కచ్చితంగా ప్రభుత్వంలో ఉన్న ఏ పార్టీ అయినా ఐదేళ్లకు ఓడిపోక తప్పదు?. కనుక జనం ప్రచారం న్యాయంగా మళ్ళీ మనకే ఓటేస్తారు?. అందుకే అధికారం మనకు వచ్చేస్తుంది అనే ధీమాతో?. ఓడిపోయిన మరుసటి రోజు నుంచే సిగ్గు ఎగ్గు లేకుండా మళ్లీ మనదే అధికారం అని చెప్పు తిరుగుతుంటాయి పార్టీలు. అసలు ప్రజలు మనల్ని ఎందుకు ఓడించారు?. వేరే వాళ్ళకి ఎందుకు అధికారమిచ్చారు అన్న సమీక్ష చేయకుండా? ప్రభుత్వాలకి ఏడాది నిండకుండానే వీళ్లు వచ్చే ఎన్నికల్లో మాదే అధికారంలో ప్రకటనలు చేస్తున్నారు.

# చర్చల ఎజెండాను ప్రజలే నిర్ణయించాలి!

ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు చట్టసభల్లో చర్చకు రావడం లేదు. అసెంబ్లీ కావచ్చు, పార్లమెంట్ కావచ్చు రాజకీయనాయకులు తమ ఎజెండా మేరకు ముందకు సాగుతున్నారు. అందువల్ల ప్రజలే ముందుకు వచ్చి ప్రధాన సమస్యలపై రచ్చబండలో చర్చించాలి. సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేయాలి. ప్రధానాంగా సాగు,తాగునీరు, రోడ్లు, కమ్యూనికేషన్, విద్యుత్, వైద్యం, విద్య, పన్నులు. నిత్యావసర ధరలపై చర్చచేయాలి. దరల పెరుగుదల, నివారణ చర్యలపై చర్చించి వాటిని తమ ప్రజాప్రతినిధులకు నివేదికల రూపంలో అందించాలి. చట్టసభల్లో ఈ సమస్యలు చర్చించాలని కోరాలి. ఎజెండాను ప్రజలే నిర్ణయించడం ద్వారా కొత్త రాజకీయాలకు తెలేపాలి. లేకుంటే చట్టసభల్లో సమస్యలు చర్చించరు. అందుకు అనుగుణంగా చట్టాలు రూపొందించడం జరగడం లేదు. ఎన్నికయ్యే సభ్యులు ఏం చేయబోతున్నారో ముందే హామీ ఇచ్చారు గనక వాటిపై నిలదీయాలి. ఎందుకంటే పార్లమెంట్‌లో చర్చలకు అవకాశం రావడం లేదు. గత పదేళ్లుగా ఏ అంశాన్ని కూడా చర్చించడానికి బిజెపి నేతృత్వంలోని ప్రభుత్వం ముందుకు రావడం లేదు. అవసరమైనన్ని రోజులు సమావేశాలు నిర్వహించడం, తమకు అనుకూలమైన బిల్లులు రూపొందించడం..ముగించడం అన్న ప్రక్రియను బిజెపి ఎంచుకుంది. ఇది ఎవరికి లాభమో ప్రజలు ఆలోచన చేయాలి. ఈ క్రమంలో బిజెపి అభ్యర్థులను ఈవిషయంలో ప్రజలు నిలదీయాలి. మీరు సమస్యలు చర్చించే స్వేచ్ఛను మీకు పార్టీ ఇస్తుందా అని అడగాలి. నియోజకవర్గ సమస్యలను చర్చించే అవకాశం ఏ ఒకకక ఎంపికి కూడా సరిగా రావడం లేదు. పార్లమెంట్ సమావేశాలు ఎన్నిసార్లు జరిగినా మొక్కుబడిగా ముగించేస్తున్నారు. ఏటా రెండుమూడుసార్లు సమావేశాలు జరుగుతున్నా ప్రధాన సమస్యలపై చర్చించేందు కు అధికార బిజెపి ముందుకు రావడం లేదు. గొప్పలు చెప్పుకుంటున్న బిజెపి నేతలు కూడా ప్రజల సమస్యలపై చర్చించాలన్న ఆసక్తిని ప్రదర్శించడం లేదు. పార్లమెంట్ ఉన్నదే ప్రజల సమస్యలపై చర్చించడానికి అన్న స్పృహ లేకుండా కాలాన్ని గడిపేశారు. పార్లమెంట్ సమావేశాలు మొక్కుబడిగా జరుగుతున్న వేళ..ఎంపిలను ఎన్నుకుని ఏం లాభం అన్న అనుమానం కలుగుతోంది. ఈ తరహా ప్రజాస్వామ్యం ఆందోళనకరం కాక మరోటికాదు. ప్రజలు అనేకానేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. రైతులు సమస్యలు ఎదుర్కొంటున్నారు. ధరల దాడితో సామాన్యులు అతలాకుతలం అవుతున్నారు. జివిస్టీ పేరుతో బాదేస్తున్నారు. ఇవన్నీ ఎవరికి చెప్పుకోవాలి. ఎవరు వీటిని చర్చించి నిర్ణయిస్తారు. కేవలం పార్లమెంటుకు మాత్రమే చర్చించే అవకాశం ఉంది. కాబట్టి ఎంపిలు ఇప్పటినుంచి ఈ సమస్యలపై సిద్దంగా ఉండాలి. పార్లమెంటులో తమకు మెజార్టీ ఉందికదా అని అధికారపార్టీ సమస్యలపై ఇంతకాలం పెద్దగా చర్చకు పూనుకోలేదు. ఇంతకన్నా దారుణం ఉండదు. నిజానికి దేశంలో నేటికీ పంటల కొనుగోళ్లకు సంబంధించి స్పష్టమైన విధానాలు లేవు. మద్దతు ధరలకు సంబంధించి స్పష్టమైన విధానాలు లేవు. రైతులు ఆరుగాలం కష్టించి పండించిన పంటలను ఎలాగైనా కొనుగోలు చేసి... వాటిని ప్రజలకు చేర్చాలన్న విధానాలూ లేవు. పంటల కొనుగోళ్లకు సంబంధించి జాతీయ విధానం, ఆహార పంటల ఎగుమతుల విధానాలను అమలు చేయడం లేదని వ్యవసాయ నిపుణులు ఎప్పటినుంచో మొత్తుకుంటున్నారు. కందుల కొనుగోళ్లకు సంబంధించి ఇప్పటివరకు స్పష్టత లేదు. మార్క్‌ఫెడ్ రంగంలోకి దిగడంలేదు. ఇప్పటికే రైతులు పంటను అమ్మడానికి సిద్ధం చేశారు. ఓవైపు కందిపప్పు ధరలు అమాంతంగా పెరుగుతున్నా.. కందులకు ధరలు మాత్రం రైతులకు దక్కడం లేదు. మార్కెట్‌లో సామాన్యులకు పప్పుల ధరలు అందనంతగా పెరిగాయి.

సాగుచట్టాలను బలవంతగా రుద్దేందుకు యత్నించిన కేంద్రం ..పంటల కొనుగోళ్లకు సంబంధించి జాతీయ విధానాలను నేటికీ రూపొందించడం లేదు. నిజానికి సాగుచట్టాల్లో ఇవన్నీ పొందుపర్చి ఉంటే ఆందోళనలు జరిగి వుండేవి కాదు. ఏ రాష్ట్రంలో ఏ పంట పండుతుందో లెక్కలు వేయాలి. ఏపంట పండించాలో కూడా లెక్కలు వేయాలి. దేశానికి ఏ పంటలు అవసరమో ప్రణాళిక సిద్ధం చేయాలి. కానీ అలా జరగగడం లేదు. పార్లమెంటులో ఇలాటి అత్యవసర సమస్యలపై సమగ్రంగా చర్చించడం లేదు. కేవలం ఎన్నికల కోసం పథకాలు చేపట్టడం, ఓటు బ్యాంక్‌ను సృష్టించడం వంటివాటి పైనే ప్రధానంగా దృష్టి సారిస్తున్నారు. ఈ దేశంలో అనుత్పాదక రంగాలను పెంచి పోషిస్తున్నారు.

దుబారా ఖర్చులు చేస్తున్నారు. వీటి గురించి ఎవరు కూడా నిలదీయడం లేదు. బ్యాంకులను ముంచినోళ్లను.. కంపెనీలు పెట్టి రుణాలు ఎగ్గొట్టినోళ్లను వెనకేసుకుని వస్తున్న మోడీ ప్రభుత్వం రైతులకు సంబంధించి ఆమోదయోగ్య విధానాలను మాత్రం రూపొందించడం లేదు. పంటల కొనుగోళ్లను రాష్ట్రాలకు వదిలేయడం

వల్ల ధాన్య సేకరణ అన్నది ఇప్పటికీ ఓమిథ్యగా మారింది. మిర్చి,పత్తి, వరి తదితర పంటలకు సేకరణ విధానం లేక పోవడంతో రైతులు నష్టపోతున్నారు. పంటలు మార్కెట్‌కు తరలిస్తున్నా..గిట్టుబాటు ధరలు రావడం లేదు. ఈ దశలో వారివద్దనుంచి పంటలను కనీస మద్దతు ధరలకు కొనుగోళ్లు చేసేలా చర్యలు తీసుకోవాలి.

# మామిడి రైతులపై ట్రంప్ ఎఫెక్ట్..?

హైదరాబాద్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్ సహా అనేక దేశాలపై అదనపు సుంకాలు విధించడంతో పలు రంగాలు నష్టాలను చవిచూస్తున్నాయి. భారత్‌పై ట్రంప్ 26 శాతం సుంకాలు విధించడంతో మనదేశంలోని పలు రంగాలపై ప్రతికూల ప్రభావం పడింది.ఆక్వారంగంలో రైతులు నష్టాలను ఎదుర్కొంటున్నారు. ఇప్పటికే ఏపీలో రొయ్యల ధర అమాంతం పడిపోయింది. ఇప్పుడు ట్రంప్ టారిఫ్‌ల ప్రభావం మన దేశ మామిడి పండ్లపై కూడా పడుతోంది. భారత్‌లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు వాటి ఉత్పత్తిలో ముందు వరసలో ఉన్నాయి.ఇరు రాష్ట్రాల్లో కలిపి దాదాపు 7,64,500 ఎకరాల్లో సాగవుతోంది. వాటిల్లో ప్రతి ఏడాది 24,45,900 టన్నుల మామిడి పండ్ల దిగుమతి వస్తోంది. భారత్ నుంచి అమెరికాకు ప్రతి ఏడాది 45 వేల టన్నుల మామిడి పండ్లు ఎగుమతి అవుతుంటాయి. వాటిలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ నుంచే 10 ? 15 వేల టన్నుల మామిడి పండ్లు ఎగుమతి అవుతుంటాయి.వాటి విలువ రూ. 150 ? రూ. 230 కోట్ల మధ్య ఉంటుంది. టారిఫ్‌ల పెంపుతో వాటి విలువ ఇప్పుడు మరో రూ. 50 కోట్లకు పైగా పెరగవచ్చు. దీంతో అమెరికాలో భారత మామిడి పండ్ల ధరలు పెరిగి, డిమాండ్ తగ్గే ముప్పు ఉంటుంది.గతంలో అమెరికాకు మామిడి ఎగుమతులపై టారిఫ్ 0 ? 5 శాతం మధ్య కొనసాగింది. ఇప్పుడు దాన్ని 22 శాతం నుంచి 26 శాతం వరకు పెంచారు. ట్రంప్ టారిఫ్‌లతో అమెరికాకు మనమామిడి పండ్ల ఎగుమతి ధరలు పెరుగుతున్నప్పటికీ రైతులకు ఆ లాభాలు అందే అవకాశాలు అంతంత మాత్రమే.ఎందుకంటే ఎగుమతిదారులు టారిఫ్‌ల భారాన్ని రైతులపై వేయవచ్చు. దీంతో రైతులకు గిట్టుబాటు ధర దక్కకపోవచ్చు. అమెరికాకు ఈక్వెడార్‌తో పాటు ఇండొనేషియా తక్కువ ధరకు మామిడిని ఎగుమతి చేస్తే మన దేశ రైతులు యూఎస్‌లో మార్కెట్‌ను కోల్పోయే అవకాశం ఉంది.

# నంబరు ప్లేటు.. నచ్చినట్లు రాస్తే కుదరదు

రాజమహేంద్రవరం :మీ వాహనానికి నంబరు ప్లేటు సరిగా లేకుంటే జరిమానా కట్టాల్సిందే. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని పోలీసు, రవాణా శాఖల అధికారులు స్పష్టం చేస్తున్నారు. పలువురు చోదకులు నంబరు ప్లేట్లను ఇష్టానుసారం రాయించుకుని వాహనాలు తిప్పేస్తున్నారు. కొందరు అసలు నంబరు ప్లేటు లేకుండా వాహనాలు తిప్పుతున్నారు. 2016 నుంచి షోరూంలలో వాహనాలను కొన్నవారు

తప్పనిసరిగా ప్రభుత్వం అందజేస్తున్న హై సెక్యూరిటీ నంబరు ప్లేట్‌ను మాత్రమే బిగించుకోవాలన్న నిబంధన ఉన్నా చాలామంది అతిక్రమిస్తున్నారు. రవాణేతర వాహనాలకు నంబరు ప్లేటు తెలుపుగా ఉండి దానిపై నల్ల అక్షరాలు, అంకెలు ఉండాలి. ః రవాణా వాహనాలకు పసుపు నంబరు ప్లేటుపై నల్ల అక్షరాలు, అంకెలు ఉండాలి.

ః రిజిస్ట్రేషన్ జరిగే విద్యుత్తు వాహనాలకు ఆకుపచ్చ నంబరు ప్లేటు ఉండాలి. నంబరు ప్లేట్‌తో ఓ వాహనం చరిత్ర మొత్తం ఇట్టే తెలుసుకోవచ్చు. దీని ప్రాధాన్యతను గుర్తించి కేంద్ర మోటారు వెహికల్ చట్టంలో కొన్ని నిబంధనలను ఉంచారు. వాహనం కేటగిరీని బట్టి కచ్చితంగా హై సెక్యూరిటీ నంబరు ప్లేట్‌ను మాత్రమే బిగించుకోవాల్సి ఉంది. ప్లేటుపై నంబరులోని అంకెలు, అక్షరాలు మినహా ఏమీ ఉండకూడదు. చాలా వాహనాలకు




సినీనటులు, రాజకీయ నాయకులు చిత్రాలు ఉంటున్నాయి. అంకెలు, అక్షరాలను జిగ్ జాగ్‌గా రాస్తున్నారు. మోటారు వాహనాల చట్టం ప్రకారం.. ఫ్యాన్సీ నంబర్లతో తిరుగుతుంటే రవాణేతర వాహనాలకు రూ.1,150, రవాణా వాహనాలకు రూ.1,300 అపరాధ రుసుం విధిస్తారు. ట్రాఫిక్ పోలీసుల తనిఖీల్లచి పట్టుబడితే రూ.100 నుంచి రూ.150 వరకు చలానా రాస్తారు. ఇతర ఉల్లంఘనలుంటే అపరాధ రుసుములు మరింతపెరగడంతోపాటు కేసులు నమోదు వరకూ వెళ్తుంది.

# సిబ్బంది అరకొర..నేరాల కట్టడి ఎలా?





వి.ఎల్.పురం : రైలు ప్రయాణికులకు భద్రత కల్పించడంతోపాటు నేరాలు నియంత్రించడంలో కీలకంగా వ్యవహరించే గవర్నమెంట్ రైల్వే పోలీసులు(జీఆర్పీ)లో సిబ్బంది కొరత వెంటాడుతూనే ఉంది. ఉన్న సిబ్బందిపై భారం పెరగడమేకాక అవసరానికి సెలవులు కూడా దొరకక కిందిస్థాయి సిబ్బంది సతమతమవుతున్నారు. స్టేషన్ల పరిధిలో పూర్తి పర్యవేక్షణతోపాటు పలు చోరీ కేసుల దర్యాప్తు త్వరితగతిన ముందుకు సాగని పరిస్థితి నెలకొంది. రాజమహేంద్రవరం జీఆర్పీ స్టేషన్ పరిధిలో ఇక్కడి ప్రధాన రైల్వేస్టేషన్‌తో కలిపి అయిదు స్టేషన్లున్నాయి. ఇటు గోదావరి రైల్వేస్టేషన్ నుంచి అటు ద్వారపూడి వరకు శాంతిభద్రతల పర్యవేక్షణ, నేరాల నియంత్రణ బాధ్యతలు ఇక్కడి జీఆర్పీ సిబ్బంది చూడాల్సి ఉంటుంది. ముఖ్యంగా రైళ్ల హాల్టు, ప్రయాణికులు రాకపోకలు ఎక్కువగా ఉండే ప్రధాన రైల్వేస్టేషన్‌తోపాటు నగరం మధ్యలోని గోదావరి స్టేషన్‌లో మూడు షిఫ్టులుగా నిరంతర గస్తీ నిర్వర్తించాల్సి ఉంటుంది. సిబ్బంది కొరత కారణంగా ప్రధాన స్టేషన్‌లో షిఫ్టునకు ముగ్గురు, గోదావరి స్టేషన్ వద్ద ఇద్దరిని విధులకు కేటాయిస్తున్నారు.ఖాళీగా 22 పోస్టులు: ఇక్కడి జీఆర్పీ స్టేషన్‌లో మొత్తం 53 మంది సిబ్బంది ఉండాల్సి ఉండగా 22 పోస్టులు కొంతకాలంగా ఖాళీగానే ఉన్నాయి. ఈ ఏడాది జనవరి నుంచి సెప్టెంబరు 30 వరకు ఇక్కడి జీఆర్పీ స్టేషన్‌లో మొత్తం 38 చోరీ కేసులు నమోదయ్యాయి. రైలు ప్రయాణికులకు సంబంధించి మొత్తం రూ.21.16 లక్షల సొత్తు చోరీకి గురైంది. ఇప్పటివరకు ఏడు కేసుల్లో రూ.4.39 లక్షలు మాత్రమే రికవరీ చేయగలిగారు. సిబ్బంది కొరత కారణంగా మరో 31 చోరీ కేసుల దర్యాప్తు వేగవంతం చేయలేని పరిస్థితి.

కొన్ని కీలక కేసుల్లో రైల్వే రక్షక దళం(ఆర్పీఎఫ్) సిబ్బంది సహకారం తీసుకుంటే తప్ప ఛేదించలేని పరిస్థితి. ప్రస్తుతం ఏఎస్సై, 21 మంది కానిస్టేబుళ్ల పోస్టులు ఖాళీగా ఉండటం సమస్యగా మారింది. ఉన్న సిబ్బందే రైళ్లలో, ప్లాట్‌ఫామ్‌పై గస్తీ, ఎస్కార్ట్ విధులకే సరిపడక.. చోరీలు ఇతర నేరాలకు సంబంధించి కేసుల దర్యాప్తు సాగించలేని పరిస్థితి. పోస్టుల భర్తీకి గత ప్రభుత్వం హయాంలోనే ప్రతిపాదనలు పంపినా ఫలితం లేక ఉన్న సిబ్బందితోనే నెట్టుకొస్తున్నారు.

# వసతుల్లేవు.. పర్యవేక్షణ లేదు

నరసరావుపేట:నరసరావుపేట రామిరెడ్డిపేటలోని పోస్టుమెట్రిక్ వసతి గృహంలో సిగరెట్ పీకలు, మద్యం సీసాలు గుట్టలుగా మద్యం సీసాలు.. విచ్చలవిడిగా సిగరెట్ పీకలు.. తిరగని ఫ్యాన్‌లు.. పనిచేయని స్విచ్‌బోర్డులు.. అపరిశుభ్ర పరిసరాలు.. జిల్లాలోని పలు వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలు ఇవి. ఇంటర్ డిగ్రీ చదివే విద్యార్థులుండే వసతి గృహాల్లో సౌకర్యాలు కొరవడ్డాయి. బాగా చదువుకుని మంచి ఉద్యోగాల్లో స్థిరపడతారని గ్రామాల నుంచి పట్టణాలకు పంపించి ప్రభుత్వ వసతిగృహాల్లో చేర్పిస్తే అక్కడ ఉండే వాతావరణం చూసి విద్యార్థుల తల్లిదండ్రులు భయపడుతున్నారు. పలు వసతి గృహాల్లో విద్యార్థులు పక్కదారి పట్టేలా పరిస్థితులు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు చొరవ చూపి సమస్యలు పరిష్కరించకుంటే విద్యార్థుల భవిష్యత్తు అంధకారమేనని విద్యావేత్తలు ఆవేదన చెందుతున్నారు. ఇంటర్, డిగ్రీ విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన పోస్టుమెట్రిక్ వసతి గృహాల్లోనే ఇలాంటి వాతావరణం కనిపిస్తోంది. జిల్లాలో పోస్టుమెట్రిక్ వసతి గృహాల్లో వార్డెన్ల కొరత తీవ్రంగా వేధిస్తోంది. ఎస్సీ వసతి గృహాలనే తీసుకుంటే జిల్లాలో 11 వసతి గృహాలుండగా.. ఇందులో ఏడింట్లో రెగ్యులర్ వార్డెన్లు ఉండగా.. నాలుగు చోట్ల ఇన్‌ఛార్జిలతో నడిపిస్తున్నారు. 14 బీసీ వసతి గృహాల్లో ఒకచోట ఇన్‌ఛార్జి వార్డెన్ ఉన్నారు. గిరిజన వసతి గృహాల్లో మాత్రం మూడుచోట్లా రెగ్యులర్ వార్డెన్లు ఉన్నారు. వసతి గృహాల్లో వార్డెన్లు లేక విద్యార్థుల ఇష్టారాజ్యం అవుతోంది. అడిగేవారు లేకపోవడంతో రాత్రిళ్లు కొన్నిచోట్ల మద్యం సీసాలను నేరుగా వసతిగృహాలకే తీసుకొస్తున్నారు. కొందరు ధూమపానం కూడా చేస్తున్నట్లు సమాచారం. కళాశాల విద్య కోసం గ్రామాల నుంచి పట్టణాలకు రావడం.. కొత్త స్నేహాలు.. బిర్యానీ.. మందు.. సిగరెట్.. వంటి అలవాట్లతో విద్యార్థులు పక్కదారి పడుతున్నారు. ఇలాంటి అలవా



ట్లకు వసతిగృహాలు నిలయాలుగా మారడం బాధాకరం. నరసరావుపేట, వినుకొండ, సత్తెనపల్లి, మాచర్ల, చిలకలూరిపేట వంటి పట్టణాల్లో ఉండే పోస్టుమెట్రిక్ వసతి గృహాల్లో అపరిశుభ్ర వాతావరణం నెలకొంటోంది. కొన్నింటికి సొంతభవనాలు లేవు. అద్దె భవనాల్లో నడిపిస్తున్నారు. ఫ్యాన్లు తిరగవు. కొన్నిచోట్ల అయితే ఫ్యాన్లను ధ్వంసం చేస్తున్నారు.

స్విచ్‌బోర్డు ఊడిపోయి.. విద్యుత్తు తీగలు వేలాడుతూ భయంకరంగా ఉన్నాయి. కిటికీలు, తలుపులు ఊడిపోయాయి. మరుగుదొడ్ల సంగతి సరేసరి. ఆహారం కూడా నాణ్యత ఉండడం లేదని పలువురు చెబుతున్నారు. జిల్లా కేంద్రం రామిరెడ్డిపేటలో ఉండే వసతిగృహం పరిస్థితి తీసికట్టుగా ఉంది. ఎక్కడి కక్కడ చెత్త.. మద్యం సీసాలు, సిగరేట్ పీకలు కనిపిస్తున్నాయి. వసతి గృహంలోకి అడుగుపెట్టగానే దుర్వాసన వస్తోంది.

ఇలా ఉండబట్టే విద్యార్థుల సంఖ్య కూడా ఆయా వసతిగృహాల్లో రానురాను తగ్గిపోతోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు సందర్శించి గాడినపెట్టాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

## విద్యుత్తు పరికరాల

# అంచనా వ్యయాలు ఏపీలో ఎక్కువ



కర్నూలు: దేశంలోని ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్‌లో విద్యుత్తు పరికరాల అంచనా వ్యయాలు ఎక్కువగా ఉన్నాయని, వాటిని అదుపు చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ విద్యుత్తు నియంత్రణ మండలి (ఏపీఈఆర్సీ) ఛైర్మన్ జస్టిస్ సి.నాగార్జునరెడ్డి అన్నారు. కర్నూలులోని ఏపీఈఆర్సీ కార్యాలయంలో నిర్వహించిన 'రాష్ట్ర విద్యుత్తు సమన్వయ ఫోరం' సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి ప్రసంగించారు. రాష్ట్రంలోని విద్యుత్తు ఉత్పత్తి, పంపిణీ సంస్థలు రాష్ట్ర ప్రభుత్వ 'సమీకృత స్వచ్ఛ ఇంధన విధానం'లోని ముఖ్య అంశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. అన్నిరకాల విద్యుత్తు వినియోగదారులకు ఉపయుక్తంగా ఉండేలా 2024-25 నుంచి 2028-29 ఆర్థిక సంవత్సరం వరకు ఐదేళ్లపాటు అమలులో ఉండే రాష్ట్ర విద్యుత్తు ప్రణాళికను తీర్చిదిద్దినట్లు గుర్తుచేశారు. సమీకృత స్వచ్ఛ ఇంధన విధానానికి అనుగుణంగా ఆ రాష్ట్ర ప్రణాళికను అవసరం మేరకు పునఃసమీక్ష చేయాలని సూచించారు. రాష్ట్రంలోని అన్ని విద్యుత్తు సంస్థలు ఏటా డిసెంబరు నెలాఖరుకల్లా.. ఆ తర్వాత ఆర్థిక సంవత్సరానికి అమలుచేసే 'కాస్ట్‌డేటా'కు ఏపీఈఆర్సీ అనుమతి తీసుకోవాలని గుర్తుచేశారు. ప్రతి విద్యుత్తు పంపిణీ సంస్థ పరిధిలో విద్యుత్తు నియంత్రణ మండలి తరఫున ఒక ప్రత్యేకాధికారిని నియమించామని తెలిపారు. వారు సంస్థ పరిధిలోని లైన్లు, ఉప కేంద్రాలు తనిఖీ చేసి భద్రతా చర్యల నిమిత్తం తగిన సలహాలు, సూచనలు చేస్తారని.. వాటిని కమిషన్ ఆదేశాలుగా పరిగణించి పంపిణీ సంస్థలు అమలుచేయాలని పేర్కొన్నారు. వినియోగదారులకు సంతృప్తికరమైన సేవలు అందించడమే లక్ష్యంగా విద్యుత్తు పంపిణీ సంస్థ పనిచేయాలని చెప్పారు. రాష్ట్ర విద్యుత్తు ప్రణాళిక ఉద్దేశాలు, లక్ష్యాలను రాష్ట్ర ప్రభుత్వ ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి విజయానంద్ వివరించారు. ఈ కార్యక్రమంలో ఏపీఈఆర్సీసభ్యులు ఠాకూర్ రామ్‌సింగ్, వెంకటరామరెడ్డి, పంపిణీ సంస్థల సీఎండీలు పి.రవి, సంతోష్‌రావు, ఏపీ ట్రాన్స్‌కో జేఎండీ కీర్తి చేకూరి, ఎన్టీపీసీ, సెకి సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# చిరస్థాయిగా నిలిచేలా తాండవ ఎత్తిపోతల: అయ్యన్న

నాతవరం: 'యాభై ఏళ్ల రాజకీయ జీవితంలో చిరస్థాయిగా నిలిచిపోయేలా తాండవ ఎత్తిపోతల పథకాన్ని సాధించి ఆయకట్టు భూములను సస్యశ్యామలం చేస్తా'నని సభాపతి అయ్యన్నపాత్రుడు హామీ ఇచ్చారు. పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా గొలుగొండపేట నుంచి వెదురుపల్లి వరకు రోడ్డు నిర్మాణానికిశంకుస్థాపన చేశారు. ఎత్తిపోతలకు సంబంధించిన ప్రతిపాదనలను ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబుకు అందజేసినట్లు చెప్పారు. గబ్బాడ యార్డులో అక్రమంగా ఇసుక నిల్వ చేసిన సంస్థకు రూ. 20 కోట్ల జరిమానా విధించేలా చేశానన్నారు. గబ్బాడ యార్డులో అక్రమంగా ఇసుక నిల్వ చేసిన సంస్థకు రూ. 20 కోట్ల జరిమానా విధించేలా చేశానన్నారు. ఈ ఇసుకను రవాణా ఛార్జీలు చెల్లించి ఎవరైనా తీసుకువెళ్లవచ్చని ఈ ఇసుకను రవాణా ఛార్జీలు చెల్లించి ఎవరైనా తీసుకువెళ్లవచ్చని సూచించారు. నాతవరం మండలం లోరహదారులఅభివృద్ధిని వైకాపా ప్రభుత్వం గాలికొదిలేసిందని మండిపడ్డారు. వెదురుపల్లి, మన్యపురట్ల, కాకరాపల్లి రహదారుల నిర్మాణానికి రూ. 3 కోట్లు ఖర్చు చేయనున్నట్లు చెప్పారు. నాయకుల మధ్య




కుమ్ములాటలు సరికాదని, పనిచేసే వారికే పదవులని స్పష్టం చేశారు. ప్రతిఒక్కరూ తెదేపా సభ్యత్వ నమోదుపై దృష్టి సారించాలని సూచించారు. ఆర్డీఓ రమణ, డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ అన్నపూర్ణాదేవి, నాయకులు సూర్యచంద్ర, సత్యనారాయణ, రమణ, సత్తిబాబు పాల్గొన్నారు.

# పెచ్చుమీరిన యూసీడీ సిబ్బంది ఆగడాలు

విశాఖ:మహా విశాఖ నగరపాలక సంస్థ యూసీడీ (పట్టణ సామాజికాభివృద్ధి) సిబ్బంది ఆగడాలు పెచ్చుమీరుతున్నాయి. మెప్మా నుంచి వచ్చి జీవీఎంసీలో డీసీఎంగా (డిస్ట్రిక్ట్ మిషన్ కో-ఆర్డినేటర్) విధులు నిర్వహించిన అధికారి మహిళా సంఘాల నుంచి రూ.కోట్లు తీసుకున్నట్లు ఇటీవల తెదేపా కార్పొరేటర్ రాపర్తి కన్నా ఆధారాలను బయటపెట్టడంతో కమిషనర్ ఆయన్ను సస్పెండ్ చేశారు. డీసీఎం వ్యవహారంతోపాటు, యూసీడీ సిబ్బంది అక్రమాలపై అదనపు కమిషనర్ ఎస్ఎస్ వర్మను విచారణాధికారిగా నియమించారు. త్వరలో ఆయన విచారణ ప్రారంభించనున్నారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న డీసీఎంకు సహకరించిన ఇద్దరు ఆర్పీలను కమిషనర్ సస్పెండ్ చేశారు. అయితే తమను ఎవరూ సస్పెండ్ చేయలేదని మహిళా సంఘాల ప్రతినిధులకు చెబుతూ క్షేత్రస్థాయిలో యూసీడీ వ్యవహారాలన్నీ వారే నడిపిస్తుండడం గమనార్హం. సోమవారం 98వ వార్డుకు చెందిన 70 మంది డ్వాక్రా మహిళలు జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి వచ్చి కమిషనర్ సంపత్‌కుమార్‌ను కలిశారు. ఆర్పీ లక్ష్మీ ప్రసన్న వేధింపులు భరించలేకపోతున్నామని, ప్రతి విషయానికి డబ్బులు డిమాండ్ చేస్తూ



ఇబ్బందులకు గురి చేస్తోందని ఫిర్యాదు చేశారు. అధికారులు ఆమెను సస్పెండ్ చేశామని చెబుతున్నా క్షేత్రస్థాయిలో విధులు నిర్వహిస్తోందని తెలిపారు. పలువురు యూసీడీ అధికారులు ఆమెకు కొమ్ము కాస్తున్నారని ఆరోపించారు. బ్యాంకు నుంచి తీసుకున్న రుణాలను తన వద్ద ఉంచుకుని వడ్డీలు చెల్లిస్తానని చెబుతోందని, ప్రభుత్వ నిధులు, రాయితీలు అందకుండా చేస్తోందని వాపోయారు.

# సంక్షోభ హాస్టళ్లు!-పెచ్చులూడుతున్న పైకప్పులు



తిరుపతి: ఏర్పేడు బీసీ బాలుర హాస్టల్లో పిల్లలకు కనీస సదుపాయాలు లేవు. బెడ్‌షీట్లు సరఫరా కాకపోవడంతో ఇళ్ల నుంచి తెచ్చుకుని వాడుకుంటున్నారు. దుస్తులు కూడా ఇంతవరకూ పంపిణీ కాలేదు. వర్షానికి రెండు గదులు ఉరుస్తున్నాయి. గదుల పైకప్పు కాంక్రీటు పెచ్చులూడిపోయి ఇనుప కమ్మీలు కనిపిస్తున్నాయి. పైపులైను పాడవడంతో రెండు వాటర్ ట్యాంకులు నిరుపయోగంగా ఉన్నాయి. సిమెంట్ తొట్టిలో నీరు నింపి వాటిని వాడుకుంటున్నారు. ప్రహరీ లేకపోవడంతో ముళ్ల కంచె ఏర్పాటు చేశారు. దీంతో పగలు పశువులు, రాత్రిళ్లు పాములు ఆవరణలోకి వస్తున్నాయి. వార్డెన్ పోస్టు ఖాళీగా ఉండటంతో రేణిగుంట వార్డెన్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. బీఎన్ కండ్రిగ ఎస్సీ బాలుర హాస్టల్ భవనం కట్టి 30 ఏళ్ళవుతోంది. గోడలు కూడా బీటలు వారాయి. కిటికీల తలుపులు పగిలిపోయాయి. బీసీ బాలుర హాస్టల్‌లో మరుగుదొడ్ల నిర్మాణం ఆరేళ్ళగా అసంపూర్తిగానే వుంది. సత్యవేడు బీసీ బాలుర హాస్టల్ గదుల పైకప్పు దెబ్బతింది. కాంక్రీటు పెచ్చులూడిపోయి కూలిపోయే స్థితిలో ఉన్నాయి. గదులన్నీ వర్షానికి ఉరుస్తున్నాయి. గోడలు నానిపోయి చెమ్మ తేలి ఉన్నాయి. కిటికీల తలుపులు పుచ్చిపోయాయి. సత్యవేడులోనే ఎస్సీ బాలుర హాస్టల్ పైకప్పు కూలిపోయే ప్రమాదం కనిపిస్తోంది. వంట గది చూస్తే అన్నం తినబుద్ది కాదు. వాచ్‌మెన్ పోస్టు ఖాళీ. వంట మనిషే అన్ని పనులూ చేస్తున్నారు. పిచ్చాటూరు ఎస్సీ బాలుర హాస్టల్ భవనం ప్రమాదకర స్థితిలో ఉంది. పైకప్పు మొత్తం దెబ్బతిని ఏ క్షణానైనా కూలిపోయేలా వుంది. ప్రహరీ లేకపోవడంతో హాస్టల్ చుట్టూ వర్షానికి నీరు చేరుతోంది. డక్కిలి బీసీ బాలుర హాస్టల్‌లో గదులన్నీ అధ్వాన్నంగా వున్నాయి. కిటికీలకు తలుపులు పూర్తిగా ఊడిపోవడంతో గోతాములు కట్టి మూసేశారు. వర్షానికి గదులు ఉరుస్తున్నాయని విద్యార్థులు చెప్పారు. బాత్‌రూమ్ దుర్వాసన వెదజల్లుతోంది. నాయుడుపేట బీసీ సంక్షేమ కళాశాల వసతి గృహం అద్దె భవనంలో నడుస్తోంది. భవన నిర్మాణం ఇంకా పూర్తి కాలేదు. ఫ్లోరింగ్ పూర్తి కాలేదు. గోడలకు ప్లాస్టరింగ్ జరగలేదు. కిటికీలు, తలుపులు కూడా ఏర్పాటు కాలేదు.

# నిబంధనలు గాలికి..!-ప్రజల ప్రాణాలతో చెలగాటం

తిరుపతి: తిరుపతికి చెందిన ఓ యువతి గర్భం దాల్చింది. దాన్ని పోగొట్టుకునేందుకు మందుల కోసం తిరుపతిలోని ప్రైవేటు దుకాణాన్ని ఆశ్రయించింది. డాక్టరు చీటీ లేకుండా మందులు ఇవ్వకూడదని, అలా ఇవ్వాలంటే అదనంగా నగదు చెల్లించాల్సి వస్తుందని దుకాణదారుడు చెప్పాడు. గత్యంతరం లేక ఎమ్మార్పీ కంటే రెండింతల ధర పెట్టి మందులు కొనుగోలు చేసింది. వాటిని ఇష్టానుసారం వాడటం వల్ల తీవ్ర రక్తస్రావమై ప్రాణం మీదకు తెచ్చుకుని ఆస్పత్రి పాలైంది. శ్రీకాళహస్తికి చెందిన సురేష్ తన ఐదేళ్ల కుమారుడు దగ్గు, జలుబుతో బాధపడుతుండటంతో పట్టణంలోని ఓ మందుల దుకాణానికి వెళ్లి విషయం చెప్పాడు. దుకాణ యజమాని మందులు ఇచ్చి, మూడు రోజులు వాడమని చెప్పాడు. ఆ మందులు వాడినా ఎలాంటి ఉపయోగమూ లేకపోగా బాలుడి ఆరోగ్య పరిస్థితి విషమించింది. చివరకు డాక్టరు దగ్గరకు వెళ్లారు. బాలుడిని రెండు రోజులు ఆస్పత్రిలో ఉంచి రూ.10 వేలు ఖర్చు పెట్టాల్సి వచ్చింది. జిల్లాలో ఇటువంటి ఘటనలు నిత్యం వెలుగు చూస్తున్నా సంబంధిత వైద్యాధికారులు కట్టడి చేసే దిశగా చర్యలు చేపట్టడం లేదు. జిల్లావ్యాప్తంగా 2,700 లైసెన్సు కలిగిన మందుల దుకాణాలు ఉంటే అందులో తిరుపతిలో 600లకు పైగా ఉన్నాయి. లైసెన్సు లేకుండా 500కు పైగా కొనసాగుతున్నాయి. వీటి పరిధిలో సగటున రోజుకు రూ.6 నుంచి 8 కోట్ల వ్యాపారం జరుగుతోంది. అర్హత లేకనే మందుల (ఔషధ) దుకాణాలు పెట్టేసి, ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. వైద్యుల సిఫారసు లేకుండా ఇస్తున్న మందులతో రోగుల ప్రాణాల మీదకు వస్తోంది. మందుల దుకాణం ప్రారంభించాలంటే ముందుగా ఔషధ నియంత్రణ అధికారుల అనుమతి తీసుకోవాలి. దుకాణంలో డీఫార్మసీ పూర్తి చేసిన ఫార్మాసిస్టు తప్పక అందుబాటులో ఉండాలి. అనుమతి వారి పేరుతోనే ఉండాలి.



మందుల విక్రయాలు పూర్తిగా డాక్టరు చీటి ఉంటేనే విక్రయించాలి. కొనుగోలు చేసిన, విక్రయించిన మందుల వివరాలు రికార్డుల్లో నమోదు చేయాలి. ఇరకు గదుల్లోనూ దుకాణాలకు అనుమతులు ఇచ్చేస్తున్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్న దాఖలాలు కనిపించడం లేదు. జిల్లాలో ఔషధ నియంత్రణ పరిపాలన సహాయ సంచాలకులు ఒకరు, డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు ఇద్దరు ఉన్నారు. వీరు మందుల దుకాణం ఏర్పాటుకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, క్షేత్రస్థాయిలో కొలతలు, నిబంధనలు పరిశీలించాలి. నెలలో ఒకసారైనా దుకాణాలను తనిఖీ చేయాలి. ఆ దిశగా ఎక్కడా కనిపించడం లేదు. ముడుపులు అందుతుండడం వల్లే అటువైపు చూడడం లేదన్న విమర్శలున్నాయి. దుకాణాలు పక్క ప్రాంతాల్లోకి మార్చుకోవాలన్నా లేదా ఐదేళ్లకు ఒకసారి రెన్యువల్ చేసుకోవాలన్నా అదనంగా ముడుపులు చెల్లించాల్సి వస్తోందని విక్రయదారులు వాపోతున్నారు. ఇదే వ్యవహారంలో ఇటీవల గూడూరులో డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఏసీబీకి చిక్కారు.

# ఆగని ఇసుక అక్రమాలు-అడ్డుకున్న గ్రామస్తులు

చౌడేపల్లె, : వైసీపీ ప్రభుత్వం మారినా ఇసుక అక్రమాలు ఆగడం లేదు. తాజాగా ఇసుక అక్రమ తవ్వకాలను లద్దిగం గ్రామస్తులు అడ్డుకున్న సంఘటన ఆదివారం చౌడేపల్లె మండలంలో జరిగింది. చౌడేపల్లె, పుంగనూరు మండ లాల్లో అతిపెద్ద చెరువుల్లో లద్దిగం చెరువు కూడా ఒకటి. మొత్తం 750 ఎకరా (చౌడేపల్లె మండలంలో 500, పుంగనూరు మండలంలో 250 ఎకరా)ల్లో విస్తరించి ఉంది. ఈ చెరువు ఆయకట్టు కింద లద్దిగం, బండ్లపల్లె, కొత్తపల్లె, తిర్ణింపల్లె, మలసముద్రం, అంకుతోటపల్లె, పుదిపట్ల గ్రామాలకుచెందిన సుమారు వెయ్యి ఎకరాలపైనే ఆయకట్టు భూములను రైతులు సాగు చేస్తున్నారు. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో ఇసుకను కొన్నేళ్లుగా ఈ చెరువులో తవ్వేసి.. తరలించి.. కోట్లు గడించారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా టీడీపీ నాయకుల అండతో నెల్లూరు జిల్లాకు చెందిన కొందరు వైసీపీ నాయకులు ఇసుక అక్రమ తవ్వకాలు ఆపలేదు. గత ప్రభుత్వంలో నోరు తెరవడానికి కూడా భయపడిన మేము.. ప్రస్తుతం ధైర్యం చేసి, తవ్వకాలను అడ్డుకున్నాం. మమ్మల్ని చూసి అక్కడ పనిచేస్తున్న వారు యంత్రాలను వదిలి వెళ్లిపోయారు. చెరువులో సుమారు 40 నుంచి 50 అడుగుల లోతు వరకు మ ట్టిని తవ్వేసి.. ఇసుక తీసేస్తున్నారు. నదిని తలపించేలా తవ్వేయడం వల్ల చెరువు రూపు కోల్పోవటంతోపాటు, భూగర్భ జలాలూ అడుగంటిపోతున్నాయి. దీనిపై గతంలో, ప్రస్తుతం ఎన్నిమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. జిల్లాలో గుర్తించిన ఇసుక పాయింట్లలో యంత్రాలతో తవ్వుతున్నట్లు తెలిసినా, అక్రమంగా తరలిస్తున్నా.. పార్టీలకు అతీతంగా కేసులు నమోదు చేస్తున్నారు. జీడీనెల్లూరు మండలంలో ఇటీవల యంత్రాలతో ఇసుకను తమిళనాడుకు తరలిస్తున్నారని తెలుసుకున్న అధికారులు దాడులు చేసి.. మిషనరీని సీజ్ చేశారు. మా చెరువును రక్షించుకోవాలన్న ఉద్దేశంతో తవ్వకాలను అడ్డుకున్నాం. కలెక్టర్ స్పందించి తవ్వకాలు జరగకుండా చేసి, చెరువును బాగు చేయించాలి. తహసీల్దార్ హనుమంతును వివరణ కోరగా.. చెరువులో ఇసుక అక్రమ తవ్వకాలు జరుగుతున్నట్లు తెలియగానే తమ సిబ్బందితో వెళ్లి అక్కడున్న ఐదు ఎక్స్‌కవేటర్లు, ఓ టిప్పర్‌ను సీజ్ చేసినట్లు తెలిపారు. పుంగనూరు రూరల్ సీఐ రాంభూపాల్ మాట్లాడుతూ.. రెవెన్యూ అధికారుల ఫిర్యాదుతో తమ సిబ్బంది అక్కడికి వెళ్లి పనులను ఆపించామన్నారు. అలాగే తహసీల్దార్ ఆదేశాలతో పనులు జరగకుండా తమ సిబ్బందిని అక్కడే బందోబస్తు పెట్టినట్లు వివరించారు.





# పీఎం సూర్య ఘర్ పథకంపై... అవగాహన కల్పించాలి


పీఎం సూర్య ఘర్ పథకంపై ప్రజలకు అవగాహన కలిపించాల్సిన ఆవశ్యకత అధికారులపై ఉన్నది. జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష దీనిపై పలు శాఖల అధికారులతో సమీక్షా జరుపుతున్న క్షేత్రస్థాయిలో ప్రజలకు దీనిపై అవగాహన శూన్యమేనని చెప్పాలి. ఈ సోలార్ విద్యుత్ ను వాడుకోవడం వల్ల అటు కరెంట్ ఉచితంగా వాడుకోవడంతోపాటు అదనంగా ఉత్పత్తి చేస్తే ఆదాయం కూడా వస్తుందనే విషయం ఎంత మంది ప్రజలకు తెలుసును అనేది ప్రశ్న. అయితే కేంద్రం రేడ్ కో ఆధ్వర్యంలో రాయితీతో కూడిన సోలార్ విద్యుత్‌ను అందిస్తుండగా గతంలో పలువురు లబ్ధిదారులు పోస్టల్ శాఖ ద్వారా ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకున్నారు. అయితే జిల్లా నుండి ఆశించిన స్థాయిలోదరఖాస్తులు వచ్చిన,వాటికి సంబందించిన పనులు ఇంకా నత్తనడకన సాగుతున్నాయని పలువురు లబ్ధిదారులు పేర్కొంటు న్నారు. కాగాసోలార్ విద్యుత్ పై సమీకృత జిల్లా కలెక్టరేట్ లో జిలా కలెక్టర్ కోయ శ్రీహర్షమరోసారి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ తెలంగాణ రెడ్కో ద్వారా పీఏం సూర్య ఘర్-ముఫ్త్ బీజ్లి యోజన పథకం అమలు తదితర అంశాలు, ఈ పథకం క్రింద ప్రజలు స్వచ్ఛందంగా ఇంటి పై రూఫ్ టాప్ సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేసుకుంటే ప్రభుత్వం సబ్సిడీ అంది స్తుందని అన్నారు. దానికి ఇస్తున్న రాయితీలను వివరించారు. అయితే 2 కిలోవాట్ రూఫ్ టాప్ సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేసుకుంటే 150 యూనిట్ల వరకు, 3 కిలో వాట్ రూఫ్ టాప్ సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేసుకుంటే 300 యూనిట్ల వరకు ప్రతి నెలా ఉచితంగా విద్యుత్ పొందవచ్చని అన్నారు. ఇంటిపై ఏర్పాటు చేసుకునే రూఫ్ టాప్ సోలార్ ప్లాంట్ కు ప్రభుత్వం సబ్సిడీ అందిస్తుందని, కిలోవాట్ కు30వేలు,2 కే.డబ్ల్యూ కు 60 వేలు,3 కే.డబ్లూకు 78 వేల సబ్సిడీ కేంద్ర ప్రభుత్వం అందిస్తుందని వివరించారు. ప్రభుత్వం రెడ్కో ద్వారా అందించే వివిధ సబ్సిడీలను వివిధ శాఖల అధికారుల ద్వారా సమన్వయంతో ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. సోలార్ ప్లాంటను మన ఇంటి పై ఏర్పాటు చే సుకోవడం ద్వారా మనకు ఉచిత విద్యుత్ అందుతుందని, మన అవసరాలకు మించి అధికంగా విద్యుత్ ఉత్పత్తి చేసే సమయంలో గ్రిడ్‌కు విక్రయించడం ద్వారా మనకు ఆదాయం కూడా లభిస్తుందని అన్నారు. కాగా ఈపథకం ద్వారా ప్రజలకు ఎంతో కొంత మేలు జరుగుతుందనే విషయా న్ని అధికారులు మరింత ప్రచారం చేయాల్సినఅవసరం ఎంతైె నా ఉన్నది. మున్సిపల్, విద్యుత్ శాఖ అధికారులు సమన్వయం చేసుకుంటే విద్యుత్ ఆదాతో పాటు అదనపు ఆదాయం వస్తుందనే విషయం తెలియజేయాలి. వివిధ మాద్యమాలు, ప్రచార సాధనాలు ద్వారా ప్రజలకు చేర వేసేలా అధికారులు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు



## మిర్చి ధర మళ్లీ నేలచూపు...!

గుంటూరు : స్వల్పంగా పెరిగిన మిర్చి ధరలు మళ్లీ నేల చూపులు చూస్తున్నాయి. మరోవైపు మిర్చి యార్డుకు భారీగా సరుకు వచ్చింది. రాయలసీమ, ఉమ్మడి ప్రకాశం, గుంటూరు జిల్లాల నుంచి 1,44,443 మిర్చి టిక్కీలు రాగా పాత నిల్వలతో కలిపి 1,41, 802 టిక్కీలు అమ్ముడుపోయాయి. యార్డులో ఇంకా 66,917 టిక్కీలు నిల్వ ఉన్నాయి. మేలు రకం తేజ, బాడిగ, ఆర్మూరు రకాల ధరలు మరింత తగ్గాయి. గత వారం కనీస ధర క్వింటాళ్ రూ.11 వేలు, గరిష్ట ధర రూ.14 నుంచి రూ.15 వేల వరకు పలికాయి. అయితే మంగళవారం తిరిగి ధరలు తగ్గాయి. తేజ రకం క్వింటాళ్ కనిష్టంగా రూ.10,200, గరిష్టంగా రూ.13,500 మాత్రమే పలకడం గమనా ర్హం. బాడిగ 355 రకం కనిష్ట ధర రూ.10 వేలు, గరిష్ట ధర రూ.13, 200 మాత్రమే వచ్చింది. రెండు తెలుగు రాష్ట్రాల్లో అత్యంత డిమాండ్ కలిగిన ఆర్మూర్ రకం మిర్చికి గరిష్ట ధర రూ.11 వేలు మాత్రమే వచ్చింది. సాధారణరకాల ధరలు కూడాభారీగా తగ్గాయి. 334 రకం కనిష్టంగా రూ.9,500, గరిష్టంగా రూ. 13 వేలు ధర లభించింది. మిగతా అన్ని రకాలు కూడా కనిష్టంగా రూ.10 వేలు, గరిష్టంగా రూ.13,300 వరకు లభించాయి. 4884 రకం గరిష్ట ధర రూ.11, 800 వచ్చింది. ధరలు తగ్గడంతో రైతులు నిరాశకు గురవుతున్నారు. గతేడాది క్వింటాళ్ రూ.20 వేలు పలికిన దేవనారు డీలక్స్ రకం ఈ ఏడాది రూ.13 వేలు మించడం లేదు. మంగళవారం కనిష్ట ధర రూ.10,300, గరిష్ట ధర రూ.12,600 మాత్రమే ధర వచ్చింది. గత రెండు నెలలుగా యార్డుకు నిత్యం లక్ష నుంచి లక్షన్నర వరకు టిక్కీలు వస్తుండగా వచ్చిన సరుకు వచ్చినట్లుగా కొనుగోలు చేస్తున్న వ్యాపారులు ఎగుమతి అవకాశాలు లేవని ధర తగ్గిస్తున్నారు. లేదంటే మిర్చికి నాణ్యత లేదనే సాకు చూపుతున్నారు. గత నెలలో రాష్ట్ర ప్రభుత్వం మిర్చి రైతుల పరిస్థితిని కేంద్రానికి విన్నవించగా కేంద్ర ప్రభుత్వం కనీస ధరను రూ.11,781 గా నిర్ణయించింది.

# అనిల్ యాదవ్ గాయబ్



నెల్లూరు, : నెల్లూరు జిల్లాకు చెందిన మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్ ఎక్కడా..? వైసీపీలో ఫైర్ బ్రాండ్‌గా ఉన్న నేత ఎప్పుడెందుకు సైలెంట్ అయ్యారు. పార్టీకి దూరంగా ఉంటున్నారా.. క్యాడర్‌కి కటీఫ్ చెప్పేశారా. నో పాలిటిక్స్.. ఓన్లీ బిజినెస్ అంటూ అనిల్ తిరుగుతున్నారనే గాపిప్స్ చక్కర్లు కొడుతున్నాయి. పార్టీలో నెంబర్-2 గా వ్యవహరించిన వారు సైతం పక్కకు తప్పుకున్నారు. ఇదే క్రమంలో మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్ ఎక్కడ అనే క్వశ్చన్ ఏపీ పొలిటికల్ సర్కిళ్లలో బిగ్ సౌండ్ చేస్తోంది.మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్ అంటే ఫైర్ బ్రాండ్. ఆయన అధికారంలో ఉన్నప్పుడు మైక్ పట్టుకుంటే అంతే సంగతీ.. ఆయన అగ్రెసివ్‌నెస్‌కి సపరేట్ ఫ్యాన్ ఫాలోయింగ్ ఉండేది. ఎవరైనా తమ పార్టీ అధినేత జగన్‌ను విమర్శిస్తే.. అనిల్‌కుమార్ యాదవ్ మైకాసురుడైపోయేవాడు. అనిల్ వరుస కౌంటర్లతో రాజకీయాన్ని హీటు పుట్టించేవారు. కానీ ఇప్పుడు అనిల్ అడ్రెస్ కూడా తెలియడం లేదనే గాసిప్స్ నెల్లూరు పాలిటిక్స్‌లోచక్కర్లు కొడుతున్నాయి.వైసీపీ అధినేత జగన్‌కు వీర విధేయుడుగా పేరు తెచ్చుకున్న అనిల్ కుమార్ యాదవ్.. అనూహ్యంగా పొలిటికల్ ఎంట్రీ ఇచ్చారు. కార్పొరేటర్‌గా ఉన్న తన బాబాయ్ చనిపోవడంతో ఆ స్థానానికి జరిగిన బైఎలెక్షన్‌లో పోటీ చేసి విజయం సాధించారు అనిల్. ఆ తర్వాత 2009లో ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయారు. 2014, 2019లలో వైసీపీ నుంచి నెల్లూరు సిటీ తరపున నెగ్గిన అనిల్ కుమార్ తన ఫైర్ బ్రాండ్ ఇమేజ్ తోనే పార్టీలో పలుకుబడి సాధించారు. ఆయన 2014 నుంచి 2019 మధ్య అసెంబ్లీ లోపలా బయటా వైసీపీ తరఫున గట్టిగానే వాయిస్ వినిపించారు. ఇక 2019లో ఆయనకు జగన్ మార్క్ సామాజిక సమీకరణలతో మంత్రి పదవి దక్కింది. అనిల్ కుమార్ యాదవ్ బీసీ యాదవ సామాజిక వర్గానికి చెందిన నేత కావడంతో కొందరు రెడ్డి సామాజికవర్గ ఎమ్మెల్యేలు దూరంగా ఉండేవారు. దీంతో రెడ్ల ఎమ్మెల్యేలు, అనిల్ మధ్య గ్యాప్ పెరిగింది. దీంతో జిల్లాకు చెందిన పలువురు నేతలు ఆయనకు దూరమయ్యారు. మూడేళ్ల తర్వాత అనిల్ కుమార్ స్థానంలో కాకాని గోవర్ధన్ రెడ్డికి మంత్రి పదవి దక్కింది. అప్పటి నుంచి జిల్లాలో పార్టీ నేతలు.. అనిల్‌కు మధ్య అంతరం మరింత తీవ్రమైందిఈ సమయంలో జిల్లాలో తెల్లరాయి తవ్వకాలు.. అమ్మకాలకు సంబంధించి అనిల్‌కు బాధ్యతలు అప్పగించడంపై వైసీపీ నేతలు? పార్టీ అధిష్టానం దగ్గర తీవ్ర స్థాయిలో అసంతృప్తి వ్యక్తం చేశారట. గత ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో అనిల్ కుమార్ యాదవ్‌ను నెల్లూరు సిటీ నుంచి తప్పించి నరసరావుపేటకు షిఫ్ట్ చేశారు. దీంతో అనిల్‌ను జిల్లా నుంచి పంపించేశామని?అప్పట్లో కొందరు వైసీపీ నేతలు పరోక్షంగా వ్యాఖ్యలు చేశారు. అప్పుడు అయిష్టంగానే అనిల్ ఎంపీగా పోటీ చేసినట్లు ప్రచారం ఉంది. అందుకే ఓడిపోవడంతో పొలిటికల్ గా సైలెంట్ అయినట్లు నెల్లూరులో గుసగుసలు వినిపిస్తుంటాయి.అనిల్ కుమార్ యాదవ్ నరసరావుపేటకు షిఫ్ట్ అయినా.. నెల్లూరు సిటీ అసెంబ్లీ నియోజకవర్గ సీటును మాత్రం తన అనుచరుడైన ఖలీల్ అహ్మద్ ఇప్పించుకున్నారు. ఈ నిర్ణయంపై అప్పటి వైసీపీ నేత? వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వైసీపీని వీడి టీడీపీలో చేరారు. ఆ తర్వాత అనిల్ ఓడిపోవడం, వైసీపీ ప్రభుత్వం గద్దె దిగిపోవ డంతో ఆయన సైలెంట్ మోడ్‌లోకి వెళ్లిపోయారు. ఆయన ప్లేస్‌లో నెల్లూరు సిటీ ఇన్‌చార్జిగా ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డిని నియమించింది పార్టీ హైకమాండ్. అనిల్ కుమార్ యాదవ్ టచ్‌లోకి రాకపోవడంతో ఆయన వర్గీయులంతా ఇప్పుడు చంద్రశేఖర్ రెడ్డితోనే ఉంటున్నారు. ప్రస్తుతం అనిల్‌కుమార్ యాదవ్ తన బిజినెస్‌లను చూసుకుంటున్నారట. అప్పుడప్పుడు నెల్లూరు సిటీకి వస్తున్న అనిల్.. అత్యంత సన్నిహితులనే కలుస్తున్నారట. తన రాజకీయ విరామమం టెంపరరీ మాత్రమేనని సన్నిహితులకు చెప్పి వెళ్తున్నారట అనిల్. అప్పుడు చంద్రశేఖర్ రెడ్డి చేపట్టే కార్యక్రమాల్లోనే మెరుస్తున్నారు. మొత్తానికి రాజకీయాలకు దూరంగా ఉంటున్న అనిల్ భవిష్యత్‌లో ఎలాంటి వ్యూహంతో ముందుకెళ్తారనేది ఇప్పుడు ఆసక్తిగా మారింది

# ప్రభుత్వ బడులలోనే విద్యార్థులను చేర్పించండి



జయశంకర్ భూపాలపల్లి:

జయశంకర్ భూపాలపల్లి జిలాలోని కాటారం మండలంలో జిల్లా విద్యాశాఖ అధికారి ముద్దమల్ల రాజేందర్ చేపట్టిన బడిబాట కార్యక్రమాన్ని ఈరోజు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించడం జరిగింది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు లక్ష్యంగా జయశంకర్ భూపాలపల్లి విద్యాశాఖ అధికారి ముద్దమల్ల రాజేందర్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బడిబాట కార్యక్రమం ఈరోజు కాటారం మండలంలోని కాటారం గ్రామంలో గౌరవ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంబించి, ర్యాలీని చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కొరకు అమ్మ ఆదర్శ పాఠశాలలనే పథకం ప్రవేశపెట్టి పాఠశాలల్లో మౌలిక వసతుల సదుపాయాలను కల్పనకు కోట్ల రూపాయలను వెచ్చించి ప్రభుత్వ పాఠశాలకు మౌలిక సదుపాయాల ఏర్పాటు చేయడం జరిగిందని, ఇంకను అనేక పథకాలను ప్రవేశపెట్టి ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలను కల్పించేందుకు కృషి చేస్తానని తెలుపుతూ విద్యార్థిని విద్యార్థులు, తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పించేందుకు ముందుకు రావాలని ఉపాధ్యాయులంతా కలిసి ఉద్యమంలా కార్యక్రమాన్ని ప్రతి గ్రామంలో నిర్వహించి ప్రభుత్వ పాఠశాలల పట్ల తల్లిదండ్రుల లోపల ప్రజల లోపల విశ్వాసాన్ని నమ్మకాన్ని కల్పించేందుకు కృషిచేయాలని కోరారు రాష్ట్రంలో వినూత్నం గా జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో జిల్లా విద్యాశాఖ అధికారి ముద్దమల్ల రాజేందర్ చేపట్టిన ఈ బడిబాట కార్యక్రమం చాలా అభినం దనీయమని జిల్లాలోని ప్రతి ఉపాధ్యాయుడు ఈ బడిబాట కార్యక్రమా న్ని సద్వినియోగం చేసుకొని, ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను గణనీయంగా పెంచుకునే బాధ్యత తీసుకోవాలని కోరారు.. అనంతరం జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీ ముద్దమల్ల రాజేందర్ గారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల అంటే తల్లిదండ్రుల్లో నమ్మకాన్ని, విశ్వాసాన్ని కలిగించడం కొరకు ముందస్తుగా ఈ బడిబాట కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని,అన్ని పాఠశాల హెడ్మాస్టర్ లతో నిన్ననే సమావేశాన్ని ఏర్పాటు చేసి అన్ని గ్రామాలలో బడిబాట కార్యక్రమాన్ని ఈరోజు ప్రారంభించాల్సి ందిగా సమాచారాన్ని అందించి, ఈరోజు ఎంతో ప్రతిష్టాత్మకంగా జిల్లాలోని అన్ని గ్రామాలలో అన్ని పాఠశాలల్లో ఈ యొక్క బడిబాట కార్యక్రమాన్ని ఈరోజు ప్రారంభించా మని, ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ మన జిల్లాకు రావడం, బడిబాట కార్యక్రమాన్ని వారి చేతుల యువకులు, శ్రేయోభిలాషులు అందరూ ఒక ఉద్యమంలా ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థుల నమోదును పెంచేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు..

ఈ కార్యక్రమంలో జిల్లా విద్య శాఖ కార్యాలయ అధికారులు అకాడమిక్ మానిట రింగ్ అధికారి కాయిత లక్ష్మణ్ ,సెక్టోరియల్ అధికారులు దుప్పటి రాజగోపాల్,సి ఎం ఓ సామల రమేష్, జిసిడిఓ శైలజ, ప్రాథమిక ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుని ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులు తల్లిదండ్రులు అమ్మ ఆదర్శ పాఠశాలల చైర్పర్సన్ లు పాల్గొని బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేశారు..

# జగన్‌ను చుట్టేస్తున్న కేసులు

విజయవాడ: వైసీపీ అధినేత వైఎస్ జగన్ కు గతంలో జరిగిన హత్య కేసులు మెడకు చుట్టుకునేలా ఉన్నాయి. ఒకవైపు పరిటాల సునీత తన భర్త పరిటాల రవి హత్యకు కారణం జగన్ అని ఆరోపించడం సంచలనం కలిగించింది. రెండు దశాబ్దాల క్రితం జరిగిన హత్య కేసులో జగన్ ప్రమేయం ఉందని ఆమె చెబుతూ హంతకులకు జగన్ ప్రోద్బలం ఉందని పరిటాల సునీత తెలిపారు. జగన్ సహకారంతోనే తన భర్త పరిటాల రవి హత్య జరిగిందన్న ఆరోపణలతో ఫ్యాన్ పార్టీ కొంత ఉక్కపోతకు గురయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. పరిటాల రవి 2005లో హత్యకు గురయితే దాదాపు రెండు దశాబ్దాల తర్వాత అంటే 2025 లో పరిటాల సునీత జగన్ ప్రమేయం ఉందని ఆరోపించడం ఏంటని వైసీపీ నేతలు ప్రశ్నిస్తున్నారు.. పరిటాల రవి హత్య జరిగిన సమయంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఆయన ఈ హత్యపై నాడు సీబీఐ విచారణకు కూడా ఆదేశిరడానికి సిద్ధమయ్యారని వైసీపీ నేతలు వాదిస్తున్నారు. హత్యపై తర్వాత అనేక ప్రభుత్వాలు మారాయని, వారు విచారణ జరిపినా అసలు నిజం వెలుగు చూసి ఉండేదని చెబుతున్నారు. కానీ రెండు దశాబ్దాల తర్వాత ఇలాంటి ఆరోపణలు చేయడం కేవలం రాజకీయ ప్రేరేపితమైనవని కొట్టిపారేస్తున్నారు. అయితే సునీత చేసిన వ్యాఖ్యలు కొంత జగన్ తోపాటు పార్టీని కూడా ఇబ్బందిపెట్టేవే. ఇప్పటికీ పరిటాలకు వీరాభిమానులున్నారు. ముఖ్యంగా రాయలసీమలో రవి ప్రభావం అనేక నియోజకవర్గాల్లో ప్రభావం చూపే అవకాశముంది.మరోవైపు వైఎస్ వివేకానందరెడ్డి హత్య పై కూడా స్వయంగా సోదరి వైఎస్ షర్మిల ధ్వజమెత్తారు. జగన్ పేరు ప్రస్తావించకపోయినప్పటికీ అవినాష్ రెడ్డిని



దోషిగా చూపుతూ ఆమె ఇచ్చిన ప్రకటనలు పార్టీకి ఇబ్బంది కలిగించేలా కనిపిస్తున్నాయి. వైఎస్ వివేకా మర్డర్ జరిగి కూడా ఆరేళ్లుదాటిపోయింది. సీబీఐ విచారణ కూడా చేపట్టింది. అయినా ఇంత వరకూ హత్యకు జరిగిన కారణాలను ఎవరూ గుర్తించలేకపోయారు. ఈ కేసులో కొందరు నిందితులు అరెస్టయినప్పటికీ, అన్నీవేళ్లూ జగన్ నివాసం వైపు చూపుతున్నాయి. అవినాష్ రెడ్డిని జగన్ రక్షించడం వల్లనే కేసుల నుంచి తప్పించుకోగలిగారని వైఎస్ షర్మిల పరోక్షంగా విమర్శలను ఎక్కుపెట్టడం చర్చనీయాంశమైంది.అవినాష్ రెడ్డి కారణంగా సునీతకు ఆమె పిల్లల ప్రాణాలకు రక్షణ లేకుండా పోయిందని తెలిపారు. సాక్షులు ఒక్కొక్కరుగా చనిపోవడంతో పాటు దర్యాప్తు అధికారులను కూడా బెదిరించడం అవినాష్ రెడ్డి కే చెల్లుతుందని, అయినా అవినాష్ రెడ్డి బెయిల్ పై బయట తిరుగుతున్నారని వైఎస్ షర్మిల అంటున్నారు.

# రైజింగ్ స్టేట్ గా ఆంధ్ర

విజయవాడ: ఆంధ్రప్రదేశ్‌రాష్ట్రం 2024-25 ఆర్థిక సంవత్సరంలో స్థిర ధరల ప్రకారం దేశంలోనే అత్యుత్తమ ఆర్థిక వృద్ధిని కనబరిచింది. రాష్ట్రం సాధించిన 8.21శాతం వృద్ధి రేటు దేశంలోని ప్రధాన రాష్ట్రాల లో రెండవ అత్యధికం.ఈ విషయాన్ని కేంద్ర గణాంకాలు, కార్యక్ర మాల అమలు శాఖ తాజాగా విడుదల చేసిన తన నివేదికలో స్పష్టం చేసింది. ఈ జాబితాలో మన పొరుగు రాష్ట్రమైన తమిళనాడు 9.69 శాతం వృద్ధి రేటుతో మొదటి స్థానంలో కొనసాగుతోంది. అయితేఆంధ్రప్రదేశ్ సాధించిన ఈ గణనీయమైన వృద్ధి దేశ ఆర్థిక వ్యవస్థకు ఒక సానుకూల సంకేతంగా నిలుస్తోంది. ఏడాది కాలంలో ఆంధ్రప్రదేశ్ తన ఆర్థిక వృద్ధి పథంలో స్పష్టమైన మెరుగుదలను కనబరిచింది. అంతకు ముందు ఆర్థిక సంవత్సరంలో (2023-24) నమోదైన 6.19 శాతం వృద్ధి రేటుతో పోలిస్తే,ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 2.02 శాతం అధికంగా, అంటే 8.21 శాతం వృద్ధిని నమోదు చేయడం విశేషం. ఇది రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ వేగంగా పుంజుకుంటున్నదనడానికి నిదర్శనం. ఇక ప్రస్తుత ధరల విభాగంలో రాష్ట్ర వృద్ధి రేటు మరింత ఎక్కువగా,12.02 శాతంగా నమోదైంది. ఇది ద్రవ్యోల్బణం, ఇతర ఆర్థిక అంశాల ప్రభావాన్ని సూచిస్తుంది.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఆర్థిక వృద్ధి రేటులో దేశంలోనే రెండో స్థానానికి చేరుకోవడం పట్ల ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు తన సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన తన అధికారిక 'ఎక్స్' (గతంలో ట్విట్టర్) ఖాతా ద్వారా ఒక ప్రకటన విడుదల చేశారు. "ఆంధ్రప్రదేశ్ ఈజ్ రైజింగ్" అంటూ ఆయన తన ఆనందాన్ని ప్రజలతో పంచుకున్నారు. గతంలో రాష్ట్రం ఎదుర్కొన్న ఆర్థిక సవాళ్ల నుండి కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్మాణాత్మక చర్యల ఫలితంగానే ఈ స్థాయి వృద్ధి



సాధ్యమైం దని ఆయన గట్టిగా విశ్వాసం వ్యక్తం చేశారుఈ అద్భుతమైన విజయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రజలందరి సమష్టి కృషి, విజయంగా అభివర్ణించారు. రాష్ట్ర ప్రజలకు తన హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ, రాబోయే రోజుల్లో బంగారు భవిష్యత్తును నిర్మించుకోవడం కోసం అందరూ కలిసి ఐక్యంగా ప్రయాణం కొనసాగిద్దామని ఆయన ఉద్బోధించారు. రాష్ట్ర ప్రభుత్వం సమర్థవంతమైన పాలనా విధానాలు ప్రజల నిరంతర సహకారం ఈ అసాధారణ ఫలితాన్ని అందించాయని ఆయన కొనియాడారు. భవిష్యత్తులో కూడా ఇదే స్ఫూర్తితో మరింత అభివృద్ధిని సాధించి, రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలుపుతామని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.కేంద్ర గణాంకాల శాఖ విడుదల చేసిన ఈ తాజా నివేదిక ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ సరైన మార్గంలో పయనిస్తోందని స్పష్టంగా తెలియజేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వినూత్న అభివృద్ధి, సమర్థవంతమైన సంక్షేమ పథకాలు రాష్ట్ర ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపర చడంలో కీలకమైన పాత్ర పోషిస్తున్నాయని ఈ వృద్ధి గణాంకాలు నిరూపిస్తున్నాయి.

# జయరాజు గానం.. ప్రకృతి పరిమళం




ప్రతి పదంలో ప్రకృతిని అల్లుకుని సాగే వాణి ప్రజావాణి. ఆయన తత్వం జనతత్వం. తన కలం.. గానంతో ప్రజా సమూహాన్ని ఊపేయ డమే కాదు. ఆలోచనలకు పదును పెడతారు. సకల ప్రాణులకు జన్మనిచ్చి , అన్నం పెడుతున్న భూతల్లిపై జరుగుతున్న పెట్టుబడిదారీ దాడులను తన కలంతోనూ, గళంతోనూ ప్రశ్నిస్తారు. క్యాన్సర్ కారణంగా అనారోగ్యంతో ఉన్నా, వైద్యులు తనని వద్దని వారించినా పాటలతో తన పోరాట పంథా కొనసాగిస్తున్న ప్రజాకవిరాజు జయ రాజు. ఆయన మాటలు, పాటలు జలధారలు. ఇటీవల విజయవాడ ఎంబి విజ్ఞానకేంద్రంలో ఆయన ప్రకృతికావ్యాన్ని పాడి వినిపించారు.మహబూబ్‌నగర్ పట్టణంలోని గుమ్మడూరు ప్రాంతానికి చెందిన గొడిశాల చెన్నమ్మ, కృష్ణమూర్తి దంపతుల కుమారుడు జయరాజ్. బయ్యారం మండలం గంధంపల్లి హైస్కూలులో పదోతరగతి వరకూ చదివారు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని సింగరేణి కార్యాలయంలో పనిచేస్తున్నారు. పేద కుటుంబం కావటంతో ఆయా తరగతుల ప్రజలు ఎదుర్కొనే కష్టాలు తెలుసు. ఆయా వెతలనే కవితలుగా చిన్నప్పటి నుంచే మార్చి కవిగా గుర్తింపు పొందారు. నిరుపేద దళిత కుటుంబంలో పుట్టిన ఆయన సమ సమాజం రావాలనీ, వివక్ష రూపాలు అంతం కావాలని నిరంతరం కృషి చేస్తున్నారు. సాంస్కృతిక ఉద్యమం ద్వారా భావజాలాన్ని వ్యాప్తి చేయటానికి నిరంతరం ముందుండేవారు. సింగరేణి ఉద్యమంలోనూ, అభ్యుదయ, సామాజిక ఉద్యమాల్లోనూ తనదైన శైలిలో సాహితీ సృజన చేశారు. ప్రకృతి గొప్పతనాన్ని వర్ణిస్తూ, పర్యావరణ పరిరక్షణ కోసం అనేక పాటలు రాశారు. వాటిని ఆయన స్వీయ కవితాగానం చేస్తుంటారు. సింగరేణి కార్మికుల సమస్యలపై పోరాడిన క్రమంలో లాఠీ దెబ్బలు సైతం తిన్నారు. చాలాసార్లు జైలుకు సైతం వెళ్లారు. ఆ క్రమంలో నెలరోజులు జరిగిన సమ్మె సమయంలో అనేక ప్రలోభాలు వచ్చినా నికరంగా నిలబడ్డారు. ఏకంగా ఇద్దరు సిఎంలు జోక్యం చేసుకున్నా కార్మికుల పక్షాన తన పంథా వీడలేదు.వానమ్మ వానమ్మా..

వానమ్మ..: 'వానమ్మ వానమ్మ..వానమ్మ.. ఒక్కసారైనా వచ్చిపోవే.. వానమ్మ' అంటూ ప్రత్యేక తెలంగాణా ఉద్యమంలో రైతు, రైతుకూలీల కష్టాలను ఎలుగెత్తి చాటిన జనం పాట ఇది. నీళ్లు లేక నోళ్లు తెరచి బీడు బారిన తెలంగాణా భూములను.. నేల తల్లినే నమ్ముకున్న రైతును, రైతుపైన ఆధారపడిన రైతు కూలీలను.. ఎండిపోతున్న చెరువులు, డొక్క చిక్కి పోతున్న పశువుల ఆక్రందనలను సైతం తన పాటలో వినిపించిన వాగ్గేయకారుడు. 'నీళ్లు.. నిధులు.. నియామకాలు కావాలంటూ' అనేక వందల సమావేశాల్లో తన వాణిని పల్లెల్లో బాగా వినిపించారు. జనాన్ని కదిలించారు. రోజురోజుకూ తనను కబళిస్తున్న క్యాన్సర్ వ్యాధిపై పోరాటం చేస్తూనే తన చైతన్య కార్యక్రమాలను కొనసాగించారు. ఆనాటి జనం వెతలను అప్పటి పాలకులు వినిపించడానికి దిక్కులు పిక్కటిల్లేలా సాగిన జయరాజు పాట ఎందరినో కదిలించింది..దొరతనంపై

తిరుగుబావుటా: మానుకోట గడీల్లో బాంచెన్ దొరా అంటూ సాగుతున్న వెట్టిచాకిరీని వ్యతిరేకిస్తూ, అణచివేతను, దొరల దౌర్జన్యాన్ని జయరాజు ప్రశ్నించారు. "మిణుగురు మెరిసినా నేరమేనా తెలంగాణ పల్లెల్లో.. మీసం మొలచినా నేరమేనా' అంటూ పాటలు కట్టి పాడారు. దొరతనంతో జనం అల్లాడిపోవడం చిన్ననాడే జయరాజును కదిలించింది. కరువు తాకిడికి తండ్రి బతుకు దెరువు వెతుక్కుంటూ నాగార్జునసాగర్ పనుల కోసం కల్మల చెరువు చేరారు. అక్కడే బాల్యం, ప్రాథమిక విద్య పూర్తిచేశారు జయరాజు. కొత్తగూ డెంలో ఐటిఐ ఫిట్టర్ చదివి సింగరేణిలో ఉ ద్యోగం పొందినా తాను మాత్రం పాటకు దూరం కాలేదు. అప్పట్లో దొరలు తమ మాట వినని వారిని పోలీసు స్టేషన్‌కు పిలిపించి.. కొందరిని తుపాకీతోనే కాల్చేయించేవారు. ఈ దురాగతాలను కళ్లారా చూసిన జయరాజు ఏమాత్రం వెనక్కి తగ్గలేదు. కళాశాల రోజుల్లోనే ఉద్యమంలో పాల్గొంటు న్నందుకు యాజమాన్యం డిబార్ చేయించింది. అనంతరం మణుగూరు నుంచి అదిలాబాద్ దాకా బొగ్గుగనుల్లో కార్మిక శక్తిని ఏకం చేయటానికి జయరాజు కృషిచేశారు.

కొండల్లో కోయిల పాటలు పాడాలి: వర్షాన్నే కరిగించిన అక్షరాలు అతడివి. 'వందనాలమ్మా..అమ్మా వందనాలమ్మా' అంటూ తల్లి ప్రేమను ప్రజలకు అందించి అందరి ప్రజల మనసులో చెరగని ముద్ర వేసిన రచనా శైలి ఆయనది. ప్రకృతి లేకుండా ఆయన కవిత్వం ఉండదు. కవిత్వం, రచనా వ్యాసాగంలో ఏదో ఒక రూపంలో ప్రకృతి పచ్చదనం ఇమిడిపోయి రెపరెపలాడుతుంది. ప్రపంచీకరణ ప్రమాదంపైనా: ప్రపంచీకరణ ఫలితంగా ప్రపంచమే ఒక మారుమూల గ్రామంగా మారిపోయింది. వ్యాపారపంటలొచ్చి రసాయన ఎరువుల వాడకం ఎక్కువైంది. కరువులు ఏర్పడి వాగులు, చెరువులన్నీ ఎండిపోతున్నారు. పల్లెలన్నీ ఎడారులైనాయి అంటూ 'పచ్చని చిలుకల కంకు లేయాల్సిన జొన్నచేలు మసిబారి కాటుక కంకులేసి వెలుతుర్ని కోల్పోతాయి' అంటూ రైతుల వ్యథలను చక్కగా ఆలపించారు. ప్రపంచవ్యాప్తంగా ప్రజాస్వా మ్యం పరిహాసానికి గురవుతుం డటం, నియంతృత్వం విరగబడి నవ్వుతుండటం, కులం, మతం, ప్రాంతం, తెగ పేరుతో జనం మధ్య అగ్ని పెట్టేస్తున్నా యంటూ హృద్యంగా ఆలపించారు. శ్రీశ్రీ, సుద్దాల అశోక్‌తేజ వంటి రచయితలు రచించిన అభ్యుదయ, దేశభక్తి, విప్లవ గీతాలను ఎంబివికెలో గానం చేసి, ప్రేక్షకులను అలరించారు..జయరాజ్ ప్రకృతిపైన 122 కథలు, గేయాలతో రాసిన 'అవని' పుస్తకం హిందీ, ఇంగ్లీష్, కన్నడ సహా అనేక భాషల్లోకి అనువాదమై విస్తృత ప్రాచుర్యం పొందింది. ఆయన రాసిన పాటలు, కవితలు నిరంతరం ప్రజల నోళ్లలో నానుతూనే ఉన్నాయి.

**కదిలే పాటల ప్రవాహం:**

మానవ పరిణా మక్రమం,శ్రమ పాత్ర, వివిధచెట్ల, పక్షుల, జంతువుల పరిణామక్రమం, సంగీత సాహి త్యాలు, జానపదాల వికాసం.. మొత్తం క్రమాన్నిఆయన గొప్ప పాటగా రాసి, ప్రాచుర్యం పొందారు. సాహిత్య, సాంస్కృ తిక రంగాల్లో విశేష కృషిచేసి నందు కుగాను ఆయనకు అనేక అవార్డులు, పురస్కారాలు వరించాయి. మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రం (ఎంబివికె) లోని చుక్కపల్లి పిచ్చయ్య ఆడిటో రియంలో జాషువా సాంస్కృతిక వేదిక, పాపులర్ షూమార్ట్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ప్రత్యేక కార్యక్రమంలో 'ప్రకృతికావ్యం'పై డాక్టర్ జయరాజు స్వీయకవితాగానం చేశారు. ఫోరంఫర్ ఆర్టిస్ట్స్ తరపున అరసవిల్లి గిరిధర్ పెయిం టింగ్‌ను బహూకరించారు. కవి, రచయిత అనిల్ డ్యానీ సమన్వయం చేశారు. జాషువా సాంస్కృతిక వేదిక కార్యదర్శి గుండు నారాయణరావు సభనుప్రారం భిం చారు.ఎంబివికె కార్యదర్శి పిన్న మనేని మురళీకృష్ణ సందేశం ఇచ్చారు.

# రోజూ పచ్చి కొబ్బరిని తినడం అలవాటు చేసుకోండి..



**పూజలు లేదా ఇతర శుభ కార్యాలు జరిగినప్పుడు హిందువులు కొబ్బరికాయలను కొడుతుంటారు. ఆ తరువాత వాటిని నైవేద్యంగా పెట్టి తమ కోరికలను నెరవేర్చమని కోరుకుంటారు. అలాగే చాలా మంది ఇలాంటి కార్యక్రమాలకు కొబ్బరికాయలను ఉపయోగించక పోయినా తరచూ వంటల్లో మాత్రం కొబ్బరిని వేస్తుంటారు. కొందరు పచ్చి కొబ్బరిని వంటల్లో వేస్తే కొందరు ఎండు కొబ్బరిని వేస్తారు. కొబ్బరి వేస్తే వంటలకు మంచి రుచి, వాసన వస్తాయి. అయితే ఆరోగ్యపరంగా కొబ్బరి మనకు ఎన్నో ప్రయోజనాలను అందిస్తుంది. ఇందులో మన శరీరానికి కావల్సిన అనేక పోషకాలు ఉంటాయి. కొబ్బరిని రోజూ ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల అనేక లాభాలను పొందవచ్చు.**

**జీర్ణ సమస్యలకు..:** జీర్ణ సమస్యలతో బాధపడేవారికి కొబ్బరి ఔషధంగా పనిచేస్తుంది. రోజూ ఒక చిన్న పచ్చి కొబ్బరి ముక్కను కాస్త బెల్లంతో కలిపి రాత్రి పూట భోజనం చేసిన అనంతరం తింటుండాలి. దీంతో జీర్ణ వ్యవసఆరోగ్యంగా ఉంటుంది. జీర్ణాశయం, పేగుల్లో ఉండే వ్యర్థాలు బయటకు పోతాయి. మలబద్దకం తగ్గుతుంది. తిన్న ఆహారం సరిగ్గా జీర్ణమవుతుంది. అజీర్తి తగ్గుతుంది. గ్యాస్ సమస్య నుంచి బయట పడవచ్చు. కొబ్బరిలో ఉండే ఫైబర్ జీర్ణ వ్యవస్థకు ఎంతో మేలు చేస్తుంది. రోజూ కొబ్బరిని తినలేకపోతే రాత్రి పూట నిద్రకు ముందు ఒక టీస్పూన్ కొబ్బరి నూనెను సేవించవచ్చు. ఇది కూడా జీర్ణవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది.


**వేడి తగ్గేందుకు..:** విరేచనాలు అయినప్పుడు కొబ్బరిని తింటే ఆ సమస్య నుంచి బయట పడవచ్చు. జీర్ణాశయంలో మంచి బ్యాక్టీరియా పెరుగుతుంది. ఇదిజీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. కొబ్బరిలో పొటాషియం అధికంగా ఉంటుంది. ముఖ్యంగా పచ్చి కొబ్బరిలో ఇది కాస్త ఎక్కువగానే ఉంటుంది.

ఇది రక్త సరఫరాను మెరుగు పరుస్తుంది. రక్త ప్రసరణ సరిగ్గా అయ్యేలా చూస్తుంది. దీంతో రక్త నాళాల్లో ఉండే అడ్డంకులు తొలగిపోతాయి. గుండె ఆరోగ్యంగా ఉంటుంది. హార్ట్ ఎటాక్ రాకుండా నివారించవచ్చు. పచ్చి కొబ్బరిని వేసవిలో తింటే శరీరం చల్లగా ఉంటుంది. శరీరంలోని వేడి పోతుంది. కొబ్బరి మన శరీరానికి చలువ చేస్తుంది. కాబట్టి పచ్చి కొబ్బరిని వేసవిలో తినాలి. దీంతో డీహైడ్రేషన్ బారిన పడకుండా ఉంటారు. ఎండ దెబ్బ నుంచి సురక్షితంగా ఉండవచ్చు.

**మూత్రాశయ సమస్యలకు..:** వేసవిలో చెమట కాయలు అధికంగా అవుతుంటాయి. అలాగే కొందరికి విపరీతంగా చెమట వచ్చి శరీరం దుర్వాసనగా ఉంటుంది. అలాంటి వారు కొబ్బరిని తింటుంటే ఫలితం ఉంటుంది. లేదా కొబ్బరి నీళ్లను కాస్త నీటిలో వేసి కలిపి ఆ నీటితో స్నానం చేస్తున్నా సమస్యలు తగ్గుతాయి. పొట్టలో నులి పురుగుల సమస్య ఉన్నవారు రోజూ కొబ్బరిని తింటుంటే ఫలితం ఉంటుంది. జీర్ణాశయం శుభ్రంగా ఉంటుంది. మూత్రాశయ సమస్యలు ఉన్నవారు రోజూ కొబ్బరిని తింటున్నా లేదా కొబ్బరి నీళ్లను తాగుతున్నా ఆ సమస్య నుంచి బయట పడవచ్చు.

కొబ్బరిలో ఉండే యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ పంగల్, యాంటీ వైరల్ గుణాలు మూత్రాశయ ఇన్‌ఫెక్షన్లకు కారణం అయ్యే క్రిములను నిర్మూలిస్తాయి. దీంతో ఇన్‌ఫెక్షన్ తగ్గుతుంది. అలాగే కిడ్నీల్లో ఉండే వ్యర్థాలు బయటకు పోతాయి. కిడ్నీ స్టోన్స్ కరిగిపోతాయి. ఇలా కొ బ్బరిని రోజూ తింటే అనేక లాభాలను పొందవచ్చు.

# రోజూ ఉదయం మొలకెత్తిన పెసలను తినాలి



రోజూ ఉదయం మనం అనేక రకాల బ్రేక్‌ఫాస్ట్‌లను తింటుంటాం. ఇడ్లీ, దోశ, పూరీ ఇలా వెరైటీ టిఫిన్లను తింటాం. అయితే బ్రేక్‌ఫాస్ట్‌తో పాటు పలు ఆరోగ్యవంతమైన ఆహారాలను తినాల్సి ఉంటుంది. దీంతో మనం అధికంగా ప్రయోజనాలను పొందవచ్చు.

రోజూ ఉదయం బ్రేక్‌ఫాస్ట్‌లో ఆరోగ్యవంతమైన ఆహారాలను తింటే పోషణ లభించడమే కాదు, శరీరానికి శక్తి అందుతుంది. దీంతో రోజ ంతా ఉత్సాహంగా,యాక్టివ్‌గా ఉంటారు. అలాగే రోగాల నుంచి రక్షణ లభిస్తుంది. ఇక ఉదయం బ్రేక్‌ఫాస్ట్‌తో కలిపి తినాల్సిన ఆరోగ్యవంతమైన ఆహారాల్లో మొలకెత్తిన పెసలు కూడా ఒకటి. వీటినే మొలకలు అని కూడా అంటారు. వీటిని ఉదయం తింటే ఎంతో మేలు జరుగుతుందని పోషకాహార నిపుణులు చెబుతున్నారు.

**పోషకాలు..:** రోజూ ఉదయం మొలకెత్తిన పెసలను తినడం వల్ల అ నేక పోషకాలు లభిస్తాయి. ఈ పెసలను తింటే వృక్ష సంబంధమైన ప్రోటీన్లు సమృద్ధిగా లభిస్తాయి. ఇవి కండరాల నిర్మాణానికి, మరమ్మత్తు లకు ఎంతగానో దోహదపడతాయి. ఉదయం మొలకలను తినడం వల్ల రోజంతా ఉత్సాహంగా, యాక్టివ్‌గా ఉండవచ్చు. ఉత్తేజంగా పని చేస్తారు. బద్దకం లేకుండా ఉంటుంది. ఎంత పనిచేసినా అలసిపోరు. పెసలను తినడం వల్ల పలు ఎంజైమ్‌లు మన శరీరంలో ఉత్పత్తి అవు తాయి. ఇవి జీర్ణక్రియను మెరుగు పరుస్తాయి. దీంతో మన శరీరం పోషకాలను సరిగ్గా శోషించుకుంటుంది.

దీని వల్ల మలబద్దకం తగ్గుతుంది. రోజూ సుఖ విరేచనం కలుగుతుంది. పెసలను తింటే అజీర్తి, గ్యాస్, కడుపు ఉబ్బరం నుంచి కూడా బయట పడవచ్చు. జీర్ణ వ్యవస్థ శుభ్రంగా మారుతుంది.

**విటమిన్ సి..:** పెసలలో విటమిన్ సి ఎక్కువగా ఉంటుంది. ఇది రోగ నిరోధక వ్యవస్థను పటిష్టంగా మారుస్తుంది. ఇన్‌ఫెక్షన్లకు వ్యతిరేక ంగా పోరాడుతుంది. దీంతో అన్ని విధాలుగా ఆరోగ్యంగా ఉండవచ్చు. రోగాలు రాకుండా ఉంటాయి. పెసలలో యాంటీ ఆక్సిడెం ట్లు సమృద్ధిగా ఉంటాయి. ఇవి ఫ్రీ ర్యాడికల్స్‌ను నాశనం చేస్తాయి. దీంతో చర్మంపై ఉండే ముడతలు, మచ్చలు పోతాయి. ముఖం కాంతివంతంగా మారుతుంది. యవ్వనంగా కనిపిస్తారు.

పెసలలో క్యాలరీలు తక్కువగా ఉంటాయి. అందువల్ల బరువు నియం త్రణలో ఉండాలనుకునే వారు పెసలను ఆహారంలో భాగం చేసుకోవాలి. పెసలను రోజూ తినడం వల్ల బరువు తగ్గుతారు. అలాగే శరీరానికి కావల్సిన పోషకాలు లభిస్తాయి.

**కొలెస్ట్రాల్ స్థాయిలు..:** పెసలలో ఫైబర్ సమృద్ధిగా ఉంటుంది. ఇది గుండెను ఆరోగ్యంగా ఉంచుతుంది. పెసలలో ఉండే పొటాషియం కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గిస్తుంది. దీంతో రక్త సరఫరా నియంత్రణలోకి వస్తుంది. తగ్గుతుంది. హృదయ సంబంధ వ్యవస్థ ఆరోగ్యంగా ఉ ంటుంది. మొలకెత్తిన పెసల గ్లైసీమిక్ ఇండెక్స్ చాలా తక్కువగా ఉ ంటుంది. కనుక షుగర్ ఉన్నవారికి ఇవి బెస్ట్ ఆప్షన్ అని చెప్పవచ్చు. వీటిని తింటే షుగర్ లెవల్స్ తగ్గుతాయి. దయాబెటిస్

అదుపులో ఉంటుందిమధుమేహం ఉన్నవారు రోజూ మొలకలను తింటుంటే షుగర్ లెవల్స్‌ను కంట్రోల్ చేయవచ్చు.మొలకలను తినడం వల్ల శరీరంలోని వ్యర్థాలు బయటకు పోతాయి. శరీరం అంతర్గతంగా శుభ్రంగా మా రుతుంది.దీంతో రోగాలు రాకుండా ఉంటాయి. ఇలా పెసలను మొ లకెత్తించి తింటే అనేక లాభాలను పొందవచ్చు.

# పెరుగులో మేలు చేసే గుణాలు



తరుచుగా ఛాతిలో, కడుపులో మంటపుడుతూ ఉంటుంది. అలాంటప్పుడు చాలామంది కూల్‌డ్రింక్స్ లేదా కూలింగ్ వాటర్ తాగుతారు. వీటికన్నా పెరుగుతో చేసిన లస్సీగానీ, పెరుగు గానీ తింటే సమస్య తగ్గుతుంది. పెరుగులో శరీరానికి మేలు చేసే గుణాలు చాలా ఉన్నాయని ఆహార నిపుణులు చెబు తున్నారు. ఆహారం తీసుకున్నా కడుపులో మంటగా ఉన్నప్పుడు రోజూ పరగడుపున ఒక కప్పు పెరుగు తింటే చాలా మంచిది. ప్రతిరోజూ పెరుగు తీసుకునే మహిళల్లో వెజైనల్ ఈస్ట్ ఇన్ఫెక్షన్లు వచ్చే చాన్స్ చాలా తక్కువని పరిశోధనలు చెబుతున్నాయి. పెరుగు శరీరంలో తేమ శాతం తగ్గిపోకుండా కాపాడుతుంది. అందుకే జీర్ణవ్యవస్థ పనితీరు బాగుంటుంది. పొట్టలో ఇన్ఫెక్షన్లు రాకుండా ఉంటాయి. హైబీపీ కూడా అదుపులోకి వస్తుంది. పని వల్ల బాగా ఒత్తిడికి గురైనవారు పెరుగు తీసుకుంటే అలసట తీరుతుంది. మంచి నిద్రలోకి వెళ్లి మెదడుపై ఒత్తిడి తగ్గుతుంది. కాబట్టి రోజువారీ ఆహారంలో తప్పనిసరిగా పెరుగు భాగం చేసుకోవాలి. పెరుగులో క్యాల్షియం అధికంగా ఉంటుంది. ఇది ఎముకలకు, దంతాలకు మేలు చేస్తుంది. పెరుగులో ఫాస్ఫరస్ కూడా ఉంటుంది. ఇది క్యాల్షియంతో కలవడం వల్ల ఎముకలు స్ట్రాంగ్ గా ఉంటాయి. రోజూ పెరుగు తినడం వల్ల భవిష్యత్తులో కీళ్లనొప్పులు, ఆస్టియోపోరోసిస్ లాంటి సమస్యలు రాకుండా ఉంటాయి.

# వంకాయలను తేలిగ్గా తీసుకుంటే ఎన్నో లాభాలను కోల్పోతారు..!



వంకాయలను చాలా మంది ఎంతో ఇష్టంగా తింటుంటారు. ఇందులో అనేక రకాలు ఉంటాయి. పర్పుల్, తెలుపు,గ్రీన్ కలర్‌లలో వంకాయలు మనకు అందుబాటులో ఉన్నాయి. వంకాయలతో ఏ కూర చేసినా సరే ఎంతోరుచిగా ఉంటుంది. వంకాయలతో పచ్చడి, టమాటా కూర, వేపుడు ఎక్కువగా చేస్తుంటారు. వంకాయల్లో మన శరీరానికి ఉపయోగపడే అనేక పోషకాలు ఉంటాయి. 100గ్రాముల వంకాయలను తినడం వల్ల సుమా రుగా 17.8 గ్రాముల పిండి పదార్థాలు లభిస్తాయి.

ప్రోటీన్లు 8 గ్రాములు, శాచురేటెడ్ కొవ్వులు 5.2 గ్రాములు, ఫైబర్ 4.9 గ్రాములు, కొవ్వు 27.5 గ్రాములు, కొలెస్ట్రాల్ 16 మిల్లీగ్రాములు, చక్కెరలు 11.4 గ్రాములు, ఐరన్ 6 మిల్లీగ్రాములు లభిస్తాయి.

**విటమిన్ ఎఅధికం..:** వంకాయలను తింటే విటమిన్ ఎఅధికంగా లభి స్తుంది. అలాగే క్యాల్షియం, సోడియం, పొటాషియం కూడా అధిక మొత్తంలో పొందవచ్చు. ప్లీహం వాపులకు గురైన వారు వంకాయలను తింటే ఎంతో ఫలితం ఉంటుంది. పచ్చి వంకాయ పేస్టుకి చక్కెర కలిపి ఉదయం తినాలి. దీంతో కొలెస్ట్రాల్‌ను తగ్గించుకోవచ్చు. వంకాయ, టమాటా కలిపి తింటే అజీర్తి తగ్గుతుంది.

ఆకలి పెరుగుతుంది. వంకాయను తినడం వల్ల గ్యాస్, అసిడిటీ, కఫం వంటి సమస్యలు తగ్గుతాయి. వంకాయను ఉడకబెట్టి తేనెతో కలిపి ఉ దయం, సాయంత్రం కాస్త తింటే నిద్ర చక్కగా పడుతుంది. నిద్రలేమితో బాధపడేవారికి ఇది మంచి ఔషధంగా పనిచేస్తుంది.

**సూప్ కూడా తాగవచ్చు..:** వంకాయ సూప్‌ను కూడా తయారు చేసి తీసుకోవచ్చు. ఇందులో ఇంగువ, వెల్లుల్లి వేస్తే ఎంతో రుచిగా ఉంటుంది. ఈ సూప్‌ను తాగితే కడుపు ఉబ్బరం నుంచి ఉపశమనం లభిస్తుంది. షుగర్ ఉన్నవారు వంకాయలను తింటే దయాబెటిస్‌ను అదుపులో ఉ ంచుకోవచ్చు. వంకాయల్లో ఉండే ఫైబర్ షుగర్‌ను తగ్గించేందుకు సహాయం చేస్తుంది. కొన్ని ఆఫ్రికా దేశాల వారు వంకాయలను ఫిట్స్ తగ్గించేందుకు వాడుతారు. వంకాయల నుంచి రసం తీసి తయారు చేసిన ఆయింట్ మెంట్లు, టించర్లు పైల్స్‌ను తగ్గించేందుకు సహాయం చేస్తాయి. వంకాయలను పేదవారి ప్రోటీన్ ఫుడ్‌గా చెప్పవచ్చు. వంకాయలను తింటే ప్రోటీన్లు సమృద్ధిగా లభిస్తాయి. ఇవి శరీరానికి శక్తిని అందించడమే కాకుండా కండరాల నిర్మాణానికి దోహదం చేస్తాయి.

**వీరు తినకూడదు..:** అల్సర్ సమస్య ఉన్నవారు వంకాయలను తినకూ డదు. గర్భిణీలు వంకాయలను తినడం మంచిది కాదు. తింటే అలర్జీలు వచ్చే ప్రమాదం ఉంటుంది. కొందరికి వంకాయ పడదు.



## నేను వేరే పెళ్లి చేసుకోవాలని అనుకున్నా కాని.. ?

ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మాజీ భార్య రేణూ దేశాయ్ గురించి ప్రత్యేక పరిచయాలు అక్కర్లేదు. నటిగా, నిర్మాతగా, దర్శకురాలిగా సత్తా చాటింది. పవన్ కళ్యాణ్ నుండి విడిపోయిన తర్వాత రేణూ తన పిల్లలని చూసుకుంటూ కాలంగ గడుపుతుంది. ఈ మధ్య టైగర్ నాగేశ్వరరావు అనే సినిమాతో రీఎంట్రీ ఇచ్చింది. ఈ సినిమా హిట్ కాకపోవడంతో సైలెంట్ అయింది. అయితే సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే రేణూ దేశాయ్ అప్పుడప్పుడు పలు ఇంట్రెస్టింగ్ విషయాలని షేర్ చేస్తూ వార్తలలో నిలుస్తుంటుంది. పవన్ నుండి విడిపోయాక రేణూ దేశాయ్ మళ్లీ పెళ్లి చేసుకోలేదు. అప్పట్లో తాను ఎవరినో పెళ్లి చేసుకుంటుందని, ఎంగేజ్‌మెంట్ కూడా అయిపోయిందని వార్తలు వచ్చాయి.తాజాగా తన రిలేషన్ గురించి మాట్లాడుతూ.. అప్పట్లో నేను అరేంజ్డ్ నిశ్చితార్థం చేసుకోవాలి, వేరే రిలేషన్ షిప్‌లోకి వెళ్లాలి అని అనుకున్నాను. అయితే పెళ్లి చేసుకుంటే పిల్లలకి సరైన న్యాయం చేయలేనేమో అని ఆగాను. ఇప్పుడు పిల్లలు ఎదుగుతున్నారు. నేను వేరే జీవితం మొదలు పెడితే వారికి పూర్తి సమయం కేటాయించలేను. అందుకే వేరే రిలేషన్‌లోకి వెళ్లలేదు.ఆద్యకి 18 ఏళ్ళు దాటాక తనంతట తాను అన్ని పనులు చేసుకునే స్థాయికి వచ్చాక, తాను బిజీ అయ్యాక పెళ్లి గురించి ఆలోచిస్తానంటూ రేణూ కామెంట్ చేసింది. అంటే భవిష్యత్తులో రేణు దేశాయ్ రెండో పెళ్లి చేసుకొనే అవకాశాలు ఉన్నాయని స్పష్టంగా తెలుస్తుంది. ఇక అకీరా నందన్ వెండితెర ఎంట్రీ గురించి కూడా రేణూ దేశాయ్ మాట్లాడింది.

# నిరుపేదల గుర్తింపులో తిరకాసు

- పి-4 సర్వేలో లోపించిన పారదర్శకత
- బియ్యం కార్డులే ప్రామాణికం
- వలస కార్మికులకు జాబితాల్లో దక్కని చోటు



గుంటూరు : పేదరిక నిర్మూలనకు ప్రభుత్వం చేపట్టిన పి-4 సర్వేలో పారదర్శకత లోపించింది. పేదల గుర్తింపునకు బియ్యం కార్డునే ప్రామాణికంగా తీసుకుంది. దీంతో, బియ్యం కార్డులేని వారికి, వలస కార్మికులకు, ఎటువంటి చేయూత లేదని వారికి జాబితాలో చోటు దక్కలేదు. రాష్ట్రంలో 20 నెలలుగా బియ్యం కార్డుల జారీ నిల్చిపోవడంతో పేదలైనప్పటికీ పి-4 సర్వేకు దూరమయ్యారు. .రేషన్ కార్డు ఉన్నప్పటికీ ప్రభుత్వం నుంచి పింఛను పొందుతున్న వారిని, విద్యుత్ రాయితీ పొందుతున్న ఎస్సి, ఎస్‌టిలను ఈ సర్వేలో మినహాయించారు. నిరుపేద కుటుంబాలను గుర్తించి జిల్లాల నుంచి అధికారులు ప్రభుత్వానికి నివేదికలు పంపారు. ఈ కుటుంబాల వారిని బంగారు కుటుంబాలుగా ప్రభుత్వం పేర్కొంది. రాష్ట్రంలో 1.40 కోట్ల కుటుంబాలకు బియ్యం కార్డులు ఉన్నాయి. వీటిలో 20 శాతం కటుంబాలను నిరుపేదలుగా గుర్తించాలని ప్రభుత్వం మార్గదర్శ కాలు జారీ చేసింది. దీనికనుగుణంగా 29 లక్షల కుటుంబాలను గుర్తిం చినట్టు అధికార వర్గాలు తెలిపాయి. క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలిస్తే కుటుంబ ఆర్థిక పరిస్థితులు ఎప్పటికప్పుడు తారుమారు అవుతున్నాయి. ప్రధానంగా ప్రభుత్వ రంగంలో అవుట్ సోర్సింగ్ కార్మికులకు గరిష్ఠంగా రూ.15 వేలు వస్తుండడంతో గత ప్రభుత్వం వీరికి బియ్యం కార్డులు తొలగించింది. 60ఏళ్లు నిండాక వీరు ఉద్యోగం కోల్పోతున్నా వారికి తిరిగి బియ్యం కార్డులు ఇవ్వడం లేదు. గత 20 నెలలుగా బియ్యం కార్డుల జారీ ప్రక్రియ నిలిచి పోయింది. రాష్ట్రంలో వివిధ జిల్లాల్లో వైసిపి ప్రభుత్వం 2021లో నవశకం సర్వే పేరుతో ఆరెచెల విధానాన్ని అమలు చేసి 7.5 లక్షల కార్డులను రద్దు చేసింది. ఆ తరువాత దశల వారీగా కొన్నింటిని పునరుద్ధరించి నా దాదాపు ఐదు లక్షల కుటుంబాల వారు తెల్ల రేషన్ కార్డుకు దూరమయ్యారు. ఈ నేపథ్యంలో ఈ కుటుంబాలన్నీ పి-4 సర్వేకు వెలుపలే ఉన్నాయి. బియ్యం కార్డులు ఉన్న వారిలో 200 యూనిట్లలోపు విద్యుత్ వినియో గాన్ని ప్రమాణికంగా తీసుకుని నిరుపేదలుగా పరిగణించి సంబంధిత జాబితాలను గ్రామ, వార్డు సచివాలయాలకు అధికారులు పంపినట్టు తెలుస్తోంది. ప్రభుత్వమే పేదరికంలో ఉన్న వారి జాబితాలను గ్రామ, వార్డు సచివాలయాలకు పంపగా, సచివాలయాల ఉద్యోగులు వీరి వద్దకు వెళ్లి బయోమెట్రిక్ లేదా ఒటిపి ద్వారా వారు స్థానికంగా ఉంటున్నట్టు గుర్తించారు. ప్రభుత్వం రూపొందించిన మార్గదర్శకాల ప్రకారం ఎటువంటి వసతి, సరైన జీవనం లేనివారిని గుర్తించినట్టు చెబుతున్నా కేత్రస్థాయిలో పరిస్థితులు మాత్రం అందుకు భిన్నంగా ఉన్నాయి. విద్యుత్ వినియోగం 200 యూనిట్లలోపు ఉన్న వారిలో వారి కుటుంబంలో ఎవరికీ గణించదగ్గ ఆదాయం, ఆధార్ లింకుతో పరిశీలిస్తే ఎక్కడా ఎటువంటి ఆదాయం ఉన్నట్టు కన్పించని వారిని అధికారులే గుర్తించి సచివాల యాలకు పంపినట్టు తెలుస్తోంది. కానీ, వీరి కన్నాఅతి నిరుపేదలుగా ఉన్న వారు,కుటుంబాల్లో ఒంటరిగా ఉన్న వారు,పింఛన్లు లేని రిటైర్డు కార్మికులు,ఉద్యోగులు పి-4 సర్వేలోకి రాలేదు. వలస కార్మికులను అసలు పట్టించుకోలేదు. సచివాలయాల పరిధిలో మ్యాపింగ్ జరిగిన వారిని మాత్రమే గుర్తించారు. బీహార్, బెంగాల్, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ నుంచి వచ్చిన వలస కార్మికులు భవన నిర్మాణ రంగంలో కీలక భూమిక పోషిస్తుంటారు. వీరికి రేషన్ కార్డులు లేకపోవడంతో వీరిని గుర్తించడం లేదు. ఇతర జిల్లాల నుంచి వస్తున్న వలస కార్మికులున్నారు. వీరిలో కొందరికి పి-4 జాబితాలో చోటు దక్కలేదు. పట్టణాల్లో ట్యాప్ కనెక్షన్లు, పక్కా నివాసం ఉన్న వారిని పేదలుగా పరిగణించ లేదు. నెలవారీ విద్యుత్ వినియోగం, ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగంతోపాటు ఆదాయ పన్ను, జిఎస్‌టి రిటర్నులు, సొంత ఆస్తి, ఇల్లు, నాలుగు చక్రాల వాహనం, ఆదాయ మార్గాలు అద్దె, వడ్డీ, పింఛన్లు పొందుతున్న వివరాలను ముందే తెలుసుకున్న ఇందుకు సంబంధించిన వారి డేటాను పరిగణలోకి తీసుకోలేదు. నిరుపేదలు, అభాగ్యులు, ఎటువంటి చేయూతలేకుండా అన్న క్యాంటీన్లకు వస్తున్న అనేకమందిని కూడా ఈ జాబితాల్లోకి చోటు దక్కలేదు.

# క్షణాలలో గుండె జబ్బుల నిర్ధారణ..



### హైదరాబాద్ బాలుడి అద్భుత ఆవిష్కరణ
### ఏఐ యాప్‌ను అభివృద్ధి చేసిన హైదరాబాద్ బాలుడు
### బైడెన్, ఒబామా ప్రశంసలు

న్యూఢిల్లీ, : వైద్యరంగంలో తెలుగు బాలుడు సిద్ధార్థ్ నంద్యాల ఓ అద్భుతాన్ని ఆవిష్కరించాడు. ప్రస్తుతం అమెరికాలోని డల్లాస్‌లో నివాసముంటున్న 14ఏండ్ల సిద్ధార్థ్ తన ఆవిష్కరణతో ఇటు సాంకేతికరంగాన్ని అటు వైద్య రంగాన్ని అబ్బురపరిచాడు. అతడు ఆవిష్కరించిన యాప్ కృత్రిమే మేధ (ఏఐ) సాయంతో మనిషి గుండె ఆరోగ్యాన్ని నిర్ధారిస్తున్నది. సర్కేడియన్ ఏఐగా పేరుపెట్టిన ఆ పరికరం ఏడు క్షణాలపాటు గుండెచప్పుడు విని, అది ఆరోగ్యం గా ఉన్నదా లేక వ్యాధి బారిన పడిందా అన్నది వెంటనే తేల్చేస్తున్నది. దీంతో ప్రపంచంలోనే అతి పిన్న వయస్కుడైన ఏఐ ప్రొఫెషనల్‌గా సిద్ధార్థ్ రికార్డు సృష్టించాడు. అతడు ఆవిష్కరించిన పరికరంతో ఇప్పటికే వేలమందినిపరీక్షించగా, అమెరికామాజీ అధ్యక్షులు బరాక్ ఒబామా, జో బైడెన్‌ల నుంచి ప్రశంసా పత్రాలను కూడా అందుకున్నాడు. హైదరాబాద్‌కు చెందిన ఈ టీనేజర్ చిన్న వయసులోనే అమెరికా వలస వెళ్లాడు. 2023వ సంవత్సరానికిగాను సిద్ధార్థ్‌ను ఇన్నోవేటర్ ఆఫ్‌ది ఇయర్‌గా ఫ్రిస్కో చాంబర్ ఆఫ్ కామర్స్ ఎంపిక చేసింది. అదే ఏడాది అమెరికా ప్రజాప్రతినిధుల సభ అతడికి గుర్తింపు సర్టిఫికెట్‌ను జారీచేసింది.

**మీగుండె మీతో మాట్లాడితే!:** తన పరికరం పని విధానాన్ని సిద్ధార్థ్ వివరిస్తూ.. 'సర్కేడియన్ ఏఐ అనేది ఒక ఆటోమేటెడ్ పరికరం. ఇది ఏడు క్షణాలపాటు గుండె చప్పుడు విని సమగ్ర నివేదికను అందిస్తుంది. మీ గుండె ఆరోగ్యంగా ఉన్నదా లేక ఏమైనా సమస్యలున్నాయా అన్నది వెల్లడిస్తుంది' అని చెప్పాడు. 'మీ గుండె మీతో మాట్లాడితే ఎలా ఉంటుందో ఊహించండి.

ఏఐ సహకారంతో పనిచేసే ఈ పరికరం మీ గుండె అంతర్దృష్టిని అందిస్తుంది' అని అన్నాడు. ఈ యాప్‌ను గుండె వద్ద ఏడు క్షణాల పాటుఉంచితే అది40రకాల గుండె సంబంధిత వ్యాధులను పసిగడుతుంది అని తెలిపాడు. అమెరికాలో 15 వేల మందిని భారత్‌లో 700మందినిని, గుంటూరు,విజయవాడ ప్రభుత్వదవాఖానల్లో 992మందిని పరీక్షించగా 19మంది హృద్రోగులు ఉన్నట్టు వెల్లడైంది. ఆతరువాత వీరికి టూ(2)డీ ఈకో, ఈసీజీ పరీక్షలు నిర్వహించగా సర్కేడియన్ పరికరం తేల్చిందినూటికి నూరు శాతం కరెక్ట్ అని తేలింది. వైద్యరంగానికి సహాయకరంగా ఉండేందుకే దీనిని అభివృద్ధి చేశానని, సొంతానికి కాదని స్పష్టం చేశాడు.

# బన్నీతో జోడీగా?



అగ్ర కథానాయిక సమంత నటనతో పాటు సినీనిర్మాణంపై దృష్టి పెడుతూ బిజీగా ఉంది. మరోవైపు సోషల్‌మీడియాలో కూడా యాక్టివ్‌గా మారింది. ఇటీవలే ఈ అమ్మడు 'ఎక్స్'లోకి రీఎంట్రీ ఇచ్చిన విషయం తెలిసిందే. ప్రస్తుతం సమంత స్వీయ నిర్మాణంలో రూపొందిస్తున్న 'మా ఇంటి బంగారం' అనే చిత్రంలో నటిస్తున్నది. రెండేళ్లక్రితం వచ్చిన 'ఖుషీ' తర్వాత పెద్ద చిత్రాలు చేయలేదు సమంత. ఈ ఏడాది మాత్రం భారీ ప్రాజెక్ట్సలో భాగమయ్యేందుకు సిద్ధమవుతున్నదని తెలిసింది. తాజా సమాచారం ప్రకారం ఇటీవల ప్రకటించిన అల్లు అర్జున్-అట్లీ పాన్ ఇండియా చిత్రంలో సమంత కథానాయికగా నటించే అవకాశముందని చెన్నై ఫిల్మ్ సర్కిల్స్‌లో వినిపిస్తున్నది. ఈ సినిమాలో ఇద్దరు హీరోయిన్లకు చోటుంటుందట. మరో నాయికను బాలీవుడ్ నుంచి తీసుకుంటారని తెలుస్తున్నది. 'సన్నాఫ్ సత్యమూర్తి' సినిమాలో బన్నీతో జోడీగా నటించింది సమంత. ఆ తర్వాత 'పుష్ప'లో ప్రత్యేకగీతంలో ఆయనతో నర్తించింది. ఒకవేళ అట్లీ-బన్నీ ప్రాజెక్ట్‌లో సమంత నాయికగా ఖరారైతే ఇది వాళ్లిద్దరికి హ్యాట్రిక్ కాంబినేషన్ కానుంది. అయితే ఈ వార్తల్లో వాస్తవమెంతో తెలియాలంటే చిత్ర బృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సిందే అంటున్నారు.

# షాపింగ్ మాల్ ఓపెనింగ్స్‌కి కూడా కమిట్‌మెంట్స్ అడుగుతారు..




సినీ ఇండస్ట్రీకి సంబంధించిన సమస్యలలో కాస్టింగ్ కౌచ్ సమస్య ఒకటి. ఇటీవలి కాలంలో దీని గురించి ఎక్కువగా మనం వింటున్నాం. పలువురు నటీమణులు పలు సందర్భాలలో కాస్టింగ్ కౌచ్ గురించి మాట్లాడుతూ వార్తలలో నిలుస్తుంటారు. ఒకప్పుడు లైంగిక వేధింపుల గురించిఎవ్వరు అంతగా మాట్లాడలేదు కాని ఈ మధ్య మాత్రం ధైర్యంగా మీడియా ముందుకు వచ్చి తాము ఎదుర్కొన్న సమస్యలను బయట పెడుతున్నారు.. తాజాగా ఓ హీరోయిన్ ఇండస్ట్రీలో చాలా మంది కమిట్మెంట్స్ అడుగుతారని.. సినిమా ఛాన్స్‌ల కోసమే కాదు షాపింగ్ మాల్ ఓపినింగ్స్ కు కూడా కమిట్మెంట్ అడుగుతారని చెప్పి పెద్ద బాంబ్ పేల్చింది. సునీల్ హీరోగా నటించిన

భీమవరం బుల్లోడు సినిమాలో హీరోయిన్‌గా నటించిన ఎస్తేర్ నోరోన్హా అందరికి గుర్తుండే ఉంటుంది. ఈ అమ్మడు 2013లోపూరి జగన్నాథ్ తమ్ముడు సాయిరా మ్ శంకర్ హీరోగా నటించిన '1000 అబద్దాలు చిత్రంతో తెలుగు ఇండస్ట్రీలోకి అడుగుపెట్టింది. అయితే ఈ మూవీతో ఈ అమ్మడుకు అంత గుర్తింపు రాలేదు. ఆ తరువాత 'భీమవరం బుల్లోడు'సినిమాలో నటించి.. ఓ మాస్తరు విజయాన్ని అందుకుంది. అయితే ఎస్తర్ నోరోన్హ కు అనుకున్న స్థాయిలో అవకాశాలు అయితే రాలేదు. జయ జానకి నాయక,జులియెట్ లవర్ ఆఫ్ ఇడియట్ ఇలా బ్యాక్ టు బ్యాక్ సిని మాలు చేసిన ఏచిత్రం కూడామంచి విజయం సాధించలేదు. చేసింది తక్కువ సినిమాలే అయినా ప్రేక్షకులకు బాగా నచ్చేసింది ఈ అమ్మడు.

తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఎస్తేర్ నోరోన్హా మాట్లాడుతూ ..హీరోయిన్‌గాఎదగాలంటే చెడ్డ దారిలో వెళ్లి త్వరగా స్టార్ అవ్వొచ్చు.. కానీ అది నాకు ఇష్టం లేదు. మిగతా హీరోయిన్స్ మాదిరిగా నేను కమిట్‌మెంట్‌కి ఒప్పుకొని ఉంటే పెద్ద హీరోయిన్ అయ్యే దానిని. షాపింగ్ మాల్స్ ప్రారంభోత్సవానికి కూడా కమిట్మెంట్స్ అడుగుతారు అందుకే నేను వాటికి కూడా దూరంగా ఉంటాను అని ఎస్తేర్ పేర్కొంది. ప్రస్తుతం ఈ అమ్మడి కామెంట్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి.

# లవ్ స్టోరీలో బాలయ్య..!



మనటాలీవుడ్‌లో మాస్ సినిమాలు తీయాలంటే నందమూరి బాలకృష్ణతర్వాతే ఎవరైనా.కేవలం మాస్ సినిమాలు మాత్రమే కాదు, పౌరాణికం, జానపదం వంటి జానర్స్ కి కేర్ ఆఫ్ అడ్రస్ ఆయన. ఫ్యామిలీ స్టోరీస్ ఇప్పట్లో తియ్యడం లేదు కానీ,పాత రోజుల్లో ఫా మిలీ డ్రామాస్‌తో కూడా భారీ బ్లాక్ బస్టర్ హిట్స్ ని కొట్టిన చరిత్ర ఆయనది. అలా అన్ని జానర్స్ లో మెప్పించిన బాలయ్య లవ్ స్టోరీ జానర్ లో మాత్రం ఇప్పటి వరకు నటించలేదు. అదే విధంగా కామెడీ జానర్ లో కూడా ఆయన ఇది వరకు సినిమాలు చేయలేదు. అసలు బాలయ్యతో ఈజానర్స్ లో సినిమాలు తీయా లనే ఆలోచన ఎవరికీ రాదేమో. ఎందుకంటే ఆయనకీ ఉన్న మాస్ ఇమేజ్ అలాం టిది. అయితే బాలయ్య ఎలాంటి జానర్‌లో అయినా అద్భుతంగా నటించగల డు అని అనేక అందర్భాల్లో రుజువు అయ్యింది.ము ఖ్యంగా ఆయనలో హోస్టింగ్ చేసే టాలెంట్ ఉందని ఎవరైనా ఊహించారా?, అన్ స్టాపబుల్ షోలో అద్భుతమైన హోస్టింగ్ చేసి అందరినీ షాక్ కి గురి చేశాడు. బాలయలో ఇంత అద్భుతమైన టాలెంట్ ఉందా అని ప్రతీ ఒక్కరు ఆశ్చర్యపోయారు. ఒక్కమాటలో చెప్పాలంటే ఇప్పటి వరకు మన స్టార్ హీరోలందరూ పలు షోస్‌కి హోస్ట్‌గా వ్యవహరించారు



## అల్లు అర్జున్-అట్లీ సినిమాకు అభయంకర్ సంగీతం

అల్లు అర్జున్‌తో తమిళ దర్శకుడు అట్లీ కొత్త సినిమా చేయబోతున్నాడు. సైన్స్‌ఫిక్షన్ ఎంటర్‌టైనర్ కథతో ఇది తెరకెక్క నుంది. ఈమేరకు ఓ వీడియో కూడా మేకర్లు విడుదల చేశారు. వీటిని పాడి అందులో కనిపించిన యువకుడే ఈ సాయి అభయంకర్. గతంలో తెలుగు, తమిళ సినిమాల్లో పాటలు పాడిన సింగర్స్ టిప్పు-హరిణిల కుమారుడే సాయి. ఇతడు ప్రయివేటు ఆల్బమ్ సాంగ్స్‌తో గుర్తింపు తెచ్చుకుంటున్నారు. అనిరుధ్ దగ్గర స్పెషల్ ప్రోగ్రామ్ కంపోజర్‌గా పనిచేశాడు. గతేడాది 'బెంజ్' అనే తమిళ సినిమాకు సంగీత దర్శకుడుగా వ్యవహరించారు. ప్రస్తుతం మరో ప్రాజెక్టుల్లో పనిచేస్తున్నాడు.

Published, printed and Owned by Merugu Chandra Mohan Printed at Sahaja publications, H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. Published from H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. rni. no: TELTEL/2023/88215